# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 20 సెప్టెంబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 255 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


### తోడు కోసం 4,126 కిమీ
## కుక్కల ప్రేమ యాత్ర



2

### సికిందరాబాద్-శ్రీకాకుళం మధ్య 16 పండుగల రైళ్లు



2

# ఏం జరగొచ్చు?



### ఫిరాయింపు ఎమ్మెల్యేలకు టెన్షన్
### భవిష్యత్‌పై న్యాయవాదులతో చర్చలు
### అనర్హత వేటు పడినా మళ్లీ కాంగ్రెస్ నుంచే పోటీ చేసే యోచన

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం బ్యూరో): ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలలో టెన్షన్ నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి అనంతరం కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఆయనను రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అనర్హుడిగా ప్రకటించింది. దీనిపై గతంలో అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని సైతం తప్పుపట్టిన హైకోర్టు ధర్మాసనం ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించింది. హైకోర్టు తీర్పు అనంతరం కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై వేటు పడింది. అయితే, మిగిలిన పిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా ఇదే గతి పడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, ...మిగతా 2లో

# సుప్రీంకు దానం



- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఎస్ఎల్ పీ దాఖలు
- బీఆర్ఎస్, బీజేపీ కేవియట్

హైదరాబాద్, మనం ప్రతినిధి: పార్టీ ఫిరాయింపుల కారణంగా ఎమ్మెల్యే అర్హతను కోల్పోయిన దానం నాగేందర్.. తెలంగాణ హైకోర్టు తీర్పుతో అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. తాజా తీర్పు నేపథ్యంలో దానం..తన అనర్హతపై సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన నాగేందర్.. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు ...మిగతా 2లో



# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో
# తెలంగాణదే కీలక పాత్ర

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం
### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన సదస్సులో భట్టి

హైదరాబాద్ / న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):

వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సర్వసన్నద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక ...మిగతా 2లో

# వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్‌కు పేరు పెట్టండి

### ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం బ్యూరో): ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ విమానాశ్రయానికి మంచి పేరు సూచించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ నేతలు పదేళ్లుగా కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్ హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వరంగల్ విమానాశ్రయం సాధించడంపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. విమానాశ్రయం భూ సేకరణ కోసం ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల నెరవేరుతోందన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదనీ, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు గేట్ వే అని ...మిగతా 2లో

### సినీ ప్రముఖుల 'పేర్లు'

2

# ఉడాన్‌తో బోలెడు ఉద్యోగాలు

### 5,500 మంది విద్యార్థులకు టెక్ స్కిల్స్‌పై ట్రైనింగ్
### టాస్క్, డెల్ టెక్నాలజీస్ మధ్య ఒప్పందం
### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,సెప్టెంబర్ 19 (మనం న్యూస్): యువతకు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. మంత్రి శ్రీధర్ బాబు నేతత్వంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) డెల్ టెక్నాలజీస్ మధ్య 'ఉడాన్' కార్యక్రమం అమలుకు ...మిగతా 2లో

# జన్వాడ ఫామ్‌హౌస్ అక్రమ నిర్మాణమే

- నాలాపై కట్టిన నిర్మాణానికి అనుమతులు లేవు
- అసలు యజమాని ఎవరనే అనుమానాలున్నయ్
- కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల





హైదరాబాద్, మనం ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫార్మ్‌హౌస్‌ను (కేటీఆర్ ఫార్మ్‌హౌస్‌గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం శనివారం నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఫాంహౌస్ పరిశీలన అనంతరం నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... జన్వాడ ఫార్మ్‌హౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. కేవలం ఓ మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన ఈ ఫార్మ్‌హౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల ...మిగతా 2లో

### ఎర్రవల్లి భూముల సర్వేలో ట్విస్ట్

- ఆ 180 ఎకరాలు మావేనంటున్న వెంకటాపూర్ రైతులు
- ఎర్రవల్లి, వెంకటాపూర్‌ల నడుమ గట్టు పంచాయతీ
- మాదంటే మాదేనంటున్న ఇరు గ్రామాల ప్రజలు

2



## అమిత్ షాకు అస్వస్థత

హుబ్బళ్లి, సెప్టెంబర్ 19: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అస్వస్థతకు గురయ్యారు. షెడ్యూల్ ప్రకారం శనివారం ఆయన కర్ణాటకలోని హుబ్బళ్లిలో రూ.700 కోట్లతో నిర్మించిన కేఎల్ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసావిరమఠ్ మెడికల్ కళాశాల నూతన భవనంతోపాటు, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించాల్సి ఉంది. ఈ క్రమంలో, శుక్రవారం రాత్రే ఆయన హుబ్బళ్లిలోని హోటల్కు చేరుకున్నారు. అక్కడ అస్వస్థతకు గురికావడంతో వైద్యుల సలహా మేరకు కార్యక్రమానికి ...మిగతా 2లో

# ఢిల్లీ మే క్యా హోరా?

### హస్తినలో హస్తం నేతల మకాం
### మూడు రోజులుగా అక్కడే పీసీసీ చీఫ్
### తాజాగా ఢిల్లీకి చేరిన డిప్యూటీ సీఎం భట్టి
### క్యాబినెట్ విస్తరణ, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మార్పుపై చర్చ



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం బ్యూరో): ఢిల్లీ వేదికగా రాష్ట్ర రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. గత కొంత కాలంగా ఊరిస్తున్న క్యాబినెట్ విస్తరణ అంశంతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మార్పు వ్యవహారంపై హస్తినలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మూడు రోజులుగా ఢిల్లీలో మకాం వేయగా, తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఢిల్లీకి చేరుకున్నారు. దీంతో ఢిల్లీలో ఏం జరుగుతోంది? అంటూ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారు. దీంతో ఒక బెర్తు ఖాళీ అయింది. అంతకు ముందు నుంచే రెండు బెర్తులు ఖాళీగా ఉండగా, సురేఖ బర్తరఫ్‌తో ఖాళీ అయిన బెర్తుతో కలిపి క్యాబినెట్‌లో మొత్తం మూడు ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మూడు రోజుల క్రితం ఢిల్లీకి చేరుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న మహేశ్ గౌడ్‌ను ఆ పదవి నుంచి తప్పించి ఆయనకు మంత్రివర్గంలో ప్రాతినిథ్యం కల్పిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అందుకే ఆయనను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఢిల్లీకి పిలిపించిందన్న చర్చ జరుగుతోంది. మంత్రి పదవిపై తనకు ఆసక్తి లేదని మహేశ్ గౌడ్ గతంలో ...మిగతా 2లో

# సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం

### పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి 45 రోజుల గడువు
### జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో త్రిసభ్య కమిటీల ఏర్పాటు
### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





3

## 22ఎ భూ సమస్యలకు త్వరలో పూర్తి సొల్యూషన్

### అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు జీవో 118, 76ల విడుదలతో ముందడుగు

## క్యూర్ పరిధిలో 21 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పూర్తి

### ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి: మంత్రి
### తొమ్మిది వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



# మేమిద్దరం మంచి దోస్తులం

### కానీ, ఒకరిపై ఒకరం గూఢచర్యం చేసుకుంటం
### చైనాపై ట్రంప్ వ్యాఖ్యలు
### నెలాఖరులో జిన్‌పింగ్ అమెరికా పర్యటన

వాషింగ్టన్, సెప్టెంబర్ 19: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌ను ఉద్దేశించి కీలక ...మిగతా 2లో

# చిట్టి రోబో మనిషిని మింగేస్తుందా?



### ఎఐతో ప్రశ్నార్థకంగా మానవ మనుగడ?
### మేధో వికాసమా? మానవాళి వినాశనమా?



హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్): సైన్స్ ఫిక్షన్ నవలల్లోని కల్పన కాదు.. సిల్వర్ స్క్రీన్ పై విస్మయం గొలిపిన మాయాజాలం అంతకన్నా కాదు. నేడు మన కళ్ల ముందే రూపుదిద్దుకుంటున్న, అత్యంత వేగంగా ...మిగతా 2లో

### 3 కంపెనీలను హ్యాక్ చేసిన జెమినై ఏఐ
### ధృవీకరించిన గూగుల్




2

# ప్రపంచానికి నీటి గండం

WORLD METEOROLOGICAL ORGANIZATION



### వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు
### ఇంకిపోతున్న భూగర్భ జలాలపై డబ్ల్యూఎంవో ఆందోళన

వాషింగ్టన్, సెప్టెంబర్ 19: ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల కారణంగా భూమిపై నీటి వ్యవస్థ (వాటర్ సైకిల్) తీవ్ర అస్తవ్యస్తంగా, అత్యంత ప్రమాదకరంగా మారుతోందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. గ్లేసియర్లు (హిమానీనదాలు) వేగంగా కరిగిపోతుండటం, మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో ఒకచోట భారీ వరదలు, మరోచోట కరవులు సంభవిస్తున్నాయని పేర్కొంది. రానున్న భయంకరమైన ఎల్ నినో ప్రభావం ఈ సంక్షోభాన్ని మరింత ...మిగతా 2లో

# సికిందరాబాద్-శ్రీకాకుళం మధ్య 16 పండుగల రైళ్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** రాబోయే పండగల సీజన్ను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైలు సర్వీసులు నడిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య 16 ప్రత్యేక రైళ్ల సర్వీసులను నడపనున్నట్లు శనివారం మధ్యాహ్నం ప్రకటించారు. ఈ ప్రత్యేక సర్వీసులు అక్టోబరు 6 నుంచి నవంబరు 25వరకు ప్రతి మంగళ, బుధ వారాల్లో రాకపోకలు సాగిస్తాయని ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. 07037 నంబర్ రైలు చర్లపల్లి నుంచి అక్టోబరు 6, 13, 20, 27, నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో బయల్దేరి మరుసటి రోజు శ్రీకాకుళం చేరుకుంటుంది. అలాగే, 07038 నంబర్ రైలు అక్టోబర్ 7, 14, 21, 28, నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ నుంచి బయల్దేరి మరుసటి రోజు చర్లపల్లికి వెళ్తుంది. అయితే, ఈ రైళ్లు బయల్దేరే, గమ్యస్థానానికి చేరుకొనే సమయాలను మాత్రం ఇంకా అధికారులు ప్రకటించలేదు. ఈ ప్రత్యేక రైలు సర్వీసులు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు జంక్షన్, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి. వీటిలో ఏసీ టూ టైర్, ఏసీ త్రీటైర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్ లుంటాయి.

## తోడు కోసం 4,126 కిమీ కుక్కల ప్రేమ యాత్ర

**వాషింగ్టన్, సెప్టెంబర్ 19 (మోంటానా/అమెరికా):** ప్రపంచంలో అంతరించిపోయే దశలో ఉన్న జంతు జాతుల్లో ఆఫ్రికన్ అడవి కుక్కలు కూడా ఉన్నాయి. సాధారణ కుక్కల కంటే భిన్నమైన ఈ జంతువులు ఇప్పుడు దాదాపు 6,000 మాత్రమే మిగిలాయి. ఈ నేపథ్యంలో ఆఫ్రికన్ అడవుల్లోని మూడు మగ కుక్కలు తోడు కోసం ఏకంగా 4,126 కి.మీ. నడిచి కనుమరుగవుతున్న జీవజాతుల్లో కొత్త ఆశలు రేపాయి. గతంలో తాము రికార్డు చేసిన ప్రయాణాల కంటే ఇది చాలా అసాధారణమని అమెరికాలోని మోంటానా స్టేట్ యూనివర్సిటీ సంరక్షణ శాస్త్రవేత్త స్కాట్ క్రీల్ తెలిపారు. జీపీఎస్ ట్రాకింగ్ కాలర్లు అమర్చడం ద్వారా గత పదహారేళ్లలో 500కు పైగా ఆఫ్రికన్ అడవి కుక్కలను ఈయన అధ్యయనం చేశారు.ఈ అడవి కుక్కల విషయానికి వస్తే ప్రతి గుంపులోనూ ఒక ఆల్ఫా మగకుక్క మరో ఆల్ఫా ఆడకుక్కతో మాత్రమే కలిసి సంతానోత్పత్తి చేస్తుంది. ఆయా గుంపులకు నాయకులుగా ఆధిపత్యం చెలాయించే వాటిని ఆల్ఫా కుక్కలని అంటారు. తోడు కోసం ఈ కుక్కలు చేసే ప్రయాణాలు చాలా ప్రమాదకరంగానూ ఉంటాయి. అడవి జంతువుల మాంసం కోసం ఏర్పాటుచేసే తీగ ఉచ్చులు వీటికి ప్రాణాంతకంగా మారుతాయి. సింహాలు, నదుల్లోని మొసళ్లతోనూ ముప్పే. ఈ కారణంగా తోడు కోసం బయలుదేరే అడవి కుక్కల్లో సగానికి పైగా మార్గమధ్యంలోనే చనిపోతాయి.

# ప్రపంచానికి నీటి గండం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రతరం చేయనుందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా భవిష్యత్తులో ప్రజల జీవనోపాధి, ఆరోగ్యం, ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదికలో పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచం ముందు భారీ నీటి సంక్షోభం ముప్పు పొంచి ఉందని, ఇదంతా మానవాళి మనుగడకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయని హెచ్చరించింది. ఐదేళ్ల పాటు పరిశోధన చేసిన స్టేట్ ఆఫ్ గ్లోబల్ వాటర్ రిసోర్సెస్ రిపోర్టులో డబ్ల్యూఎంవో ఈ కీలక విషయాలు వెల్లడించింది. గత ఐదేళ్లలో సంభవించిన నీటి సంబంధిత విపత్తుల్లో (వరదలు, కరవులు) సగానికిపైగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే ఉన్నాయని డబ్ల్యూఎంఓ స్పష్టం చేసింది. ఈ రిపోర్ట్ ప్రకారం, నీటి విపత్తుల వల్ల సంభవించిన మరణాల్లో 80 శాతానికిపైగా ఈ రెండు ఖండాల్లోనే నమోదవడం గమనార్హం. కొన్ని చోట్ల ఒక విపత్తు నుంచి కోలుకోక ముందే మరో తీవ్ర ఘటన సంభవించిందని పేర్కొంది. డబ్ల్యూఎంఓ నివేదిక ప్రకారం, భూమిపై ఉన్నటువంటి అన్ని ప్రధాన గ్లేసియర్ ప్రాంతాలు మంచును కోల్పోతుండటం ఇది వరుసగా నాలుగో ఏడాది. 2023-25 మధ్య కాలంలో చూస్తే గ్లేసియర్లు ఏకంగా 1400 గిగాటన్నుల మంచును కోల్పోయాయి. ఈ నీరు ఎంత ఎక్కువ అంటే దీనితో సుమారు 56 కోట్ల ఒలింపిక్ పరిమాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్స్‌ను నింపొచ్చు. ఇంకా సమస్త మానవాళి ఏడాది పొడవునా ఉపయోగించే మంచినీటిలో సుమారు మూడోవంతుకు సమానం. 2025లో ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండింతల బావుల్లో భూగర్భ జలాలు చారిత్రక సగటు కంటే కూడా దారుణంగా పడిపోయాయి. భూమిపై నీటి నిల్వల్లో భూగర్భ జలాల పాత్ర కీలకం. కానీ భారత్, ఐరోపా, అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలోని పలు ప్రాంతాల్లో ఈ భూగర్భ జలాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2022-25 మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో తరచుగా భూగర్భ జలాల లోటు నమోదైంది.

**ఇంకా 2025 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా నదుల్లో నీటి ప్రవాహం**

గణనీయంగా తగ్గిపోయింది. అంటే నదుల్లో నీటి మట్టాలు కూడా వేగంగా పడిపోతున్నాయని, గత 35 ఏళ్లలో చూస్తే అత్యల్ప నీటి ప్రవాహం నమోదైన సంవత్సరాల్లో ఇదొకటిగా నిలిచిందని డబ్ల్యూఎంవో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అమెజాన్, జాంబేజీ, నైలు వంటి ప్రధాన నదీ పరివాహక ప్రాంతాల్లోనూ నీటి ప్రవాహాలు పెద్ద మొత్తంలో పడిపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. ప్రపంచ దేశాలు సహకరించుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రపంచ వాతావరణ సంస్థ చెప్పుకొచ్చింది.

# మేమిద్దరం మంచి దోస్తులం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. చైనా-అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. అదే సమయంలో ఇరుదేశాలూ పరస్పరం గూఢచర్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. గతంలో తమ అధికారి ఒకరు మాట్లాడుతూ అగ్రరాజ్యంపై చైనా గూఢచర్యం చేస్తోందని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే తాము కూడా బీజింగ్ విషయంలో అదే పని చేస్తుండడంతో దాన్ని అంతగా పట్టించుకోలేదని తెలిపారు.

''జిన్‌పింగ్ వచ్చే వారం అమెరికాకు వస్తారు. ఇతర దేశాలతో సంబంధాలు అంత బాగా లేకపోయినా.. మాకు చైనాతో మంచి అనుబంధం ఉంది. ఆయనతో సమావేశానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఆ చర్చల్లో పలు కీలక ఒప్పందాలు చేసుకోబోతున్నాం. ప్రతి ఒప్పందం వెనక ఓ స్పష్టమైన ఉద్దేశం ఉంటుంది'' అని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా ఈ నెలాఖరులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. సతీమణి పెంగ్ లియువాన్‌తో కలిసి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ట్రంప్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి మరీ ఆయనను స్వాగతించనున్నట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ డీసీకి సమీపంలోని సైనికస్థావరంలో ఉన్న ఎయిర్‌పోర్టుకు వెళ్లి జిన్‌పింగ్ దంపతులను అధ్యక్షుడు స్వాగతించే అవకాశం ఉందని వైట్‌హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల నేతలతో ప్రముఖ టెక్ దిగ్గజాలు ఎలాన్ మస్క్, సుందర్ పిచాయ్, టిమ్ కుక్, మైఖేల్ డెల్, జెఫ్ బెజోస్, జెన్సన్ హువాంగ్, శామ్ ఆల్ట్మన్, జేన్ ఫ్రేజర్ సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ భేటీలో కృత్రిమ మేధపైనా చర్చలు జరిగే అవకాశం ఉంది.

# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణదే కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రగతిని వివరిస్తూ, 2025-26లో తెలంగాణ స్థూల ఉత్పత్తి రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందని భట్టి వెల్లడించారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటుతో పోలిస్తే దాదాపు రెండింతలు అని ఆయన వివరించారు. ప్రస్తుత వృద్ధి పథం ఆధారంగా 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఏకంగా 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని సంకల్పించామని ఆయన ప్రకటించారు. తద్వారా జాతీయ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

**వనరుల సమీకరణ:**

మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతికి స్వస్తి పలకాల్సిన సమయం వచ్చిందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో వనరులను సమీకరించి, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాలు, గ్రీన్ బాండ్ల ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. అలాగే, రాష్ట్రంలో సమతుల్య అభివృద్ధి కోసం 'క్యూర్', 'ప్యూర్', 'రేర్'విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌ను గ్లోబల్ టెక్నాలజీ కేంద్రంగా మలచడంతో పాటు, రవాణా మార్గాల వెంట పారిశ్రామిక క్లస్టర్లు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టామని భట్టీ తెలిపారు.దేశంలోనే తొలి నెట్-జీరో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. యువతే తెలంగాణకు అతిపెద్ద బలమని పేర్కొన్న భట్టి విక్రమార్క... ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పనిచేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏం జరగొచ్చు?

(మొదటి పేజీ తరువాయి)

సంజయ్, అరికపూడి గాంధీ, పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రకాశ్ గౌడ్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కడియం శ్రీహరి తమ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. ఈ ఎమ్మెల్యేలంతా గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీ ఫాంపై గెలిచినప్పటికీ అనంతరం కాంగ్రెస్ పార్టీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన సమయంలో తాము అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరలేదనీ కేవలం తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిశామని వివరణ ఇచ్చారు. దీంతో స్పీకర్ ఈ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంటూ వారిపై అనర్హత వేటు వేయడానికి నిరాకరించారు. తాజాగా, దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసిన నేపథ్యంలో ఈ ఎమ్మెల్యేలంతా తమ భవిష్యత్ కార్యాచరణపై న్యాయవాదులతో సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం. హైకోర్టు విచారణ సందర్భంగా తాము పార్టీ ఫిరాయించలేదని చెప్పడానికి ఎలాంటి ఆధారాలను సమర్పించాలని అడుగుతున్నట్లు తెలిసింది. ఒకవేళ హైకోర్టు ధర్మాసనం బీఆర్ఎస్ వాదనలను బలంగా నమ్మి తమపై అనర్హత వేటు వేసిన పక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ టికెట్‌పైనే పోటీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే దానం సైతం తనపై అనర్హత వేటు పడగానే సీఎం రేవంత్‌తో సమాలోచనలు జరిపిన అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. సీఎం సైతం ఆయనకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టమైన హామీ ఇచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే మద్దతు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ నుంచి తమకు లభిస్తుందన్న విశ్వాసంతో ఉన్న ఫిరాయింపు ఎమ్మెల్యేలు తమపై హైకోర్టు అనర్హత వేటు వేసిన పక్షంలో దానం నాగేందర్ బాటలోనే నడవాలని నిర్ణయించినట్లు సమాచారం.

# సుప్రీంకు దానం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది.

మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

# జన్వాడ ఫామ్‌హౌస్ అక్రమ నిర్మాణమే

(మొదటి పేజీ తరువాయి)

కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫార్మ్‌హౌస్ నిర్మించారని, శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్త పేరిట కూడా భూములున్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫార్మ్‌హౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

# అమిత్ షాకు అస్వస్థత

(మొదటి పేజీ తరువాయి)

హాజరుకాకుండా హోటల్లోనే ఉండిపోయారు. అమిత్ షా గైర్హాజరైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యాశాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్, రాజ్యసభ మాజీ ఎంపీ ప్రభాకర్ కోరే మాట్లాడుతూ.. ఈ చరిత్రాత్మక కార్యక్రమానికి అమిత్ షా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ.. ఆరోగ్య కారణాల రీత్యా దూరంగా ఉన్నారని వెల్లడించారు.

# ఉడాన్'తో బోలెడు ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 25 శిక్షణ కేంద్రాల్లో 5,500 మంది విద్యార్థులకు మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ తయారీతో పాటు ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ స్కిల్స్ పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఐఐటీ ఢిల్లీ రూపొందించిన కరిక్యులమ్ ఆధారంగా శిక్షణ కొనసాగనుండగా, డెల్ టెక్నాలజీస్ అవసరమైన టెక్నాలజీ సపోర్ట్ అందించనుంది. 'ఉడాన్' కార్యక్రమం కేవలం శిక్షణకు పరిమితం కాకుండా విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా రూపొందించారు.

విద్యార్థులకు ఇండస్ట్రీ ఎక్స్పోజర్, ఉద్యోగ నైపుణ్యాలతో పాటు అప్రెంటిస్షిప్.. ఎంటర్ప్రెన్యూర్షిప్ అవకాశాలపై కూడా అవగాహన కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు సైతం ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్ అందేలా కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. ఎడ్యుకేషన్ నుంచి స్కిల్లింగ్, స్కిల్లింగ్ నుంచి ఎంప్లాయ్మెంట్ దిశగా యువతను తీసుకెళ్లే ట్రైనింగ్-టు-ఎంప్లాయ్మెంట్ ఎకోసిస్టమ్ను బలోపేతం చేయడమే ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశంగా ఉంది. శిక్షణ పొందిన వారి సంఖ్యకే ప్రాధాన్యం ఇవ్వకుండా, వారికి వాస్తవంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా 'ఉడాన్'ను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

# ఎర్రవల్లి భూముల సర్వేలో ట్విస్ట్

- **ఎర్రవల్లి, వెంకటాపూర్‌ల నడుమ గెట్టు పంచాయతీ**
- **మాదంటే మాదేనంటున్న ఇరు గ్రామాల ప్రజలు**
- **ఎర్రవల్లి 325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల భూములపై కొనసాగుతున్న సర్వే, పరిశీలన**
- **పాత ఖాస్రా, సేత్వార్ రికార్డులు పరిశీలించాలని డిమాండ్**
- **ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ హద్దుల పరిశీలన**
- **రైతులకు నోటీసుల తర్వాత ఎంజాయ్‌మెంట్ సర్వే**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫార్మ్‌హౌస్ సమీపంలోని ప్రభుత్వ భూముల సర్వేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల భూమిపై రెవెన్యూ, సర్వే అధికారులు చేపట్టిన సర్వే మూడో రోజుకు చేరుకోగా, ఈ వివాదంలోకి పొరుగున ఉన్న వెంకటాపూర్ గ్రామస్థులు ప్రవేశించారు. సర్వే చేస్తున్న భూమిలో తమ వాటా కూడా ఉందని వారు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు.

పూర్తి వివరాల్లోకి వెళితే... సర్వే నంబర్ 325 కింద ఉన్న మొత్తం 388 ఎకరాల భూమిలో కేవలం 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లికి చెందినవని, మిగిలిన సుమారు 180 ఎకరాలు తమ వెంకటాపూర్ గ్రామ పరిధిలోకి వస్తాయని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు పొరపాటున తమ గ్రామ పరిధిలోని భూమిని ఎర్రవల్లి సర్వే నంబర్‌లో కలిపారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఖస్రా, సేత్వార్ పహాణీ వంటి పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వేను పక్కాగా నిర్వహించి, తమ భూమిని గుర్తించి వేరు చేయాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు, అధికారులు తమ సర్వే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ భూమిని ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులను గుర్తించే పనిలో భాగంగా వారికి నోటీసులు జారీ చేయడం ప్రారంభించారు. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, శనివారం ఒక్కరోజే సుమారు 50 మందికి నోటీసులు అందజేశారు. నిర్దేశిత తేదీల్లో రైతులు తమ భూముల వద్దకు వచ్చి, సంబంధిత వివరాలు అందించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

ఈ నెల 21 నుంచి నాలుగు దశల్లో సర్వేను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయ్యాక, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం భూమిని సాగు చేస్తున్న, అనుభవంలో ఉన్న రైతులను గుర్తించేందుకు 'ఎంజాయ్ మెంట్ సర్వే' కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అయితే, వెంకటాపూర్ గ్రామస్థుల వాదనతో ఈ సర్వే ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. రెండు గ్రామాల మధ్య నెలకొన్న ఈ సరిహద్దు వివాదాన్ని అధికారులు ఎలా పరిష్కరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఢిల్లీ మే క్యా హోరా?

(మొదటి పేజీ తరువాయి)

పలుమార్లు ప్రకటించినప్పటికీ ఆయనకు క్యాబినెట్‌లో స్థానం కల్పించి మరొక బలమైన బీసీ నేతకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం లేకపోలేదని గాంధీభవన్ వర్గాల టాక్. దీనికి తోడు ప్రస్తుతం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్యాభ్యాసం కోసం లండన్ వెళుతున్నారు. ఆమె స్థానంలో ఎవరిని నియమించాలి అనే అంశంపై సైతం ఏఐసీసీ పెద్దలు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో చర్చిస్తున్నట్లు సమాచారం. మీనాక్షి స్థానంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, దిగ్విజయ్ సింగ్ పేర్లు ఏఐసీసీ నేతల పరిశీలనలో ప్రముఖంగా ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఇదిలా ఉండగా, తాజాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఢిల్లీకి చేరుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, క్యాబినెట్ విస్తరణ అంశంతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా కొత్త నేతను ఎంపిక చేసే అంశంపై సైతం ఆయనతో అధిష్టానం పెద్దలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో ఉండటంతో రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కోసం గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న ఆశావహులు మరోసారి తమ ప్రయత్నాలకు పదును పెట్టారు.

ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలను తమకు సన్నిహితులైన నేతల ద్వారా తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దసరాలోగా మంత్రివర్గ విస్తరణకు ఏదైనా అవకాశం ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే ఢిల్లీకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

## వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్‌కు పేరు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న అనుసంధానించబడిన తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదరు చూస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, మామునూరు విమానాశయ పనులు కీలక దశకు చేరుకున్నాయి. భూసేకరణ, సాంకేతిక అనుమతుల దశలను దాటుకుని నిర్మాణ పనులు మూడు దశల్లో చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, ఆఖరు ప్యాకేజీ పనులైన టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్, ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను త్వరలో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్లు త్వరలో పిలిచి డిసెంబర్‌లో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఏఏఐ వర్గాలు వెల్లడించాయి.

# సినీ ప్రముఖుల 'పేర్లు'

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్'లో చేసిన సూచనకు పలువురు సినీ ప్రముఖులు స్పందించి వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేర్లు సూచించారు. దర్శకులు సందీప్ రెడ్డి వంగా తన సొంతూరుకు విమానాశ్రయం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు తాను అనుకుంటున్న పేర్లను ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్.

విమానాశ్రయానికి వరంగల్ ఘనమైన వారసత్వాన్ని, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించే పేరును పెట్టడం నిజంగా ఎంతో అర్థవంతంగా ఉంటుంది. ఇందుకు కృషి చేసి, విమానాశ్రయం కలను వాస్తవంలోకి తెచ్చిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిగారికి ధన్యవాదాలు'' 'దసరా', 'ది ప్యారడైజ్' చిత్రాల దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఆనందం వ్యక్తం చేశారు. వరంగల్ మ్యాప్లో ఒక ప్రాంతం మాత్రమే కాదని, లక్షలాది ప్రజల భావోద్వేగమన్నారు. చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతకు ఆలవాలమన్నారు. ఈ సందర్భంగా సీఎంకు ధన్యావాదాలు తెలిపిన ఆయన, 'సమ్మక్క-సారక్క ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్' అనేక పేరు సూచించారు. అలాగే, సినీ నిర్మాత దిల్‌రాజుకు చెందిన చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. వరంగల్ కు ఎయిర్పోర్ట్ రావడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధితో పాటు, తెలుగు సినీ ఇండస్ట్రీకి మరింత ప్రోత్సాహంగా ఉంటుందని తెలిపింది. వరంగల్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ చిత్రాలు షూటింగ్ జరుపుకొనే అవకాశం లభిస్తుందని పేర్కొంది. మరోవైపు నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కూడా 'రాణి రుద్రమ దేవి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, వరంగల్' అని సూచించారు.

# చిట్టి రోబో మనిషిని మింగేస్తుందా?

(మొదటి పేజీ తరువాయి)

విస్తరిస్తున్న ఒక భయానక వాస్తవం! సాంకేతిక విప్లవం పేరుతో మానవాళి తన స్వంత మేధస్సుతో తనకు తానే ఉరితాడు బిగించుకుంటోందా? అంటే... అవుననే సమాధానం ఇస్తున్నాయి ఇటీవల కాలంలో తలెత్తుతున్న పరిణామాలు. అణుబాంబు ఎంతటి విధ్వంసకరమో, దానిని సృష్టించిన శాస్త్రవేత్తలందరూ తర్వాత ఎంతగా పశ్చాత్తాప పడ్డారో చరిత్ర చెబుతోంది. సరిగ్గా అదే కోవలోకి ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వచ్చి చేరుతోంది. విజ్ఞాన వికాసానికి ప్రతీకగా నిలవాల్సిన కృత్రిమ మేధ, రేపు మానవ జాతి సర్వనాశనానికే తొలి మెట్టు కాబోతోందా? ఈ ప్రశ్న నేడు ప్రపంచ దేశాలను, మేధావులను నిద్రపోనివ్వడం లేదు.

ఒకప్పుడు మనిషి తన మేధస్సుతో యంత్రాలను తయారు చేశాడు. తన పనులను సులువు చేసుకునేందుకు, శ్రమను తగ్గించుకునేందుకు వాటికి రూపమిచ్చాడు. కానీ, నేడు పరిస్థితి తలకిందులైంది. ఏఐ కేవలం ఒక పనిముట్టుగా మిగలలేదు సరికదా దాని సృష్టికర్త అయిన మనిషినే శాసించే స్థాయికి ఎదుగుతోంది. అల్గారిథమ్‌ల రూపంలో ఇది అల్లుకుంటున్న మాయాజాలం మనిషి ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను క్రమక్రమంగా హరిస్తోంది. ఉద్యోగాలు కరిగిపోవడం, ఉపాధి అవకాశాలు ఆవిరైపోవడం దీనివల్ల జరిగే ఆర్థిక నష్టమైతే.. మానవ సంబంధాలు, నిజానిజాల మధ్య వ్యత్యాసం చెరిగిపోవడం దీనివల్ల జరుగుతున్న సామాజిక వినాశనం. డీప్‌ఫేక్ వీడియోలు, తప్పుడు సమాచారం (ఫేక్ న్యూస్), అబద్ధాలను నిజాలుగా నమ్మించే కృత్రిమ సత్యాలు సమాజంలో అరాచకానికి బీజం వేస్తున్నాయి. ఎవరు నిజమో, ఏది కల్పితమో తెలియని అయోమయ స్థితిలోకి మానవాళి నెట్టబడుతోంది.

ముఖ్యంగా, ఏఐ వేగాన్ని నియంత్రించే విచక్షణాయుతమైన కళ్లెం ప్రస్తుతం ఎవరి చేతుల్లోనూ లేదు. కార్పొరేట్ దిగ్గజాల లాభాపేక్ష, దేశాల మధ్య ఆధిపత్య పోరు ఏఐ ని ఒక వినాశకర ఆయుధంగా మారుస్తున్నాయి. రేపు స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ యంత్రాలు (అటానమస్ సిస్టమ్స్) లేదా మనుషులను మించిన మేధస్సు (ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్) కనుక మానవ నియంత్రణను దాటితే... అది కేవలం ఒక వ్యవస్థ పతనం కాదు, యావత్ మానవ జాతి అంతం అవుతుందనే నిపుణుల హెచ్చరికలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. లోగడ స్టీఫెన్ హాకింగ్, ఎలన్ మస్క్ వంటి దిగ్గజాలు ముందే హెచ్చరించినట్లుగా, ఏఐని సరిగ్గా నియంత్రించలేకపోతే మానవాళి ఎదుర్కొనే చివరి ఆవిష్కరణ ఇదే కావచ్చు.సాంకేతికత మనిషి చెప్పు చేతుల్లో ఉండాలి తప్ప, మనిషి సాంకేతికతకు బందీ కాకూడదు. ఏఐ అభివృద్ధిని పూర్తిగా నిషేధించడం అసాధ్యం, అలా చేయడం కూడాసరికాదు. కానీ, దానికి కఠినమైన నైతిక సరిహద్దులను (ఎథికల్ బౌండరీస్) గీయాల్సిన తక్షణ కర్తవ్యం నేడు ప్రపంచ దేశాలపై ఉంది. లాభాల వేటలో పడిమానవాళి మనుగడనే పణంగా పెట్టే ప్రమాదకర ప్రయోగాలను అంతర్జాతీయ వేదికలపై కట్టడి చేయాలి.ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ విషయంలో అంతర్జాతీయంగా కఠినమైన నిబంధనలు తీసుకురాకపోతే భవిష్యత్తులో మానవాళి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించాల్సి వస్తోంది. ఈ ముప్పును నివారించడానికి ప్రపంచ దేశాలు,అంతర్జాతీయ సంస్థలు సమిష్టిగా బలమైన చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యం. అణు ఇంధన నియంత్రణ కోసం 'ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ' (ఐఎఈఎ) తరహాలో, ఏఐ పరిశోధనలను పర్యవేక్షించడానికి ఒక స్వయంప్రతిపత్తి కలిగిన అంతర్జాతీయ నియంత్రణ మండలిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచన. ఏఐ టూల్స్ తయారీలో అల్గారిథమ్‌లన పారదర్శకతను తప్పనిసరి చేయడంతో పాటు, డీప్‌ఫేక్స్ , తప్పుడు సమాచార సృష్టిని తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ కఠినమైన శిక్షాస్మృతులను అమలు చేయాలి.మానవ నియంత్రణను దాటేసే 'అటానమస్' వ్యవస్థల అభివృద్ధి, సైనిక రంగంలో ఏఐ ఆయుధాల వినియోగంపై ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఎజీఐ) పరిమితులతో స్పష్టమైన ఒప్పందాలు, నిషేధాలు ఉండాలి. కేవలం వ్యాపార లాభాల కోసం భద్రతా ప్రమాణాలను విస్మరించే టెక్ దిగ్గజాలపై కార్పొరేట్ జవాబుదారీతనం కింద భారీ జరిమానాలు ,చట్టపరమైన చర్యలు ఉండేలా కఠినమైన నిబంధనలు రూపొందించాలి.

## 3 కంపెనీలను హ్యాక్ చేసిన జెమినై ఏఐ

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఓపెన్‌ఏఐకి చెందిన కృత్రిమ మేధ ఏజెంట్ సైబర్ దాడికి పాల్పడినట్లు తెలిసింది. తాజాగా గూగుల్‌కు చెందిన మోడల్ 'జెమినై ఏఐ' కూడా 3 కంపెనీలను హ్యాక్ చేసింది. ఈ విషయాన్ని గూగుల్ ధ్రువీకరించింది. ఐఐ ఏజెంట్ల దాడి సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ సంస్థ ఇటీవల సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను రూపొందించింది. దానిని పరీక్షిస్తున్న సమయంలో జెమినై తన నిర్దేశిత పరిధులను దాటి.. మూడు ఇతర కంపెనీలకు చెందిన డిజిటల్ సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే తమ ఏఐ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ పనిచేయడం దానంతట అదే ఆగిపోయిందని తెలిపింది. 'సైబర్ సెక్యూరిటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఇతర పాస్ వర్డ్లను ఊహించి జెమినై ఏఐ బహిరంగ వెబ్ నుంచి మరో మూడు కంపెనీల డిజిటల్ ప్లాట్ఫామ్లలోకి అనధికారికంగా ప్రవేశించింది.

# బీసీ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పన

## ఐదు ఎకరాల్లో సొంత పాఠశాల భవనాలు, క్రీడా మైదానాలు, కంప్యూటర్ ల్యాబ్ల ఏర్పాటు

## బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు సమీక్షా సమావేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** రాష్ట్రంలో బీసీల సర్వతోముఖాభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగా బీసీ గురుకుల విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా దృష్టి సారించింది. ప్రతి బీసీ గురుకుల పాఠశాలకు కనీసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి, అన్ని హంగులతో సొంత భవనాలు నిర్మించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిన సూచనలు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు వెల్లడించారు.శనివారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో హనుమంతరావు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ గురుకులాల్లో విద్యా ప్రమాణాలు, డిజిటల్ విద్య, క్రీడలు, సిబ్బంది నియామకాలు, ఉన్నత విద్య, ఉద్యోగ-ఉపాధి అవకాశాలు, హాస్టళ్ల నిర్వహణ వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. శాఖకు సంబంధించిన పెండింగ్ అంశాలను అధికారులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువచ్చారు.విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు ఎంతో కీలకమని హనుమంతరావు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ స్పోర్ట్స్ పాలసీకి అనుగుణంగా ప్రతి గురుకుల పాఠశాలలో ప్రత్యేక క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే, నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు అన్ని బీసీ గురుకులాల్లో ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

### 'స్టడీ అవర్స్'

విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా అభ్యసించేలా క్రమం తప్పకుండా 'స్టడీ అవర్స్' నిర్వహించాలని, ఉపాధ్యాయులు స్థానికంగా అందుబాటులో ఉంటూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఎంజేపీ ప్రవేశాల్లో పూర్తిగా మెరిట్కు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లోని ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో చదువుతున్న బీసీ విద్యార్థులపై ఫీజు భారాన్ని తగ్గించే అంశంపై చర్చించారు. బీసీ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు నిపుణుల మార్గదర్శకత్వంలో నాణ్యమైన శిక్షణ అందించాలని హనుమంతరావు అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో బీసీ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి బీసీ ఫెడరేషన్ల చైర్మన్లు పర్యటనలు చేపట్టి, కుల సంఘాల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాఖ పనితీరు, మౌలిక వసతులు, విద్యార్థుల ప్రగతిపై ప్రతి నాలుగు నెలలకొకసారి క్రమం తప్పకుండా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, అదనపు కార్యదర్శి పద్మ, బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు,ఇతర ఉన్నతాధికారులు అలోక్ కుమార్, మల్లయ్య బట్టు, మామిడి హరికృష్ణ, ఇందిర, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



# మరింత ఆకర్షణీయమైన రంగుల్లో యూనిఫాం

## వచ్చే ఏడాదికి ఇప్పటి నుంచే ప్రణాళిక: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం బ్యూరో):** విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామాగ్రి పంపిణీపై సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందనీ, రెండో జత యూనిఫాం నెలాఖరులోగా అందజేస్తామని అధికారులు తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేశామనీ, అలాగే, విద్యార్థులందరికీ నోటు పుస్తకాల పంపిణీ పూర్తయిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు రెసిడెన్షియల్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్లోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు.

వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామాగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున అందుకు తగిన ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామాగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమెందని సీఎం తెలిపారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరి శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య నటరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓఝా, సైదులు, సంతోష్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ ఫిరాయింపుల నిర్ణేత వైఎస్ఆర్

## రాజశేఖరరెడ్డి, కేసీఆర్లే విపరీతంగా ప్రోత్సహించిండ్రు?

## 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నరు?

## పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు :కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## భూదందాలు, అవినీతిలో ఆ రెండు పార్టీలూపోటీపడుతునన్నయ్?

## ఏ ఎన్నిక వచ్చినా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొంటుంది

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు హైదరాబాద్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారని ఆరోపించారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్లు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని, బీజేపీ శ్రేణులు జరిపిన నిరంతర న్యాయపోరాటం వల్లే ఆయనపై అనర్హత వేటు ముప్పు వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఈ రెండూ పార్టీలు భూదందాలు, అవినీతిలోనే పోటీపడుతున్నాయన్నారు. 'దోచుకోవడం-దాచుకోవడం' తప్ప ప్రజాక్షేమం పట్టడం లేదని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు వారిపై ఏలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇరు పార్టీలు పరస్పరం నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఏ ఎన్నికలకైనా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# రసాయన ఎరువుల మోతాదు తగ్గించాలి

## వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సు నేపథ్యంలో అధికారులతో సమీక్షా సమావేశం

## నకిలీ విత్తనాలు, పురుగుమందులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో ప్రస్తావనకు వచ్చిన అంశాల ఆధారంగా, రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయంలో వ్యవసాయ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి, వివిధ విభాగాల, అనుబంధ కార్పొరేషన్ల వైస్ చైర్మన్లు, ఎండీలు పాల్గొన్నారు. ఎరువుల సమతుల్య వినియోగం, విత్తన లభ్యత, నాణ్యతా నియంత్రణ, ప్రకృతి వ్యవసాయం, ఏఐఎఫ్ నిధుల వినియోగం తదితర అంశాలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న రసాయన ఎరువుల వాడకంపై మంత్రి తుమ్మల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం ఎన్పీకే నిష్పత్తి 14.9 : 5.7 : 1గా ఉండగా, ఉండాల్సిన ఆదర్శ నిష్పత్తి 4 : 2 : 1 మాత్రమేనని ఆయన గుర్తుచేశారు. యూరియా వినియోగం హెక్టారుకు 217 కిలోలుగా ఉండి జాతీయ సగటు (160 కిలోలు) కంటే గణనీయంగా ఎక్కువగా ఉందని మంత్రి పేర్కొన్నారు. దీనిపై తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, యూనివర్సిటీల భాగస్వామ్యంతో సూక్ష్మ పోషకాలు, జీవ ఎరువుల వాడకాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని తుమ్మల అధికారులను ఆదేశించారు.

### నాణ్యత నియంత్రణ తీరుపై అసంతృప్తి:

ఎరువులు, పురుగుమందుల నాణ్యత నియంత్రణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, నకిలీ,నాసిరకం ఉత్పత్తులపై నమోదైన ప్రతి కేసులోనూ కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నమూనాల సేకరణ నుంచి కోర్టు కేసుల వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ పద్ధతిలో ట్రాక్ చేయాలని, లేబొరేటరీలకు తక్షణమే గుర్తింపు తీసుకురావాలని ఆదేశించారు.

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణంలో లక్ష్యానికి మించి (127%) సాధించడంపై అభినందించిన ఆయన, ధృవీకరించిన విత్తన ఉత్పత్తి, పంపిణీని మరింత వేగవంతం చేయాలని, రాబోయే రబీ సాగుకు విత్తనాలను ముందే సిద్ధం చేయాలని తుమ్మల అధికారులను ఆదేశించారు. అలాగే, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద కూరగాయల సంరక్షణకు కూల్ చైన్స్ ఏర్పాటు, ఎస్హెచ్జీలు, ఎస్పీవోల ఆధ్వర్యంలో దాల్, ఆయిల్ మిల్లుల స్థాపనను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని కేవలం సాగు విస్తీర్ణానికే పరిమితం చేయకుండా, 'తెలంగాణ నేచురల్ ఫార్మింగ్ బ్రాండ్'పేరిట క్లస్టర్ల వారీగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని మంత్రి ఆదేశించారు. రైతు నేస్తం వ్యవస్థను అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో వినియోగించుకునేలా చూడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను గ్రామస్థాయి వరకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# క్యూర్ పరిధిలో 21 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పూర్తి

## ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి: మంత్రి పొంగులేటి

## తొమ్మిది వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన మొండిగోడల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పూర్వ ప్రభుత్వం ప్రారంభించి మధ్యలో ఆపేసిన ఇళ్లను మనమెందుకు పూర్తి చేయాలనే భేషజాలకు పోకుండా... కేవలం 'క్యూర్' పరిధిలోని 26 ప్రాంతాల్లో ఏకంగా 21 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు.ఈ మేరకు శనివారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్తో కలిసి మంత్రి పొంగులేటి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లతో పాటు హౌసింగ్, వాటర్ వర్క్స్,విద్యుత్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు ఈ నెల 30వ తేదీలోగా యుద్ధప్రాతిపదికన, అత్యంత పారదర్శకంగా లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను వెంటనే ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ఆయా 2బీహెచ్కే ఇళ్ల సముదాయాలకు 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలోని స్థానికులకే ప్రాధాన్యతనిచ్చి ఎంపిక చేయాలని పొంగులేటి అధికారులకు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుని వచ్చే నెలాఖరు నాటికి అన్ని మౌలిక వసతులు వంద శాతం పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రస్తుతం ఆ ఇళ్లలో నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న అనర్హులను ఏరివేయాలని, ఎలాంటి అనుమతులు లేకుండా నివసించని వారికి ఫైనల్ నోటీసులు జారీ చేసి కేటాయింపులను రద్దు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఖాళీ అయిన ఇళ్లలో నిజమైన అర్హులైన పేదలను ఎంపిక చేయాలని చెప్పారు.

ఇదే సమావేశంలో మరో కీలక ప్రకటన చేస్తూ, క్యూర్ పరిధిలో సొంత జాగా కలిగి ఉండి అర్హులైన దాదాపు 9 వేల మంది పేదలకు 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆయా జిల్లాల ఇన్చార్జి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయపూర్వకంగా వ్యవహరించి, పారదర్శక పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి మంజూరు పత్రాలు అందజేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి 45 రోజుల గడువు

## జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో త్రిసభ్య కమిటీల ఏర్పాటు

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్) :** తెలంగాణ నేలకు వెలుగులు పంచేందుకు భూమి పొరల్లోకి దిగి, తమ చెమటను నల్ల బంగారంగా మారుస్తున్న సింగరేణి కార్మికుల సేవలు వెలకట్టలేనివని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.సింగరేణి కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్న తమ ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల కోసం నిరీక్షిస్తున్నాయని, వారి సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సింగరేణి బొగ్గు బెల్ట్ ప్రాంతంలోని ఇళ్ల స్థలాల సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపుతూ, అర్హులైన కుటుంబాలకు హక్కు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. సింగరేణి కార్మికుల ఇండ్ల స్థలాల సమస్యపై శనివారంసచివాలయంలో పొంగులేటి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సమయంలో జారీ చేసిన జి. ఓ. నె. 76, పరిగణనలోకి తీసుకొని, భూముల స్వభావం, ప్రభుత్వ,సింగరేణి హక్కులు, ప్రస్తుత నివాస పరిస్థితులు, చట్టపరమైన అంశాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

### దరఖాస్తుల పరిష్కారం:

సింగరేణి బొగ్గు బెల్ట్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను హైకోర్టు ఆదేశాలకు లోబడి 45 రోజుల్లోపు పరిష్కరించాలని పొంగులేటి అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చైర్మన్గా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఈ కమిటీలు పనిచేస్తాయని ఆయన తెలిపారు.దరఖాస్తుల పరిశీలనలో ఏవైనా అవకతవకలు లేదా నిబంధనలకు సంబంధించిన అంశాలు గుర్తిస్తే, అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం వాటిని సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. దశాబ్దాలుగా సింగరేణి ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కు కల్పించడం తమ ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా నిబంధనల ప్రకారం ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని పొంగులేటి పేర్కొన్నారు.

# 22ఎ భూ సమస్యలకు త్వరలో పూర్తి పరిష్కారం

- అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు జీవో 118, 76 ల విడుదలతో ముందడుగు
- ఎల్బీనగర్లోని 44 కాలనీల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాలు అందజేత
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** రాష్ట్రంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే ప్రజలకు పూర్తిస్థాయిలో తీపి కబురు అందుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి దశలవారీగా అమలు చేస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఇందులో భాగంగానే కాలనీల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ కోసం జీవో 76ను విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలను సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఈ ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఎల్బీనగర్ ప్రజల ఇళ్ల సమస్యను పరిష్కరించినట్లు గుర్తుచేశారు. ఏ పార్టీ నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా భేషజాలకు పోకుండా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని మంత్రి స్పష్టంచేశారు. గీత దాటి నిషేధిత జాబితా (22ఎ)లో ఉన్న ఇళ్లను రానున్న నెల రోజుల్లోగా పూర్తిగా క్రమబద్ధీకరిస్తామని, ఎవరి ఇళ్లకూ ఎలాంటి ముప్పు ఉండదని భరోసానిచ్చారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి అమల్లో ఉన్న 22ఎ చట్టపరమైన చిక్కుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి తెలిపారు. మరో వారం రోజుల్లో దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు రానున్నాయని, రిజిస్ట్రేషన్లు,దరఖాస్తు చేసుకోని వారి సమస్యలను కూడా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

అలాగే సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీవో 76 అమలుకు ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని, మరో 45 రోజుల్లో భూ సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని పొంగులేటి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెక్కిరిస్తున్న వైఫల్యాలు

పరిమితులు లేని
ప్రజాస్వామ్య దేశంలో
పాలకుల ఎత్తుగడలు
పారుతున్నాయి
పాలకుల వైఫల్యాలు ప్రతి
ఫలం ఇవ్వకపోగ అవమానాల
పాలుచేసి వెక్కిరిస్తున్నాయి
నీడ నివ్వలేని ప్రజల
నివాసలు నేల మట్టమవుతున్నాయి
బయట పడని బినామీలను ప్రశ్నించలేక
అవి నోర్లు తెరవడం మానుకొన్నాయి
నడివీధిలో నిలబడి రచ్చకెక్కి
వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నాయి
ప్రశ్నించే గొంతుల మీద ఉక్కు పాదం
మోపి నొక్కబడుతున్నాయి
ఎన్నికల బరిలో బలవంతపు ఒత్తిళ్లకు
గురిచేసి గెలుస్తున్నాయి
నీతి లేని నాయకుల
చేత ప్రజా ప్రభుత్వాలు
నడపబడుతున్నాయి
రాబడుల రాసుల కోసం సరికొత్త
మార్గాలను అన్వేషిస్తున్నాయి
రాయతీలు ఇవ్వకపోగ నడ్డివిరిచే
పన్నులను విధిస్తున్నాయి
పనికి మాలిన పథకాల పేర్లతో ప్రజల
సొమ్ముకు తూట్లు పొడుస్తున్నాయి
కనీస అవసరాలు తీర్చలేక కాకమ్మ
కబుర్లతో కాలక్షేపం చేస్తున్నాయి
అందుకే... మనం మోసపోక ముందే
మొద్దు నిద్రను వీడాలి
మంచి మార్గాన్ని ఎన్నుకొని
పోటు బెట్టి ఓడించి గెలవాలి!!

**- ఎస్. జవేరియా**
9849931255

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# నిగ్గు తేల్చుతారా... నీరుగారుస్తారా?



శాసనసభ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారవించిన ప్రసంగం ఒక తీవ్రమైన రాజకీయ రణభేరిని తలపించింది. గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' పేరిట వేలాది ఎకరాల నేలను బొక్కేసిన భూ రాబందుల ముసుగులను చీల్చి చెండాడతామని, పూర్వపు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి ఫామ్‌హౌస్‌లోని ఏడు వందల ఎకరాలలో మూడు వందల ఎకరాలు ప్రభుత్వానికి చెందిన ఆక్రమిత భూమేనని, దాన్ని వెలికితీసి స్వాధీనం చేసుకుంటామని ఆయన చేసిన ఉద్ఘాటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ అక్రమాల తీరుతెన్నులను విప్పి చెప్పేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పైకి ఎంతటి వీరోచితమైన అడుగుగా కనిపిస్తున్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే అనేక అనుమానాలు, విమర్శలు, రాజకీయ శంకలు వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల భూ దోపిడీపై పోరాటం ప్రకటిస్తున్నామని చెప్తున్న ఈప్రభుత్వం, నిజంగానే ఆక్రమణదారుల గుండెల్లో నిద్రపోతుందా? లేక గత పాలకుల తరహాలోనే కేవలం విమర్శల విన్యాసాలతో సమయాన్ని వృథా చేస్తూ ప్రజల కళ్లల్లో దుమ్ము కొడుతుందా?

అధికారంలో ఉన్న పాలకులకు సభ వేదికగా ఆవేశపూరిత ఉపన్యాసాలు దంచడం కొత్తేమీ కాదు. తెలంగాణ రాష్ట్రం అవతరించిన నాటి నుంచి నేటి వరకు దాదాపు రెండున్నర కోట్ల ఎకరాల భూముల వివరాలను, ప్రజల సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టి దోచిపెట్టారని సభలో ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రజల ఆస్తులు పరుల పాలయ్యాయని సత్యదూరం కాని నిజాన్ని బిగ్గరగా చెప్పారు. అయితే, ఇక్కడ ప్రశ్న ఏమిటంటే.. అధికార పీఠంపై కూర్చొని తొమ్మిది నెలల కాలం గడుస్తున్నా, ఆ భూ బకాసురుల పేర్లను అధికారికంగా ఎందుకు బయటపెట్టలేక పోతున్నారు? కేసీఆర్ గారి ఫామ్‌హౌస్‌లో మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న తీవ్రమైన ఆరోపణ వార్తా పత్రికలలో సంచలనంగా మారడానికి బాగానే ఉపయోగపడుతుంది. కానీ, ప్రభుత్వ వద్ద తగిన ఆధారాలు, భూముల చిట్టా స్పష్టంగా ఉన్నప్పుడు క్షణం ఆలస్యం చేయకుండా చట్టపరమైన నోటీసులు ఇచ్చి, ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? అధికారిక మైకుల ముందు బాంబులు పేల్చడం రాజకీయ ప్రయోజనానికి తప్ప, పక్కా చట్టబద్ధమైన చర్యలు లేనప్పుడు ఇవన్నీ కేవలం నాటకాలుగానే మిగిలిపోతాయి.




ఏ ప్రభుత్వం వచ్చినా ఏదైనా పెద్ద సంచలనాత్మక విషయం ఎదురైనప్పుడు ముందుకు తెచ్చే ఏకైక అస్త్రం 'ప్రత్యేక విచారణ బృందం'. కానీ చరిత్రను ఒకసారి తిరగేస్తే, విచారణ బృందం అంటే నిజాయితీతో కూడిన విచారణ కాదు, సమస్యను మరుగున పడేసే నిదాన ప్రక్రియ అని ప్రజలకు తేటతెల్లమైపోయింది. గతంలో జరిగిన అనేక భారీ కుంభకోణాలపై వేసిన విచారణ బృందాల నివేదికలు ఏమయ్యాయో, వాటి ఫలితాలు ఏ మూలన పడ్డాయో అందరికీ తెలిసిన విషయమే. రాజకీయనాయకులు పరస్పరం బురద చల్లుకోవడం పూర్తి కాగానే, వాతావరణం చల్లారిన తర్వాత ఆ దస్త్రాలు ప్రభుత్వ కార్యాలయాల అటకపై దుమ్ము పట్టిపోవడం పరిపాటిగా మారింది. ధరణి అక్రమాలపై వేసే విచారణ బృందం కూడా కేవలం గత పాలకులపై ఒత్తిడి పెంచడానికి, రాబోయే ఎన్నికలలో లబ్ధి పొందడానికి వాడుకునే ఒక రాజకీయాస్త్రంగా మారదా అని సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు. నిజంగానే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ఒక నిర్దిష్టమైన గడువు విధించి ఆ నివేదికను ప్రజల ముందు ఎందుకు ఉంచకూడదు?

శాసనసభ వేదికగా విమర్శల వర్షం కురిపిస్తున్న నాయకులకు క్షేత్రస్థాయిలో సామాన్య రైతు పడుతున్న అవస్థలు కనిపిస్తున్నాయా? ధరణి స్థానంలో 'భూ భారతి' చట్టాన్ని తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నా, నేటికీ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల చుట్టూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న రైతులకు ఏమాత్రం ఉపశమనం లభించలేదు. నిషేధిత భూముల జాబితా పరిధిని ముప్పై లక్షల ఎకరాల నుంచి మూడు లక్షల డెబ్బై మూడు వేల ఎకరాలకు తగ్గించామని ఘనంగా అంకెలు చెబుతున్నారు. కానీ, ఇప్పటికీ లక్షలాది మంది పేద రైతులు తమ భూములకు హక్కులు లేక, బ్యాంకుల నుంచి పంట రుణాలు అందక, కష్టకాలంలో భూములను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిషేధిత జాబితాపై నిర్ణయాధికారాన్ని కేవలం కలెక్టర్లకే కట్టబెట్టడం ద్వారా రెవెన్యూ వ్యవస్థలో మళ్లీ పాతకాలపు అధికారం, లంచగొండితనం శృతిమించే ప్రమాదం ఉంది. ఒక రెవెన్యూ అధికారి దయాదాక్షిణ్యాలపై రైతు భవిష్యత్తు ఆధారపడేలా చేయడం ఏ రకమైన ప్రక్షాళన? అరవై రోజుల్లో విన్నపం, తొంబైరోజుల్లో పునఃపరిశీలన అంటూ కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ తిప్పే ప్రతిపాదనలు సగటు పౌరుడికి కొత్త నరకాన్ని చూపిస్తున్నాయి.

తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుని అధికారాన్ని ఇచ్చింది కేవలం సభల్లో తిట్ల పురాణాలు, మునుపటి పాలకుల వైఫల్యాల వల్ల కలిగే వినోదం కోసం కాదు. నిరుపేదల భూములను అక్రమంగా కొల్లగొట్టిన వారు ఎంతటి ఘటనాఘటన సమర్థులైనా , పూర్వపు ముఖ్యమంత్రి అయినా, మంత్రులైనా చట్టం ముందు మోకరిల్లేలా చేయడమే ప్రజా ప్రభుత్వ బాధ్యత. ధరణి పేరుతో జరిగిన విదేశీ కంపెనీల దోపిడీపై నిజంగా నిజాయితీ ఉంటే, కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా న్యాయస్థానపు న్యాయమూర్తితో నిష్పాక్షిక విచారణ జరిపించాలి.

రాజకీయ కక్షసాధింపుల కోసం, ప్రత్యర్థులను భయపెట్టడానికి భూ సమస్యలను వాడుకోవడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇకనైనా మైకుల ముందు మాటల యుద్ధాలు ఆపాలి. కేసీఆర్ గారి ఫామ్‌హౌస్‌లోని మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమితో సహా, రాష్ట్రంలో ఆక్రమణకు గురైన ప్రతీ ఒక ఎకరం భూమిని స్వాధీనం చేసుకుని, నిజమైన బాధితులకు తిరిగి అప్పగించినప్పుడే ఈ ప్రభుత్వ మాటలకు విలువ ఉంటుంది. లేదంటే, ఇది కూడా 'చేసేది శూన్యం.. చెప్పేది గంభీరం' అన్న చందంగానే మిగిలిపోతుంది!

**- వెంక గారి భూమయ్య**
9848559863

# స్థానిక సమస్యల పరిష్కారం... పంచాయితీ రాజ్ లక్ష్యం

భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామవృత్తి పనివారల ప్రతినిధులతో పని చేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్‌లో ప్రారంభమైంది. గ్రామస్థాయిలో గ్రామపంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లోబ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు.

కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీని 1956లో నియమించారు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్యవికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి.





బల్వంతరాయ్ మెహతా స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయంపాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితా శయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా 'బల్వంతరాయ్ మెహతా కమిటీ' సిఫార్సులు దేశంలో అమలు పరచబడి, ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు.

స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యాడు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు.

1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది.

బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3-అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసుచేస్తూ, తన నివేదికను 1957, నవంబరు 24న జాతీయాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీ నివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958,జనవరిలో ఆమోదించింది.ఈ నివేదిక లోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థ ఏర్పాటుకు ప్రయత్నించాయి.

భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం...'నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి'. మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్‌లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు.

బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి.

1. జిల్లా స్థాయిలో - జిల్లా పరిషత్, 2. బ్లాకు స్థాయిలో-పంచాయతీ సమితి, 3. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కిందిస్థాయిలో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరిపాలనా, వనరుల, ప్రణాళికా,ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# తెలంగాణ యోధుడు కందాళ



బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా, నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కందాళ లక్ష్మణాచార్యులు సమరశీల పోరాటాలు నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. అంటరానితనం, కులవివక్ష, బానిసత్వాలకి వ్యతిరేకంగా ఉద్యమించి పీడిత ప్రజానీకానికి అండగా నిలిచి వారిని చైతన్యవంతులను చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. కుటుంబ ఆస్తిని లూటీ చేసిననూ, భార్యా-పుత్రులను హింసించిననూ తన తల్లిదండ్రులను హత్య గావించిననూ ఆయన ఏమాత్రం అధైర్యపడకుండా చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో భారత జాతీయోద్యమంలోనూ, తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొని ఆదర్శంగా నిలిచారు.

కందాళ లక్ష్మణాచార్యులు 1921 లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ( ప్రస్తుత నాగర్ కర్నూలు) లోని పెద్ద ముద్దునూర్ గ్రామంలో రుక్మిణమ్మ, రామకృష్ణాచార్యులు దంపతులకు ద్వితీయ సంతానంగా జన్మించారు. ఆయన 1939 లో వనపర్తిలో 'శారదా భక్త సమాజం' అనే విద్యార్థి సంఘాన్ని స్థాపించి విద్యార్థులను చైతన్యపరిచారు. దేశభక్తిపూరితమైన గేయాల ద్వారా, దేశ స్వాతంత్ర్య నినాదాల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని కలిగించారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్నారు. హైదరాబాద్ నగరంలో మున్సిపల్ కార్మికుల సంఘం, రోడ్డు కూలీల సంఘం,ఆల్విన్ ఫ్యాక్టరీ కార్మిక స్థాపించి వారి సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమించారు. కందాళ లక్ష్మణాచార్యులు 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు. అనంతరం ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) లో చేరారు. 1946 నుండి మహబూబ్ నగర్ జిల్లాలో కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్ కర్నూలు, వనపర్తి మొదలైన ప్రాంతాలలో ఆయన పార్టీని విస్తరించారు. 1947 ఆగస్టు 15 నాడు హైదరాబాద్‌లోని ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యాలయంలో స్వాతంత్ర్య జెండాను ఎగురవేసి అరెస్టు అయ్యారు. 1948లో పెద్దకొత్తపల్లి పోలీసు స్టేషన్‌పై దాడిచేసి ఆయుధాలను ఎత్తుకెళ్లి పోలీసు స్టేషన్‌ని తగులబెట్టారు. ఆ 1948లో నిజాం ప్రభుత్వం కందాళ లక్ష్మణాచార్యులను అరెస్ట్ చేసి రెండు సంవత్సరాల పాటు కాళ్ళకు ఇనుప సంకెళ్ళు తగిలించి కఠిన కారాగార శిక్షని విధించింది. ఆయన తన ఎనిమిది మంది అనుచరులతో జైలు గోడలు బద్దలుకొట్టి బయటపడ్డారు. కందాళ లక్ష్మణాచార్యులు నల్లమల అడవులు కేంద్రంగా అజ్ఞాతవాసం గడుపుతూ సాయుధ పోరాటాలలో పాల్గొన్నారు. ముఖ్యంగా దేవరకొండ నుండి కృష్ణా నది దాకా కామ్రేడ్ బి.ఎన్.రెడ్డి, కామ్రేడ్ రంగక్క నాయకత్వంలో ఉన్నటువంటి అనేక సాయుధ దళాలను సమన్వయం చేసుకుంటూ ఆయన ముందుకు సాగారు. నిజాం పాలన అంతం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన దరిమిలా మరలా రహస్య జీవితాన్ని గడిపారు. కందాళ లక్ష్మణాచార్యులు సహచరి యశోదమ్మ ఆయనతో కలిసి అనేక ప్రజా పోరాటాలలో మరియు అజ్ఞాతంలోనూ ఉద్యమించారు. సి.పి.ఐ పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శిగా కందాళ లక్ష్మణాచార్యులు 1952 నుండి 1967 వరకు పనిచేశారు. కందాళ లక్ష్మణాచార్యులు 1972లో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నుండి 'తామ్ర పత్ర స్వాతంత్ర్య సమరయోధుల ధ్రువపత్రాన్ని' స్వీకరించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి ఈ ధ్రువపత్రాన్ని స్వీకరించిన మొదటి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన కందాళ లక్ష్మణాచార్యులు 1976 జనవరి 10న మరణించార.



**- జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# సెప్టెంబర్ 17.. కమ్యూనిస్టుల వారసత్వం



సెప్టెంబర్ 17ను ఎవరు ఎలా గుర్తు చేసుకుంటారన్నది కేవలం ఒక తేదీని ఎంచుకునే విషయం కాదు. అది చరిత్రను ఎవరి కళ్లతో చూస్తున్నామన్న ప్రశ్న. అధికారపు గోడలపై రాసిన చరిత్రను చదువుతామా? లేక ఆ గోడలను కూల్చేందుకు తమ రక్తంతో చరిత్ర రాసిన ప్రజలను గుర్తు చేసుకుంటామా? తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 ఒక మలుపు. ఒక్కరోజు జరిగిన అధికార మార్పిడి కథ కాదు. దాని వెనుక దశాబ్దాల సామాజిక అసమానత ఉంది. వెట్టిచాకిరీ ఉంది. దొరల దౌర్జన్యం ఉంది. భూమి కోసం, ఆత్మగౌరవం కోసం, బతుకు హక్కు కోసం పేద రైతు, కూలీ, మహిళ, దళితుడు, బహుజనుడు సాగించిన తిరుగుబాటు ఉంది. ఆ తిరుగుబాటుకు రాజకీయ దిశనిచ్చిన కమ్యూనిస్టు ఉద్యమం ఉంది. సెప్టెంబర్ 17ను కమ్యూనిస్టుల వారసత్వం నుంచి వేరు చేసి చూడటం అంటే తెలంగాణ ప్రజా చరిత్రలో ఒక పెద్ద అధ్యాయాన్ని చెరిపేయడమే.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడినప్పుడు వారి ముందున్న ప్రశ్న కేవలం రాజ్యాధికారం ఎవరిది అన్నది కాదు. తమ భూమి తమదేనా? తమ శ్రమపై తమకే హక్కుందా? వెట్టికి ముగింపు ఎప్పుడు? దొర ముందు తలవంచకుండా బతికే హక్కు ఉందా? స్త్రీకి గౌరవం ఉందా? కుల అవమానానికి ముగింపు ఎప్పుడు? ఇవే ప్రజల అసలు ప్రశ్నలు. ఆ ప్రశ్నలకు సమాధానంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రూపుదిద్దుకుంది. గ్రామాలు కదిలాయి. ప్రజలు భూస్వామ్య ఆధిపత్యాన్ని సవాలు చేశారు. భూమి కోసం పోరాడారు. అనేక మంది ప్రాణాలు అర్పించారు. మహిళలు కూడా పోరాటంలో ముందుకు వచ్చారు.

సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. అది చరిత్రలో ఒక వాస్తవం. భూమి, కూలి, సామాజిక గౌరవం, ప్రజాస్వామ్యం కోసం పోరాటం కొనసాగింది. ఇక్కడే కమ్యూనిస్టుల వారసత్వం మన ముందుకొస్తుంది. ఆ వారసత్వం అంటే కేవలం ఎర్రజెండాను ఎగరేయడం మాత్రమే కాదు. ప్రజల పక్షాన నిలబడటం. అధికారాన్ని ప్రశ్నించడం. భూమిలేనివాడి భూమి ప్రశ్నను, కూలీ వాడి కూలి ప్రశ్నను, మహిళ స్వేచ్ఛను, దళితుడి ఆత్మగౌరవాన్ని, ఆదివాసీ హక్కులను ప్రజాస్వామ్య ప్రశ్నలుగా చూడాలి. కమ్యూనిస్టుల వారసత్వాన్ని కేవలం గతాన్ని గొప్పగా చెప్పుకోవడానికి ఉపయోగిస్తే అది వారసత్వం కాదు. వర్తమానాన్ని మార్చడానికి ఉపయోగించినప్పుడే అది జీవించే వారసత్వంగా ఉంటుంది. ఈరోజు తెలంగాణ మారిపోయింది. దొరల గడీలు చాలావరకు చరిత్రలోకి వెళ్లిపోయాయి. భూమి ప్రశ్న కొత్త రూపాల్లో ముందుకొస్తోంది. కార్పొరేట్ ఆధిపత్యం



పెరుగుతోంది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పేర్లతో శ్రమను అస్థిరం చేస్తున్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వ విద్య, వైద్యం బలహీన పడుతున్నాయి. రైతు అప్పు, పంటధర, సాగునీరు, భూహక్కుల ప్రశ్నలు ఇంకా పరిష్కారం కాలేదు. కుల వివక్ష అంతరించలేదు. మహిళలపై హింస ఆగలేదు. మతం పేరుతో ప్రజలను విడదీసే రాజకీయాలు బలపడుతున్నాయి. మీడియాపై అధికార - కార్పొరేట్ ఒత్తిడి పెరుగుతోంది. అంటే దోపిడీ పోయిందా? కాదు, దాని రూపం మారింది. అందుచేత సెప్టెంబర్ 17 మనకు ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు. ఒక ప్రశ్నించే రోజు. కమ్యూనిస్టు ఉద్యమం ఏ వారసత్వాన్ని మనకు అందించింది? ఆ వారసత్వాన్ని నేటి తరానికి ఎలా అందించాలి? ప్రజల జీవితాల్లో దానికి అర్థం ఏమిటి? అనేది చూడాలి. మొదటి కర్తవ్యం చరిత్రను మతపరమైన ఘర్షణగా కుదించడాన్ని అడ్డుకోవడం. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని హిందూ - ముస్లిం పోరుగా చిత్రించడం చరిత్రకు అన్యాయం. నిజాం నిరంకుశత్వాన్ని వ్యతిరేకించడం ఒకటి, ముస్లిం ప్రజలను శత్రువులుగా చూపించడం మరొకటి. ప్రజల పోరాటం దోపిడీకి వ్యతిరేకం. మతానికి వ్యతిరేకం కాదు. రెండో కర్తవ్యం కమ్యూనిస్టుల త్యాగాలను ప్రజల సామాజిక చరిత్రలో తిరిగి నిలబెట్టాలి. పేరు తెలియని గ్రామీణ కార్యకర్తలు, మహిళా పోరాట యోధులు, రైతులు, కూలీలు, దళితులు, బహుజనులు, ఆదివాసీల వీళ్ల కథలు పుస్తకాల అంచుల్లో కాకుండా కొత్త తరానికి చేరాలి. భూమి కోసం పోరాడుతున్న రైతు నుంచి ఉపాధి కోసం పోరాడుతున్న యువకుడి వరకు, సమాన వేతనం కోరుతున్న మహిళ నుంచి కుల వివక్షను ఎదిరిస్తున్న దళిత యువత వరకూ ప్రతి ప్రజా పోరాటాన్ని ప్రజాస్వామ్య హక్కుల విస్తరణగా చూడాలి. నాలుగో కర్తవ్యం కమ్యూనిస్టు ఉద్యమం నుంచి వచ్చిన అత్యంత విలువైన పాఠాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజల మధ్యకు వెళ్లకుండా ప్రజల కోసం రాజకీయాలు చేయలేం. సభల్లో నినాదాలు చేయడం కంటే బస్తీలో, పల్లెలో, కర్మాగారంలో, విశ్వవిద్యాలయంలో, పొలంలో ప్రజల సమస్యలతో నిలబడటం ముఖ్యం.

సెప్టెంబర్ 17ను అధికారిక ఉత్సవాల మధ్య పరిమితం చేయాలని ప్రయత్నించే ప్రతి రాజకీయానికి ఎదురుగా ప్రజా చరిత్రను నిలబెట్టాలి. తెలంగాణ రైతాంగ పోరాట వారసత్వం ప్రజలది. నేడు మన ముందున్న తక్షణ కర్తవ్యం స్పష్టంగా ఉంది. మత విద్వేషానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ఐక్యతను నిర్మించాలి. కుల వివక్షకు వ్యతిరేకంగా సామాజిక న్యాయ పోరాటాలను బలోపేతం చేయాలి. మహిళలపై హింసకు వ్యతిరేకంగా సమానత్వ పోరాటాలను విస్తరించాలి. రాజ్యాంగ హక్కుల పరిరక్షణను ప్రజా ఉద్యమాల కేంద్రంగా మార్చాలి.

అప్పుడు మాత్రమే తెలంగాణ రైతాంగ పోరాట వారసత్వానికి నిజమైన గౌరవం లభిస్తుంది. విలీనం ఒక చారిత్రక పరిణామం. విమోచనం ఒక రాజకీయ నిర్వచనం. కానీ, ప్రజల తిరుగుబాటు తెలంగాణ చరిత్రకు ప్రాణం. ఆ తిరుగుబాటుకు ఎర్రజెండా అందించిన కమ్యూనిస్టుల వారసత్వం గతంలో ముగిసిన అధ్యాయం కాదు. ప్రజల పక్షాన నిలబడే ప్రతి అడుగులో అది బతికే ఉంటుంది. చరిత్రను కాపాడటం అంటే గతాన్ని పూజించడం కాదు. ప్రజల పోరాట స్ఫూర్తిని వర్తమానంలోకి తీసుకురావడం. సెప్టెంబర్ 17 మనకు అదే పిలుపునిస్తోంది.

**- మామిండ్ల రమేష్ రాజా**
78932 30218

# డిజిటలైజేషన్‌తో న్యాయ విచారణ మరింత వేగవంతం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్



**కరీంనగర్ సెప్టెంబర్ 19 ( మనం బ్యూరో ):** పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అస్త్ర కన్వెన్షన్ హాలులో శనివారం న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖల అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. న్యాయ, పోలీస్ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, కోర్టు సంబంధిత ఆన్‌లైన్ ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయడం, కేసుల సత్వర పరిష్కారం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన క్రిమినల్ చట్టాల ద్వారా న్యాయవ్యవస్థలో డిజిటలైజేషన్ మరియు ఎలక్ట్రానిక్ ఆధారాల నిర్వహణ అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని కరీంనగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్. శివకుమార్ పేర్కొన్నారు. పోలీసు మరియు న్యాయశాఖ సంయుక్త సమన్వయ సదస్సులో ఆయన మాట్లాడుతూ, నేర న్యాయ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఇంటర్-ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ద్వారా 'వన్ డేటా - వన్ ఎంట్రీ' విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీసు దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, కోర్టు రికార్డులను సమగ్రంగా డిజిటల్ ప్లాట్‌ఫాం అనుసంధానించడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు కేసుల విచారణలో పారదర్శకత పెరుగుతుందన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ-ఎఫ్ఐఆర్ , ఈ-చార్జీట్ల వినియోగం తప్పనిసరి అని, ఎలక్ట్రానిక్ విధానంలో ఫిర్యాదుల నమోదు, డిజిటల్ సమన్లు మరియు వర్చువల్ మోడ్లో సాక్షుల విచారణ వంటి ఆధునిక పద్ధతులు న్యాయ ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నాయని వివరించారు. నేర న్యాయవ్యవస్థ సజావుగా సాగాలంటే న్యాయశాఖ మరియు పోలీసు విభాగాల మధ్య నిరంతర పరస్పర సమన్వయం ఎంతో అవసరమని, ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయడం ద్వారా కేసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, కోర్టు సంబంధిత ప్రక్రియల్లో జాప్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

### ఆన్‌లైన్ ప్రక్రియల అమలుపై ప్రత్యేక దృష్టి...

ఐసీజేఎస్, సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ ప్రక్రియల అమలులో భాగంగా ఈ-ఎఫ్ఐఆర్, ఈ-ఛార్జిట్, ఈ-సమ్మన్స్ తదితర అంశాలపై చర్చించారు. ఈ-ఎఫ్ఐఆర్లను సంబంధిత కోర్టులు సకాలంలో స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని, వాటి పర్యవేక్షణ కోసం ఈ-ఎఫ్ఐఆర్ స్వీకరణ సమయంలో పీటీఎన్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఈ-ఛార్జిట్లను సంబంధిత కోర్టులు నిర్ణీత కాలవ్యవధిలో పరిగణనలోకి తీసుకునేలా సమన్వయం చేసుకోవాలని, తద్వారా కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలని సూచించారు.

## సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** జగిత్యాల రూరల్ మండలం వంజరు పల్లి గ్రామంలో 10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న శ్రీ లక్ష్మీపార్వతి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. వంజరిపల్లి గ్రామ ఉప సర్పంచ్ తిరుపతి కి ఇటీవల గుండె శస్త్ర చికిత్స కాగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య,సర్పంచ్ గంగమల్లయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ లు దామోదర్ రావు నక్కల రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్ బాల ముకుందం, ఎమ్మార్వో హకీమ్ ,ఎస్త్రు ఉమా సాగర్, సర్పంచులు వంశీ, మాజీ ఎంపీటీసీ కూడుకల లక్ష్మణ్, ఎంపీ ఓ రవి బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు డీలర్ రవి, మాజీ ఉప సర్పంచ్ హరీష్ మాజీ సర్పంచ్ గంగారం, ఏఈ విజయ్, ఏ పి ఎం రాజు జిల్లా యూత్ ఉప అధ్యక్షులు సాయి,అధికారులు మహిళ సమాఖ్య సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈసారి గణేష్ నిమజ్జనం మూడు రోజులు



- క్లారిటీ ఇచ్చిన విశ్వహిందూ పరిషత్ సమన్వయ కమిటీ

**జగిత్యాల, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** పట్టణంలోని గణేష్ మండప నిర్వాహకులకు గత రెండు మూడు రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్నటువంటి గణేష్ నిమజ్జనం తేదీల పై గణేష్ ఉత్సవ సమితి మరియు విశ్వహిందూ పరిషత్ లు సమావేశమై మంటప నిర్వాహకుల అభ్యర్థన మేరకు తేదీ 23,24,25 వ రోజులు అనంత చతుర్దశి రోజున కూడా సాయంత్రం వరకు గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు చేసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్ కోరారు. ఈ సమావేశంలో వివిధ కుల సంఘాలు వివిధ ధార్మిక క్షేత్రాలు రాజకీయ క్షేత్రాలు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిపిఓగా ప్రశాంతి

### ములుగు జిల్లాకు బదిలీపై వెళ్తున్న రవీందర్‌కు ఘన సన్మానం



**జగిత్యాల సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** జగిత్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ జగిత్యాల కార్యాలయంలో డీపీఓగా విధులు నిర్వహించిన రవీందర్ ములుగు జిల్లాకు బదిలీ కావడంతో ఆయనకు ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా నుంచి నూతన డీపీఓగా ప్రశాంతి జగిత్యాల జిల్లాకు రావడంతో ఆమెకు శాఖ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. జి. సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీపీఓ రవీందర్ను శాలువాతో సత్కరించి, జగిత్యాల జిల్లాలో ఆయన అందించిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా డా. సుజాత మాట్లాడుతూ రవీందర్కు భవిష్యత్తో మరింత మంచి అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీపీఓ ప్రశాంతికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. నరేంద్ర, ఎన్ సి డ ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాజేందర్ రెడ్డి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, డిపిహెచ్ఎం జ్యోతి, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు ఏ. రాజేశం, శ్రీధర్, ధనుంజయ్, హెల్త్ ఎడ్యుకేటర్లు వెంకటరమణ, రవీందర్, హెల్త్ సూపర్వైజర్లు మురళీధర్, శ్యాం, శ్రీనివాస్, నరేందర్, నాగభూషణం, జూనియర్ అసిస్టెంట్లు సాగర్, మహేందర్, ప్రభాకర్, లవ కుమార్, హరీష్, వేణుగోపాల్, జోషి, నాగరాజు, తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జన ఉత్సవాలు నిర్వహించాలి

- శాంతియుతంగా శోభాయాత్రలు నిర్వహించాలి
- భక్తులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లతో కలిసి చింతకుంట చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన



**జగిత్యాల, సెప్టెంబర్ 19 (మనం ప్రతినిధి):** భక్తి శ్రద్ధలతో జగిత్యాల పట్టణంలో ఈ నెల 23, 24వ తేదీలలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. జగిత్యాల పట్టణం లోని చింతకుంట చెరువు వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక ఇతర శాఖల ఆద్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను శనివారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి కావలసిన, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ, మత్స్యశాఖ, అధికారులు సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేయించాలని, భారీ క్రేన్లు, చిన్న క్రెన్ లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ వాసులతో పాటు భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, తహసీల్దార్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయములో గణనాథునికి ఉత్తర పూజలు



- భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

**జగిత్యాల, సెప్టెంబర్ 19(మనం న్యూస్):** వినాయక నవరాత్రుల సందర్భంగా జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథునికి ఉత్తర పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. గణనాథుని నామస్మరణతో శోభాయాత్ర భక్తి వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్
- 27న రాయికల్ శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలు
- డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్రూపకల్పన ఈ ఏడాది థీమ్



**జగిత్యాల, సెప్టెంబర్-19 (మనం ప్రతినిధి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లాలోని రాయికల్ గ్రామం, మండలంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 2026 సంవత్సరానికి డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్రూపకల్పన అనే థీమ్ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 09న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకి అందించాలి

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శైలజ



**సారంగాపూర్ సెప్టెంబర్ 19( మనం న్యూస్ ):** మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ధర్మపురి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సారంగాపూర్ సెక్టార్లోని అర్పపెల్లి వన్( 1) అంగన్వాడి కేంద్రంలో సూపర్ వైజర్ శైలజ అధ్యక్షతన పోషణ్ మహ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మొదట పోషక ప్రతిజ్ఞ ను చేయించినారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ శైలజ మాట్లాడుతూ చిన్నా నాటి నుండే చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆకుకూరలను, పండ్లను అలవాటు చేసి పిల్లల ఎదుగుదలకు దోహతపడాలని తల్లులకు అవగాహన కల్పించారు. మన ఇంటి వద్ద ఉండే ప్రదేశాలలో ఆకుకూరలను, కూరగాయలను పండించి పిల్లలకు ఆహారంగా వండి పెట్టాలి అని సూచించారు.6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే బాలామృతం ప్రతి పిల్లవాని ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఆరు నెలలు నిండిన ప్రతి పిల్లవానికి బాలమృతంని ప్రతిరోజు తప్పనిసరిగా తినిపించాలని అని అన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రతిరోజు పెట్టే ఆరోగ్య లక్ష్మి మెనూ చార్ట్ గురించి కూడా తల్లులకు వివరించారు. ఈరోజు షెడ్యూల్ ప్రకారం ఆరోగ్యవంతమైన బిడ్డ, తల్లిదండ్రుల తోటి లోప పోషణతో ఉన్న బిడ్డ తల్లి తో, పిల్లల యొక్క పోషణ స్థాయి గురించి తల్లులతో మాట్లాడించడం జరిగింది అని అన్నారు . ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎం లు సంధ్య, కవిత, ఆశాలు, అంగన్వాడి టీచర్లు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**జగిత్యాల సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో జగిత్యాల పట్టణ అభివృద్ధి పనుల పై జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణంలో అవశ్యకంగా ఉన్న నూతనంగా అభివృద్ధి చేయనున్న సిసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పట్టణంలో తాగు నీటి-సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు అందించే విషయం,నూతన వాటర్ ట్యాంక్ ,పైప్ లైన్ ల నిర్మాణం మరియు పట్టణ పారిశుద్యం విషయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఈ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డిఈ వరుణ్, ఏఈ.లు దీపక్, రాహుల్, దివ్య, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలి



- అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, సెప్టెంబర్ 19(మనం బ్యూరో):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ముఖ్యంగా నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో అర్హులైన ఒక్కరూ మిస్ కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా వివిధ కార్యక్రమాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, ఈజీఎస్ పనులు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అమలు, ప్రజాపాలన, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.

### ఇందిరమ్మ ఇళ్ల పనులకు వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాని, వివిధ దశల్లో ఉన్న చోట్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేసేలా అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పనులను సైతం సత్వరమే చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## అక్టోబర్ 15 నుంచి యూపీఐ బాదుడే బాదుడు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి కారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ)పై కొత్తగా ఛార్జీలు విధించాలన్న ప్రతిపాదన వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. హైదరాబాద్ మినహ దేశంలోని పలు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు ఎవరూ కూడా ఈ అదనపు భారాన్ని మోయడానికి సిద్ధంగా లేరు. ఈ ఛార్జీలను ప్రభుత్వం వ్యాపారుల నుంచే వసూలు చేస్తుందని చెప్పినప్పటికీ, ఇది పరోక్షంగా వినియోగదారులపైనే ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొనుగోళ్లకు నగదు తీసుకురావాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ కొత్త ఛార్జీల భారాన్ని తాము భరించలేమని, అందుకే పెద్ద మొత్తంలో చెల్లింపులకు నగదు అడగాల్సి వస్తుందని వారు చెబుతున్నారు.

### అక్టోబర్ 15 నుంచి ఏం మారుతుంది?

కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి వినియోగదారుడి నుంచి వ్యాపారికి (పర్సన్-టు-మర్చంట్) చేసే రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని కస్టమర్ కాకుండా, సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. లావాదేవీ విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఈ ఛార్జీ గరిష్టంగా రూ.300గా పరిమితం చేశారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు, అలాగే రూ.2,000 లోపు చేసే వ్యాపార చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ప్రస్తుతం జరుగుతున్న 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలలో 95 శాతానికి పైగా రూ.2,000 లోపువే కాబట్టి, వాటిపై ఈ కొత్త నిబంధన ప్రభావం ఉండదు. అంటే, దుకాణంలో రూ.1,500 వస్తువును యూపీఐ ద్వారా కొంటే ఎలాంటి అదనపు రుసుము ఉండదు. అధిక విలువైన లావాదేవీలకే ఈ మార్పు వర్తిస్తుంది.

### ప్రభుత్వం ఏమంటోంది?..

ఈ ఛార్జీల భారాన్ని పూర్తిగా వ్యాపారులే భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఒకవేళ వ్యాపారులు బిల్లులపై 'యూపీఐ ఛార్జీ' అని ప్రత్యేకంగా వేయడం ప్రారంభిస్తే, యూపీఐ ఇక ఉచితం కాదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఇది డిజిటల్ చెల్లింపుల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే, ఈ భారం వినియోగదారులపై పడకుండా చూసేందుకు పేమెంట్ అగ్రిగేటర్లు, బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

### నగదు వైపు వెళ్లనున్న ప్రజలు?..

ఈ కొత్త ఛార్జీల వల్ల ప్రజలు మళ్లీ నగదు వాడకం వైపు మళ్లుతారని ప్రభుత్వం భావించడం లేదు. మొత్తం యూపీఐ లావాదేవీల పరిమాణంలో కేవలం 4 శాతం మాత్రమే ఈ కొత్త లెవీ పరిధిలోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌పీసీఐ గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో జరిగిన పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో 86 శాతం రూ.500 లోపువే కాగా, మరో 10 శాతం రూ.501 నుంచి రూ.2,000 మధ్య ఉన్నాయి. కాబట్టి సామాన్య ప్రజల రోజువారీ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదు. మరోవైపు, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై లావాదేవీ విలువతో సంబంధం లేకుండా ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం చేశారు. ఇది వ్యాపారులకు, వినియోగదారులకు మరో డిజిటల్ చెల్లింపు మార్గంగా అందుబాటులో ఉంటుంది.

### దేశవ్యాప్తంగా పెట్రోల్ పంప్ నిర్వాహకుల అభ్యంతరం..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూపీఐ) అక్టోబర్ 15 నుంచి అమలు చేయనున్న నూతన మర్చంట్ డిస్కౌంట్ రేట్ నిబంధనలపై దేశవ్యాప్తంగా పెట్రోల్ పంప్ నిర్వాహకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఫ్రేమ్వర్క్ ప్రకారం రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన ఇంధన యూపీఐ లావాదేవీలపై వ్యాపారుల నుంచి 0.4 శాతం ఎండీఆర్ చార్జీ వసూలు చేయనుండగా.. రూ. 2,000 లోపు లావాదేవీలకు ఎటువంటి చార్జీలు ఉండవు అని అన్నారు. అయితే, ఈ నిర్ణయంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్, ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. లీటరుకు తమకు వచ్చే కమిషన్ కేవలం రూ. 2.40 నుంచి రూ. 3.40 వరకు మాత్రమే ఉంటుందని... ఒక్కో పెద్ద లావాదేవీపై 0.4 శాతం చొప్పున ఎండీఆర్ చెల్లించాల్సి వస్తే పెట్రోల్ పంప్లపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని డీలర్లు పేర్కొంటున్నారు. ఇంధనం అత్యవసర సరుకు అయినందున పెట్రోల్ బంకులకు ఎండీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని... లేకపోతే అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 పైబడిన ఇంధన కొనుగోళ్లకు యూపీఐ డిజిటల్ చెల్లింపులను నిలిపివేసి, కేవలం నగదు రూపంలో మాత్రమే స్వీకరిస్తామని హెచ్చరించారు. ఇదిలాఉంటే, కేంద్రం తీసుకున్న చర్యలతో ఘజియాబాద్‌లో పలువురు వ్యాపారులు యూపీఐకి నిరసన చేపట్టారు. తమ షాపుల ముందు యూపీఐ చెల్లింపులు స్వీకరించబడవు' అంటూ నోటీసులు అంటిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు పైబడిన ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయమే ఈ ఆందోళనకు కారణం అయ్యింది అవుతొంది కూడా.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ములుగు, సెప్టెంబర్ 19(మనంన్యూస్): ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని వంటిమామిడి కూరగాయల మార్కెట్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, యాద్గిరిపల్లి గ్రామానికి చెందిన పుట్ట బాలరాజ్ తన భార్య పుట్ట లక్ష్మి (37), తన మామ సోమయ్యతో కలిసి కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురూ కలిసి కూరగాయలు కొనుగోలు చేసేందుకు వంటిమామిడి మార్కెట్‌కు వచ్చారు.కూరగాయలు కొనుగోలు చేసిన అనంతరం మార్కెట్ సమీపంలోని టిఫిన్ సెంటర్లో టిఫిన్ చేసి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, ములుగు వైపు నుంచి వంటిమామిడి వైపు వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ పుట్ట లక్ష్మిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పుట్ట లక్ష్మి ట్రాక్టర్ కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న ములుగు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ను పీర్లపల్లి యాదగిరి, తండ్రి పేరు పోచయ్య, గిర్మాపూర్ గ్రామం, వర్గల్ మండలంగా గుర్తించారు. ఈ ఘటనపై ములుగు పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి. రఘుపతి కేసు నమోదు చేసి, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పసి ప్రాణానికి పునర్జన్మ..

**980 గ్రాముల శిశువుకు అరుదైన చికిత్స**

**శిశురక్ష ఆసుపత్రి వైద్యులను అభినందించిన జగ్గారెడ్డి**

**సంగారెడ్డిలోని శిశురక్ష చిల్డ్రన్స్ ఆసుపత్రిలో చేర్పించిన జగ్గారెడ్డి**

**50 రోజులపాటు చికిత్స అందించి బిడ్డకు పునర్జన్మ నిచ్చిన శిశురక్ష ఆసుపత్రి వైద్యులు**

**ఆసుపత్రికి వచ్చి శిశురక్ష ఆసుపత్రి డాక్టర్లను, యాజమాన్యాన్ని అభినందించిన జగ్గారెడ్డి**



సంగారెడ్డి, సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలోని శిశురక్ష చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్లు అరుదైన చికిత్స అందించి నవజాత శిశువు ప్రాణాలను కాపాడారు. నెలలు నిండకముందే, కేవలం 980 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు పునర్జన్మనిచ్చారు. ఊపిరితిత్తులు డెవలప్ కాకపోవడంతో పాటు కిడ్నీలు పనిచేయకపోవడంతో డయాలసిస్ చేయాల్సి వచ్చింది. వెంటిలేటర్ పై శిశువును ఉంచి విజయవంతంగా చికిత్స అందించారు. 50 రోజుల చికిత్స తర్వాత ఆ పసి బిడ్డ బరువు 1.6 కిలోలకు పెరిగింది.

**ఆసుపత్రికి వెళ్లి అభినందించిన జగ్గారెడ్డి**

అత్యంత విషమంగా ఆరోగ్య పరిస్థితి ఉన్న నవజాత శిశువును శిశురక్ష ఆసుపత్రి డాక్టర్లు బతికించారని తెలుసుకున్న జగ్గారెడ్డి స్వయంగా అక్కడికి వెళ్లారు. నవజాత శిశువును చూసి, డాక్టర్లను ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినంది ంచారు. హైదరాబాద్ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా సంగారెడ్డి లోనే అత్యాధునిక వైద్య సేవలు అందించి, పసిబిడ్డకు ప్రాణం పోసిన తీరును ఆయన ప్రశంసించారు. శిశు రక్ష ఆసుపత్రి డాక్టర్లు ఆ శిశువును కంటికి రెప్పలా కాపాడి, ఆ తల్లిదండ్రుల కళ్ళల్లో సంతోషం నింపారని ఆయన వివరించారు.

**సగం బిల్లు మాత్రమే తీసుకున్న ఆసుపత్రి యాజమాన్యం**

50 రోజుల చికిత్సకు గాను దాదాపు నాలుగు లక్షల పైగా బిల్లు అయింది. శిశువు తల్లిదండ్రులు రెండు లక్షల వరకు చెల్లించారు. మిగతా మొత్తాన్ని తాను చెల్లిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. కానీ ఆసుపత్రి యాజమాన్యం బిల్లులో సగం మినహాయింపు ఇచ్చింది.

## ప్రగతి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ




- **పాటలు డాన్సులతో ఆనందాన్ని వెలుబుచ్చిన విద్యార్థులు**

గజ్వేల్ సెప్టెంబర్ 19 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలోని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నూతన విద్యార్థుల కోసం ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినీ, విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. నూతన విద్యార్థులు సీనియర్ విద్యార్థులతో పరిచయం పెంచుకుని ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఫ్రెషర్స్ పార్టీని పురస్కరించుకుని విద్యార్థుల కోసం పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ వినోద కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో స్నేహభావాన్ని పెంపొందించడంతో

పాటు కొత్త వాతావరణంలో ఆత్మవిశ్వాసంతో మెలిగేందుకు దోహదపడింది.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అంబదాస్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని అన్నారు. చదువుతో పాటు తమలోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ మట్టయ్య చౌదరి మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన విద్యార్థులు అధ్యాపకుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.గెస్ట్ గా కార్యక్రమానికి విచ్చేసిన వరలక్ష్మి ప్రసంగిస్తూ... విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలని, తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు భాస్కర్ రెడ్డి, బిక్షపతి, అనిల్, కృష్ణ, మహీపాల్, సాయినాథ్, భానుచందర్, సంతోషి, ఆస్మా, కల్పన, భవాని, దివాకర్ మరియు విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫ్రెషర్స్ పార్టీ సందర్భంగా విద్యార్థుల ఉత్సాహం, సందడితో కళాశాల ప్రాంగణం కళకళలాడింది.

## కేసీఆర్ ఫాం హౌస్ భూముల ఎపిసోడ్



- **ఎర్రవల్లి రైతులకు నోటీసులు**

గజ్వేల్, సెప్టెంబర్ 19 మనం న్యూస్: సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో కేసీఆర్ ఫాం హౌస్ భూముల ఎపిసోడ్‌లో కీలక పరిణామం జరిగింది. ఎర్రవల్లిలో సర్వే నెంబర్ 325కు సంబంధించి రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చారు.మర్కుక్ మండలం ఎర్రవల్లి వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌజ్ సమీపంలోని భూములను రెవెన్యూ అధికారులు రెండ్రోజులుగా పరిశీలించాక రైత ులకు శనివారం నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్ గ్రామాల పరిధిలోని భూముల సర్వే కోసం ఐదు టీమ్స్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏడీ సుదర్శన్ నేతృత్వంలో నలుగురు డిప్యూటీ ఇన్ స్పెక్టర్లతో పాటు మర్కుక్ మండల రెవెన్యూ సిబ్బందిని ఐదు టీమ్‌జూలుగా విభజించి రెండు గ్రామాల పరిధిలో భూముల సర్వే చేపట్టారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నంబర్ లోని 388.5 ఎకరాల భూమికి సంబంధించిన బౌండరీలను నిర్ధారించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సర్వే నంబర్ పరిధిలోని కెనాల్‌జూతో పాటు చెరువుల హద్దులను నిర్ధారించనున్నారు. మొదటి రోజు ఎర్రవల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నంబర్‌ఝులో భూములను పరిశీలించగా, అక్కడి రైతులు కొందరు అధికారులను అడ్డుకు న్నారు. దీంతో రెండో రోజు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు పెట్రోలి ంగ్ నిర్వహించారు. ఇదే సమయంలో మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో శాటిలైట్ మ్యాప్ ఝులు, భూ రికార్డులను పరిశీలించారు. కేసీఆర్ ఫామ్ హౌజ్ పరిధిలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ ల్యాండ్స్ ఏమైనా ఉన్నాయా..? అని పరిశీలించారు.

# భద్రతా కవచం..'సిద్దిపేట సురక్ష నేత్ర'

- **కమ్మంపల్లి గ్రామంలో 20 సీసీ కెమెరాలను ప్రారంభం**
- **సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్**



సిద్దిపేట, సెప్టెంబర్ 19 (మనం ప్రతినిధి): ప్రజల రక్షణ, భద్రతే లక్ష్యంగా 'సిద్దిపేట ఉన్నసురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 310 సీసీటీవీ కెమెరాలను ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మంపల్లి గ్రామంలో దాత మంద బూదవ్వ లక్ష్మారెడ్డి ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 20 సీసీటీవీ కెమెరాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రారంభించారు. సీసీటీవీ కెమెరాలు నేరాల నిరోధానికి, జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని సిపి రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. ఇవి ఎల్లప్పుడు నిఘా నీడలో ఉంచుతూ, ప్రజలకు ఒక అదనపు రక్షణ పొరలా పనిచేస్తాయన్నారు. తమ ఇళ్ళు, వ్యాపార సముదాయాల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని తెలిపారు. కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా, వాటిని క్రమం తప్పకుండా నిర్వహించడం చాలా ముఖ్యమని వెండర్లతో 2-3 ఏళ్ల పాటు సర్వీస్ కాంట్రాక్ట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్రమబద్ధమైన నిర్వహణ ఉంటే ఇవి చాలా కాలం సేవలు అందిసా ్తయిన్నారు. ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాలకు పంపిస్తామని డబ్బులు అడిగే దళారులను నమ్మవద్దని డబ్బులు అడిగారంటే అది 100% మోసమేనని గుర్తించాలన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రస్తుతం ఫోన్లలోనే మన ఆర్థిక, వ్యక్తిగత సమాచారం ఉంటోంది కాబట్టి బ్యాంక్ పిన్లు, పాస్వర్డను ఫోన్లలో సేవ్ చేయవద్దని ఏ బ్యాంకూ ఫోన్ చేసి ఓటీపీ లేదా పిన్ నంబర్లు అడగదని వివరించారు. అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని ఫోన్ పోగొట్టుకుంటే కంగారు పడకుండా సిఈఐఆర్ పోర్టల్ ద్వారా బ్లాక్ చేసి, రికవరీ చేసే సదుపాయం ఉందని ఫోన్ పోతే వెంటనే సమీప పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కమ్మంపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాత మంద బూదవ్వ లక్ష్మారెడ్డి ఫౌండేషన్ మంద భాస్కర్ రెడ్డి లకు గ్రామ ప్రజలకు పోలీస్ కమిషనర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. కమ్మంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని మిగతా గ్రామాలు కూడా ముందుకు వచ్చి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ మొగిలి, గ్రామ పెద్దలు, యువకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం





ములుగు, సెప్టెంబర్ 19(మనం న్యూస్)ః గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి మండప ప్రాంగణంలో శనివారం నల్ల శ్రీనివాస్ వితరణగా మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా మండపంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి వందలాది మందికి పైగా భక్తులు తరలివచ్చి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, అన్న,తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక భావంతో మానసిక శక్తి సిద్ధించడం తోపాటు సేవా దృక్పథం అలవడుతుందని గ్రామాలలో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటు ందన్నారు. వినాయక చవితి నవరాత్రులు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ లోక క్షేమం కోసం పూజలు, అన్నదానాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురా రోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు నల్ల లక్ష్మీనరేందర్, ఇరుకుల ఆనంద్ కుమార్, గ్రామ పెద్దలు కోన్యాల నర్సింహా రెడ్డి, నల్ల కృష్ణ , ఆదాసు రవి, కొల్తూరు నరేష్, నక్క ప్రవీణ్, కమిటీ సభ్యులు గంగమ్మ ప్రభాకర్, ఆదాసు మహేష్, ఉద్దేమరి వెంకటేష్, లక్కపురం మహేష్, నరిగాళ్ల సంజీవ్, కృష్ణ, రామ్, విజయ్ కుమార్, శ్యామ్, అనిల్, లింగం, తరుణ్, నంద కిషోర్, వరుణ్, యోగి, చందు, శ్రవణ్, దుర్గ ప్రసాద్, మహేందర్, అభిషేక్, నందు, సురేష్, మహేష్, మధు, తరుణ్, వివేక్, దేవేందర్, అనీష్, అజయ్, ముకేశ్, జశ్వంత్, ఏ. పవన్, రాజు, జి. చరణ్ లుపాల్గొన్నారు.

# ఇది ప్రకృతి కరవు కాదు?.. కాంగ్రెస్ మార్క్ కరవు



- **రేవంత్ సర్కార్ మౌనం.. అత్యంత దారుణం**
- **శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం**
- **గత మూడేండ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిండ్రు**
- **రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం**
- **నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందన్న హరీశ్ రావు**

హైదరాబాద్, మనం ప్రతినిధి : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ..., ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. 'నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు' అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

# ఫామ్ ఫౌండ్ నిర్మాణంలో అలసత్వంపై కలెక్టర్ అసహనం

**ఇందిరమ్మ ఇల్లు రెండవ విడత లబ్ధిదారులు ఎంపిక వెంటనే పూర్తి చేయాలి**

**కూలీల సంఖ్య పెంచితేనే విబిజి రామ్ జీ పనుల పూర్తికి ఆస్కారం : జిల్లా కలెక్టర్ హైమావతి**



సిద్దిపేట, సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి): రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ యుద్ద ప్రతిపాదకన పూర్తి చేసి కలెక్టరేట్ కు పంపించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలు వేగంగా నిర్మించుకుని గృహప్రవేశాలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏంపిడిఓ లను ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంచితేనే విబిజి రామ్ జి చేపట్టిన పనులను పూర్తి చేసేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. ఎల్ నీ నో ప్రభావంతో అడపా దడపా కురిసే వర్షపు నీటిని ఒడిసిపట్టుకునేందుకి జలసిరి పనులు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. జలసిరి పనుల్లో భాగంగా ఆయా మండలాల్లో చేపట్టిన ఫామ్ పౌండ్ నిర్మాణాలు అనుకున్నంత స్థాయిలో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. మండలాలకు ఇచ్చిన టార్గెట్ ఆధారంగా తప్పనిసరిగా ఫామ్ ఫౌండ్ నిర్మాణాలను చేపట్టాలని, గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు, పల్లె ప్రకృతి వనాల్లో ముందుగా ఫామ్ పౌండ్ నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. భూమి కలిగిన అధికారులు, కార్యాలయ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు, సర్పంచ్, వార్డు సభ్యులు ప్రతి ఒక్కరూ ఫామ్ ఫౌండ్ నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందుగా మండలాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ నిర్మించాలని ఆదేశించారు.

జలసిరి కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేస్తూ నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాను నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలపాలని కోరారు. చేయూత పెన్షన్ల దరఖాస్తులను ఫీల్ స్థాయి వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని ఏంపిడిఓ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రమేష్, గృహనిర్మాణ శాఖ అధికారి భగవంత్ రావు, డిపీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# చిరకాల వాంఛ నెరవేరింది





- **జెబిఎస్ నుండి క్షీరసాగర్ కు బస్ సౌకర్యం**

ములుగు, సెప్టెంబర్ 19(మనంన్యూస్)ః ఎన్నో రోజులుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం పడుతున్న ఇబ్బంది తీరింది. ములుగు మండలం క్షీరసాగర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ ను శనివారం సర్పంచ్లఫోరం జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ బస్సు మర్క్యాక్ నుంచి సికింద్రాబాద్ వరకు సర్వీస్ నడుస్తుంది. మొదటగా జేబీఎస్ నుంచి ప్రారంభమై తుర్కపల్లి, వంటిమామిడి, క్షీరసాగర్, అనంతారం, మర్క్యాక్ గ్రామాల మీదుగా ప్రజల సౌకర్యార్థం ప్రారంభించారు. జేబీఎస్ నుండి మధ్యాహ్నం 2:55 గంటలకు బయలుదేరి క్షీరసాగర్‌కు సాయంత్రం 4:20 గంటలకు చేరుకుంటుందని, తిరిగి మర్క్యాక్ నుండి సాయంత్రం 5:30 గంటలకు క్షీరసాగర్‌కుసాయంత్రం 6:30 గంటలకు చేరుకుంటుంది. రెండో ట్రిప్‌లో జేబీఎస్ నుంచి రాత్రి 7:55 గంటలకు బయలుదేరి క్షీరసాగర్‌కు రాత్రి 9:30 గంటలకు చేరుకొని అనంతరం మార్కుక్ కు వెళ్లి అక్కడి నుంచి సికింద్రాబాద్ వైపు తిరిగి వెళ్తుంది.

**మీ సమస్య..నాబాధ్యత: సర్పంచ్‌లఫోరం జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి**

క్షీరసాగర్ గ్రామస్తులు, విద్యార్థుల చిరకాల నిరీక్షణ నేడు సార్థకం అయ్యింది. ఏళ్లుగా గ్రామానికి బస్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సర్పంచ్ బాల్ రెడ్డి శ్రమతో బస్ సౌకర్యం లభించింది. మండల పరిధిలోని క్షీరసాగర్ కు ఆర్టీసీ బస్ సేవలను శనివారం గ్రామ సర్పంచ్,జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొన్యాల బాల్ రెడ్డి గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి,పంచ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో రోజులుగా క్షీరసాగర్ ప్రజలకు,విద్యార్థులకు, ఉపాధి దృష్ట్యా హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగస్తులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. దీంతో ప్రజల సేవే లక్ష్యంగా భావించి గ్రామానికి బస్ సౌకర్యం కల్పించడమే ధ్యేయంగా జిల్లా మంత్రి వివేక్ వెంకట స్వామి,గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తుంకుంటా నర్సారెడ్డిలతో పలుమార్లు ప్రజల ప్రయోజనాల గూర్చి చర్చించి బస్ సౌకర్యం పొందేలా చేశామని తెలిపారు. బస్ సౌకర్యంతో ఇటు హైదరాబాద్ వైపుగా వెళ్ళే ప్రతి ఒక్కరికి ఎంతగానో మేలు జరుగుతుందని బాల్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ బస్ సౌకర్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల పరశురాం,మాజీ ఎంపీటీసీ తారక సురేష్,సర్పంచ్ లు కాయితీ యాదమ్మ నర్సింగ రావు,మక్తాల వెంకటేష్ గౌడ్,వార్డు సభ్యులు గ్రామంలోని మహిళలు,పెద్దలు, యువత పాల్గొన్నారు.

# గిరిజన యువతకు 75% రిజర్వేషన్ ఇవ్వాలి



వైరా, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): గిరిజన ప్రాంతాల్లోని స్థానిక యువతకు పోలీస్ ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్తో పాటు పలువురు గిరిజన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న స్థానిక యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా ప్రాంతాల భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని స్థానిక యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. పోలీస్ ఉద్యోగాల్లో స్థానిక యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు, ఆయా ప్రాంతాల పరిస్థితులపై అవగాహన ఉన్న యువత పోలీస్ శాఖలో భాగస్వాములవుతారని తెలిపారు. 75 శాతం రిజర్వేషన్ అమలుకు అవసరమైన రాజ్యాంగ, చట్టపరమైన అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. గిరిజన యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# భద్రాచలంలో రూ. 50 కోట్ల ఐపీకి రంగం సిద్ధం..?

- రూ. 10 అధిక వడ్డీ ఆశతో నిండా మునుగుతున్న జనం
- ఎమ్మెల్యే పాత్రపై సర్వత్రా వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- ఇప్పటివరకు ప్రెస్ మీట్ పెట్టకపోవడంపై పెరిగిపోతున్న అనుమానాలు





భద్రాచలం, సెప్టెంబర్ 20(మనం న్యూస్): భద్రాచలం పట్టణంలో ఆర్థిక మోసాల పరంపర తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా మరొక రూ. 50 కోట్ల మేర ఐపీ (దివాలా) పెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్న వార్త స్థానికంగా పెను సంచలనంగా మారింది. గతంలో జరిగిన మోసాలాల్లో ఇప్పటికే చాలామంది బాధితులు డబ్బులు తిరిగే వస్తాయా లేదా అనే ఆందోళనలో ఉండగా వచ్చే నాలుగైదు నెలల్లోనే మరల 50 కోట్లకు ఐపి పెట్టేందుకు మరి కొందరు సిద్ధంగా ఉన్నట్లు పట్టణంలో ఆరోపణలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ విషయం పట్టణ మొత్తం వ్యాపించడం పట్టణ ప్రజలు, వ్యాపార వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నాయి.

ఈ కుంభకోణంలో స్థానిక ఎమ్మెల్యే ప్రమేయం కూడా ఉందంటూ బాధితులు, విపక్ష వర్గాల నుంచి తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతటి భారీ స్కామ్ లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఎమ్మెల్యే దీనిపై ఇప్పటివరకు స్పందించకపోవడం, కనీసం ప్రెస్ మీట్ పెట్టి వివరణ ఇవ్వకపోవడం పలు అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోంది అని విపక్షాలు, సొంత పార్టీలోని కొంతమంది విమర్శిస్తున్న ప్రజాప్రతినిధి మౌనం వెనుక ఆంతర్యమేమిటనే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా చర్చ జోరుగా సాగుతోంది.

మరోవైపు, నూటికి రూ. 10 వరకు అధిక వడ్డీ చెల్లిస్తామంటూ నమ్మబలకడంతో, అత్యాశకు పోయిన వందలాది మంది ప్రజలు తమ జీవితకాల సంపాదనను, స్థిరాస్తులను అమ్మి మరీ అప్పగించారు. ప్రారంభంలో కొద్దికాలం సక్రమంగా వడ్డీలు చెల్లించి నమ్మకం కుదిర్చిన నిర్వాహకులు కొన్ని నెలలు గడవకముందే, బాధితులను మోసం చేస్తున్నారు. ఈ సంఘటనలు మర్చిపోకముందే, మరి కొన్ని నెలల్లో రూ. 50 కోట్ల వరకు మూటగట్టుకుని చేతులెత్తేసేందుకు కొందరు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే వడ్డీలు, అసలు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఉన్నత స్థాయి యంత్రాంగం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

# మెడిసిన్ సీటు సాధించిన రోకటి సుష్మకు ఆర్థిక సాయం



ఖమ్మం, సెప్టెంబర్ 19(మనం న్యూస్)ః జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన రోకటి రమేష్ - ప్రమీల చిన్న కూతురు రోకటి సుష్మ ఎంబిబిఎస్ సీటు సాధించిన సందర్భంగా ఖమ్మం రాపర్తి క్యాంప్ ఆఫీస్లో ఘనంగా సన్మానించారు. అనంతరం అభినందనలు తెలుపుతూ ఆర్థిక సహకారం అందించారు. మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, ట్రస్టు బోర్డు చైర్మన్ కనకం జనార్దన్ రావు, కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, జిల్లా కోశాధికారి మడూరీ పూర్ణ చందర్ రావు, సీనియర్ నాయకులు కాపు జేఏసీ చందు జనార్ధన్, డాక్టర్ గడల శ్రీనివాసరావు, తీగల విజయ్, రాపర్తి శరత్ కుమార్, డాక్టర్ జాబిశెట్టి గౌతమ్, ముత్యం ఉప్పలరావు, సముద్రాల శ్రీనివాసరావు, జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్, సూరపనేని బాబురావు, గంగిశెట్టి శ్రీనివాస్, సి హెచ్ విప్లవ కుమార్, పసుపులేటి నాగేశ్వరరావు, బైరిశెట్టి శ్రీనివాసరావు, తాళ్లూరి సోమయ్య, రామిశెట్టి సత్యనారాయణ, వెంపటి నాగేశ్వరరావు నాయుడు , రాపర్తి అరవింద్, రంగిశెట్టి వరుణ్, కాసం వినయ్, జి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలంలో మంచిగా చదువుకుని మంచి డాక్టర్ గా రాణించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివించిన తల్లి తండ్రులనూ సన్మానించి అభినందనలు తెలిపారు.

# శ్రీనివాస్ నగర్ ఇండ్ల సమస్యపై భవిష్యత్తు కార్యాచరణ

**రాజకీయాలు చేయకుండా పేదల వైపు వుండేది ఎర్ర జెండాలు మాత్రమే**

**సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



ఖమ్మం, సెప్టెంబర్ 19(మనం న్యూస్): శ్రీనివాస్నగర్ ఇండ్ల సమస్యపై భవిష్యత్ కార్యాచరణ చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైకోర్ట్లో పిటిషన్ వేయడంతో శ్రీనివాస్ నగర్ బాధితులకు ఊరట లభించింది. దీంతో సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి గుడి వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్య శాశ్వతంగా పరిష్కారం ఎలా చేయాలనే దానిపై ప్రజల అభిప్రాయాలను నాయకులు తీసుకున్నారు. గత కొద్ది రోజులుగా వరుసగా శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్యపై ఒకవైపు ప్రత్యక్ష ఆందోళన చేస్తూనే మరోవైపు హైకోర్ట్ తలుపు తట్టడం ఫలితంగా తాత్కాలిక ఊరట లభించిందని తెలిపారు. భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ స్థలాల సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే విధంగా ఆందోళనలు చేయడంతో పాటు కోర్టు లో కూడా సీనియర్ లాయర్ లతో ప్రజల వైపు వాదనలను బలంగా వినిపిస్తామని హామీ ఇచ్చారు. గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదల కుటుంబాలు ఇక్కడే నివాసం శాశ్వతంగా వుండే విధంగా తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

శ్రీనివాస్ నగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వివిధ రాజకీయ పార్టీలు కేవలం కంటితుడుపు ఆందోళనలు చేస్తున్నాయని, కేవలం లెఫ్ట్ పార్టీలు మాత్రమే బాధితుల వైపు వుండి పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. నిజాయితీ గా పేదల సమస్యలపై పోరాటాలు చేసేది కేవలం ఎర్ర జెండాలు మాత్రమే అని స్పష్టం చేశారు. ఓట్లు అప్పుడు మాత్రమే మిగతా పార్టీలు కనిపిస్తాయని ఆరోపించారు. భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు అటు కోర్టు లోనూ, ఇటు ప్రజా క్షేత్రంలోనూ సిపిఎం ప్రజల వైపు ఉంటుందన్నారు. కలెక్టర్, మంత్రి, కమిషనర్ జోక్యం చేసుకుని పేదల ఇళ్లు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, జిల్లా నాయకులు భుక్యా శ్రీనివాసురావు, బండారు రమేష్, సైదులు, యర్రా గోపి, నాగుల మీరా, ఇమామ్, యర్రా రంజిత్, లాయర్ టి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని దర్శించుకున్న సర్పంచ్ పగడాల రమాదేవి



దమ్మపేట, సెప్టెంబర్ 19(మనం న్యూస్): మల్లారం రోడ్డు నందు వేంచేసియున్న వినాయకుడిని దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు దర్శించుకుని అన్నసంతర్పణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్న శెట్టి చిట్టిబాబు, దమ్మపేట కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పలు మండపాల్లో అన్నదానం ప్రారంభించిన ఆర్జేసీ కృష్ణ

ఖమ్మం, సెప్టెంబర్ 19(మనం న్యూస్): నగరం లోని 46వ డివిజన్ శ్రీ గణేష్ సాయిరాం యూత్ కమిటీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ప్రారంభించారు.దీనితో పాటు నగరంలో నీ పలు మండపాల్లో ఏర్పాటు చేసిన అన్నదానం ను ప్రారంభించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గణనాధుడు ఆశీర్వాదంతో ప్రజలందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలి అని కోరుకున్నట్లు తెలిపారు.అనంతరం కమిటీ సభ్యులు కృష్ణ ను సత్కరించారు.ఈ కార్యక్రమం లో కర్నాటి వీరభద్రం,బిఆర్ ఎస్ నాయకులు కనకం భద్రయ్య,ముక్కాల రాజేష్ ,బండి నవీన్,మధు,స్థానిక పెద్దలు తొగరు భాస్కర్,కమిటీ సభ్యులు పగిళ్ళ బుచ్చి బాబు,గోనెల లక్ష్మణ్,రవి శంకర్,వికాస్,నవీన్, బన్ను,విగ్గు, జస్వంత్,అభి,రాము,నరేష్,శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యకు కాషాయికరణ ప్రమాదం

**పేదలను విద్యకు దూరం చేస్తున్న పాలకుల విధానాలు**

**విద్యార్థి ఉద్యమాల సారథి ఏఐఎస్ఎఫ్**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్**




ఖమ్మం, సెప్టెంబర్ 19(మనం న్యూస్)ః భారతదేశంలో విద్య కాషాయికరణ ప్రమాదంలో ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. విద్యను కాషాయికరణ చేయడంతో పాటు చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం జరుగుతుందని పసి మెదళ్లలో మతోన్మాదాన్ని నింపుతున్నారని ఆయన ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా 28వ మహాసభలు -శనివారం స్థానిక ఐఎంఏ హాల్లో జరిగాయి. మహాసభలను పురస్కరించుకుని పాత సిపిఐ కార్యాలయం నెహ్రూ నగర్ నుండి పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా పోటు ప్రసాద్ నగర్ (ఐఎంఏ హాల్) వరకు విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. 28వ మహాసభకు గుర్తుగా 28 మంది విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ పతాకాలను ధరించి ముందు నడిచారు. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మహాసభలను పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ ఆవిష్కరించారు. మడుపల్లి లక్ష్మణ్, బుర్రా మనోజ్, అమృత అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభల్లో పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమేపి విద్యా విధానాన్ని మారుస్తూ వచ్చిందని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న నేటి తరుణంలో చాందస వాదాన్ని పసిమెదళ్లలోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే అతి గొప్ప విద్యార్థి సంఘమని స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తర్వాత అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్కు ఉందన్నారు. -విద్యా రంగ సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలు, నిరుద్యోగం తదితర సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పోరాడుతూ విద్యార్థి ఉద్యమ సారథిగా నిలిచిందన్నారు. అనేక మంది యోధులు ఏఐఎస్ఎఫ్ పనిచేశారని వారందరి స్ఫూర్తితో ఏఐఎస్ఎఫ్ బహుముఖ పోరాటాల ద్వారా విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని పోరాటాలు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య అంగడి వస్తువుగా మారిందని కొనుగోలు శక్తి ఉన్న వారికే విద్య 'అందుబాటులో ఉందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో పోరాడాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, ఇంచార్జి రావిశివరామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ధంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు: కలెక్టర్ దివాకర టిఏస్

**నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి**

**గణేష్ నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సిపి**



ఖమ్మం, సెప్టెంబరు19(మనం బ్యూరో)ః గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ ఆదేశించారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమీషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకొని కావాలసిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఏస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటిమట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేసి, అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలని ఆదేశించారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. షార్ట్ సర్క్యూట్కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్ను ముందుగానే సిద్ధం చేయాలని, అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో గణపయ్యకు ఘన వీడ్కోలు



ఖమ్మం, సెప్టెంబర్ 19(మనం న్యూస్)ః రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన మట్టి గణపయ్యకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఐదు రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడిని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. క్యాంప్ కార్యాలయ ఆవరణలో గణపతి ఉత్సవాలతో పండుగ శోభ నెలకొంది. ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, హారతులతో గణనాథుడిని కొలిచారు. శనివారం క్యాంప్ కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విఘ్నేశ్వరుడిని కదిలించారు. అనంతరం భక్తులు, నాయకులు, సిబ్బంది వెంట రాగా భక్తి పారవశ్యంతో వీ.వెంకటాయపాలెం చెరువుకు తరలించారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాల మధ్య సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. దీంతో క్యాంప్ కార్యాలయంలో ఐదు రోజులపాటు కొనసాగిన గణపతి ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు.

# 136 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి చొరవతో మంజూరు..
- లబ్ధిదారులకు అందజేసిన క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డి



నేలకొండపల్లి, సెప్టెంబర్ 19(మనం న్యూస్)ః పేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా సహాయం అందిస్తోందని తుంబూరు దయాకర్రెడ్డి అన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం నేలకొండపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు మంత్రి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేదల వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని దయాకర్రెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలంలో త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ పంటలు సాగు చేపట్టిన రైతులకు ఇబ్బందులు కలగకుండా పాలేరు రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడమే మంత్రి పొంగులేటి లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మామిడి వెంకన్న, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పెనుకొండ అభివృద్ధే లక్ష్యం

- మున్సిపాలిటీపై కూటమి జెండా ఎగరేయాలి
- రూ.20 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- అమృత్ పథకంతో రూ.100 కోట్లతో ఇంటింటికి మినరల్ తాగునీటి సౌకర్యం: మంత్రి సవిత
- అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కూటమి శ్రేణులకు మంత్రి సవిత పిలుపు



**పెనుకొండ సెప్టెంబర్ 19 మనం న్యూస్:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పెనుకొండ మున్సిపాలిటీని కూటమి పార్టీ కైవసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. శనివారం పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హిందూపురం పార్లమెంట్ స్థానిక ఎన్నికల ఇన్చార్జి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు సమావేశంలో పాల్గొని పార్టీ బలోపేతం, నాయకులు-కార్యకర్తల సమన్వయం, మున్సిపల్ ఎన్నికల కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పెనుకొండ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజారిటీ అందించారని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రస్తుతం టీడీపీ ఆధీనంలో లేకపోయినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 26 నెలల్లో పెనుకొండ పట్టణ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

పెనుకొండ మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించే లక్ష్యంతో అమృత్ పథకం కింద సుమారు రూ.100 కోట్లతో ఇంటింటికీ తాగునీటిని అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ను రూ.3 కోట్ల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేశామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రూ.8 కోట్లతో మూడు ఎకరాల్లో సద్భావన భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, రూ.50 లక్షలతో షాదీ మహల్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాపు భవన్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.64 లక్షలతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశామని, 1,250 మంది అర్హులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని మంత్రి సవిత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.పెనుకొండ అభివృద్ధి బాధ్యత నాది. పార్టీని బలోపేతం చేసి మున్సిపాలిటీని కైవసం చేసుకునే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని అని మంత్రి సవిత అన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం మరింత పెంచుకుని, రాబోయే ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి



**బేతంచేర్ల సెప్టెంబర్19 (మనం న్యూస్):** నంద్యాల జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని వెంటనే డోన్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ వైఎస్సార్ కాంగ్రెస్ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాంజి షాషా ఏఐటీయూసీ మండల కార్యదర్శి తాలూకా తిరుమలేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ ఏఐవైఎఫ్ ఉదయ్ మధు రైతులు రమేష్ రెడ్డి గోపి లు డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని రైతుల రుణాలను మాఫీ చేసి రుణాలను రీషెడ్యూల్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు వ్యవసాయంపై ఆధారపడిన రైతు కుటుంబాల పిల్లలకు అన్ని రకాల విద్యా ఫీజులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు కరువు పరిస్థితుల నేపథ్యంలో పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని పశువులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

# పిఎండిఎస్ విధానాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**అమరాపురం, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** అమరాపురం మండలం, బసవనపల్లి గ్రామంలో ఓ రైతు వక్క తోటలో వేసిన పిఎండిఎస్ విధానాన్ని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ శనివారం పరిశీలించారు. నీలకంఠాపురం శ్రీరామ రెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ పథకం ద్వారా నిర్మించిన అమరాపురం, బసవనపల్లి గ్రామాల్లో నీటి సంపులను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ బసవనహళ్లి గ్రామంలోని రైతు పుష్పలత భర్త శంకరప్ప వక్క తోటలో వేసిన పిఎండిఎస్ సాగు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖా ముఖిగా మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్క రైతులు కూడా పిఎండిఎస్ వేసే విధానాన్ని అనుసరించాలని రైతులకి సూచించారు.పిఎండిఎస్ పంట విధానం పట్ల రైతులకు కలిగే ప్రయోజనం, ఉపయోగాలు గురించి అమరాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి మంజునాథ్ స్పష్టంగా వివరించారు. విత్తనాలను పెల్లెటైజేషన్ చేయడం ద్వారా విత్తనానికి రక్షణ కవచంగా ఉండి వర్షం వచ్చినప్పుడు పంటలు మొలకెత్తుతాయని అయన తెలియజేశారు. అలాగే ఈ విధానం ద్వారా పంటకు ఇచ్చిన నీరు ఆవిరి కాకుండా పంటకు మల్చింగ్ లాగా ఉపయోగపడుతుందన్నారు. దీనిద్వారా తేమను నిలుపుకునే గుణం పెరుగుతుందన్నారు.కలుపు మొక్కలు తగ్గుతాయని, పంట పొలాలు 365 రోజులు గ్రీన్ కవర్ పచ్చదనం ఉంటుందన్నారు. రైతులు కూరగాయలు, ఆకుకూరల ద్వారా కొంత ఆర్థిక లాభం కూడా పొందెందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ముఖ్యంగా పశువులకు మేతగా ఉపయోగపడుతుందని రైతులకు తెలియజేశారు. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో వీలైతే రైతులు నీటి సదుపాయం ఉన్న వక్క రైతుల నుంచి ఒక రక్షకతడిని పంటలకు అందించాలని ఎఓ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మడకశిర ఎడిఎ కృష్ణ మీనన్,సిరికల్చర్ ఎడి హనుమంతు నాయక్, ఎంపీడీఓ డి. రామారావు,తహసీల్దార్ బి. హనుమంతు, అమరాపురం, గుడిబండ ఎఓలు మంజునాథ్,వీరనరేష్, ఏపీఓ శివన్న తదితరులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు సన్మానం



**బేతంచేర్ల సెప్టెంబర్19 (మనం న్యూస్):** పట్టణంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఫజల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీ సభ్యులకు మెమెంటో దృశ్యాలువ పూలమాలలతో సన్మానం 2021 నుండి 2026 వరకు ప్రజా ప్రతినిధులైన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి జడ్పిటిసి శివ పార్వతి ఎంపీటీసీ సభ్యులుగా 15 మందిని మండలంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకున్నారు ఎంపీడీవో పజిల్ రెహమాన్ అన్నారు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పజిల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన 25 వ మండల సర్వసభ్య సమావేశం లో వివిధ శాఖల అధికారులు మండలంలో ఉన్న ప్రజల సమస్యలపై ప్రభుత్వం ల ఆదేశాల మేరకు చేసిన అభివృద్ధి పనులు శాఖల అధికారులు తెలిపారు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా బేతంచేర్ల మండల ప్రజలు గెలిపించుకున్నారు మండలం లో త్రాగునీరు సమస్య విద్య వైద్యం లేక మండల ప్రజలకు ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలు పరిష్కరించాలని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి మెజార్టీతో గెలిచారని డోన్ నియోజకవర్గాని కి అభివృద్ధి పనులు చేశారని బేతంచేర్ల మండలంలో త్రాగునీరు కోసం 350 కోట్లతో గోరకల్లు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన నీరు అందించారని విద్య కోసం మండల లో ఉన్నత చదువు కోసం ఇతర పట్నాలకు వెళ్లి చదివేవారు బుగ్గన రాజేంద్రరెడ్డి ఎడ్యుకేషన్ హబ్ గా ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రభుత్వ ఐటిఐ గురుకుల పాఠశాల ఏర్పాటుచేసి ఇతర జిల్లాల వారు ఇక్కడకు వచ్చి చదువుతున్నారని ప్రధాన రహదారు కోసం కోట్ల నిధులతో రోడ్లు వెడల్పు నేషనల్ హైవే వైద్యం కోసం బేతంచేర్ల పట్టణంలో 30 పడకల హాస్పిటల్ గా వైద్యులు ప్రతిరోజు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు ఏర్పాటుచేసి ప్రతి శాఖ అధికారులు గ్రామస్తుల సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యేలా ఏర్పాటు చేశారని గత ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించారని నేను ప్రజలకు సేవ అందించాలని మాజీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథరెడ్డి సహకారంతో ఎంపీపీగా ప్రజా ప్రతినిధిగా గ్రామాల సమస్యలు పరిష్కరించామని జడ్పిటిసి ఎంపీటీసీ సభ్యులు సహకారంతో ప్రతి గ్రామానికి త్రాగునీరు అభివృద్ధి పనులు చేసి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని అన్నారు ఎంపీడీవో ఫజల్ రెహమాన్ మాట్లాడుతూ మండలంలో ఉన్న సమస్యలు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి చెప్పిన వెంటనే స్పందించి వెంటనే ఆ సమస్యను పరిష్కరించేవారు వారు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేవారు వారి సేవలు కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శివ పార్వతి ఎంపీటీసీ సభ్యులు మాజీ సర్పంచులు మండల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, సెప్టెంబర్ 19మనం న్యూస్:** జిల్లాలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను గుర్తించి, ఆయా పరిశ్రమల భాగస్వామ్యంతోనే శిక్షణ అందించి, అనంతరం ఉపాధి అవకాశాలు



కల్పించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖల అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలు, ప్రస్తుతం డిమాండ్లో ఉన్న నైపుణ్యాలను ముందుగా గుర్తించాలని, వాటికి అనుగుణంగా యువతకు శిక్షణ అందించి, శిక్షణ పూర్తైన వెంటనే ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు... ఈ ప్రక్రియను ఆలస్యం చేయకుండా 10 రోజుల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.. ఇఖిఖ ద్వారా నిర్మించిన సీడాప్ భవనాలు, ఐటీఐల్లోని అ్కఖిఖృఇ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను అవసరమైన సంస్థలకు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు వస్తున్న సంస్థల మానవ వనరుల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని, వాటికి అనుగుణంగా స్థానిక యువతకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేసి రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలపాలన్నారు.. ృఖ్గ(ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన) కింద వచ్చిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఇప్పటికే ప్రారంభించిన బ్యాచ్లను వేగవంతంగా పూర్తి చేసి తదుపరి బ్యాచ్లను ప్రారంభించాలన్నారు. సమావేశంలో సిపిఓ భారతి, డీఈవో సుధాకర్, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్, ఉపాధి కల్పనధికారి దీప్తి, ఆర్ఐఓ లాలప్ప, స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ఎండిపోయిన పంటల ను పరిశీలించిన వైసీపీ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్



**శింగనమల సెప్టెంబర్ 19 మనం న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గంలో మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ మరియు రాష్ట్ర రైతు విభాగ జనరల్ సెక్రటరీ బొమ్మన శ్రీరాంరెడ్డి నేతృత్వంలో పంట పొలాల పరిశీలన కార్యక్రమం కొనసాగింది. శింగనమల మండలం నాగులగుడ్డం నుంచి ఈస్ట్ నరసాపురం వరకు సాగునీరు అందక నిలువునా ఎండిపోతున్న పంట పొలాలను శైలజనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నేరుగా పొలాల్లోకి వెళ్లి ఎండిపోయిన పైర్లను చేతిలోకి తీసుకుని, రైతుల కష్టాలను, వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ

'రైతు కళ్లముందే పంట ఎండిపోతుంటే.. ఆ రైతు గుండె ఎంతగా మండుతుందో ఈ పొలాల్లోకి వస్తే తెలుస్తుంది. నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి సాగు చేసిన పంటకు నీళ్లు అందకపోవడం రైతు దురదృష్టం కాదు.. ప్రభుత్వ వైఫల్యం.

సాగునీటి నిర్వహణలో ముందుచూపు లేకపోవడం, అవసరమైన సమయంలో నీటిని అందించకపోవడం వల్ల వేలాది ఎకరాల్లో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. పంట చేతికందాల్సిన సమయంలో రైతు చేతిలో మిగిలింది ఎండిపోయిన పైరు.. అప్పుల భారం.. కన్నీళ్లే. రైతు పొలంలో నిలబడి పరిస్థితిని చూసే ప్రభుత్వం కావాలి.. కార్యాలయాల్లో కూర్చొని లెక్కలు చెప్పే ప్రభుత్వం కాదు కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్న ఈ సమయంలో ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనా వేయాలి. సాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపడంతో పాటు, పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తగిన పరిహారం అందించాలి.

రైతు కన్నీరు తుడిచే వరకు.. రైతు హక్కుల కోసం వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగుతుంది ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర స్వచ్ఛతా హి సేవ 2026




**బేతంచేర్ల సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** పట్టణంలో నగర పంచాయతీ లోని వార్డులు మార్కెట్ ప్రాంతాల్లోమున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్ ప్రజలకు అవగాహన నిర్వహించారు ప్లాస్టిక్ నిషేధంసింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని చెత్త వేరుచేయడం చెత్తను ఇంటి వద్దనే నాలుగు రకాలుగా వేరుచేసి మున్సిపల్ చెత్త బండికి అందించాలని తెలియజేయడమైనది పరిసరాల శుభ్రతఇళ్లతో పాటు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరడమైనది మరుగుదొడ్ల వినియోగం వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలని రోడ్లు కాలువలలో చెత్త వేయవద్దు రోడ్లు మురుగు కాలువలలో చెత్త వేయకూడదని అలా వేస్తే దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించడమైనది మొక్కలు నాటడం కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు మధు శానిటేషన్ మరియు సచివాలయ సిబ్బంది మున్సిపల్ ఉద్యోగులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సిఐఐ భాగస్వామ్య సదస్సు

- 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహణ
- ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
- నగరంలోని జేఎన్టీయూలో ముందస్తుగా ఏర్పాట్లను పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ, జిల్లా కలెక్టర్



**అనంతపురంకలెక్టరేట్, సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో వచ్చే అక్టోబర్ 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ (ఏపీ ఈ డి బి ) ఆధ్వర్యంలో సిఐఐ (కాన్ఫడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ ) పార్టనర్షిప్ సుమ్మిట్ - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించబోతుండగా, ఇందుకు సంబంధించి ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ (ఏపీఈడిబి) సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం సిఐఐ భాగస్వామ్య సదస్సు - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నేపథ్యంలో నగరంలోని జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో, అతిథి గృహంలో ముందస్తుగా ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ, జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏపీఈడిబి సీఈఓ మాట్లాడుతూ సిఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో కార్యక్రమానికి వచ్చే డెలిగేట్స్, వీఐపీల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేఎన్టీయూలో ఆడిటోరియం అందంగా కనిపించాలని, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ముందుగానే పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, జేఎన్టీయూ అతిథి గృహం, తదితర ప్రాంతాల్లో పర్యటించి సీఈఓ పలు సూచనలు జారీ చేశారు.

ఈ సిఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, సీనియర్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొంటారు. జిల్లాలో ప్రాధాన్యత రంగాలకి అనుగుణంగా ఉన్న స్థానిక అవకాశాలను ప్రదర్శించడం, పెట్టుబడి అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడం, మరియు ప్రాంతీయ ఎంఎస్ఎంఈలు మరియు పరిశ్రమలను జాతీయ మరియు ప్రపంచ భాగస్వాములతో అనుసంధానించడం చేపట్టనున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ మేనేజర్ అనంత్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, జేఎన్టీయూ విసి సుదర్శన్ రావు, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్డీవో ప్రేమంతకుమార్, తహసీల్దార్ రాజా, నెడ్ క్యాప్ మేనేజర్ కిరణ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారులు, ఇంచార్జి హార్టికల్చర్ జిల్లా అధికారి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రతో పరిశుభ్రతకు పెద్దపీట

- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**మడకశిర, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర పథకంతో పరి శుభ్రత ప్రభుత్వ పెద్ద పీఠం వేసిందని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ తెలిపారు. మడకశిర నగర పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తో పాటు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనం, ప్రజల భాగస్వామ్యంతో మడకశిరను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. మొక్కలు నాటి నీరు పోసి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు.

పరిశుభ్రమైన మడకశిర, పచ్చని మడకశిర లక్ష్యంగా మనమందరం పాటు పడుదామని కమిషనర్ మురళిదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ అధికారులు, సిబ్బంది, నాయకులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ హై లెవెల్ కమిటీ పిఎసి స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం

### హాజరైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు రఘువీరా రెడ్డి



**మడకశిర, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** విజయవాడ లోని ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన హై లెవెల్ కమిటి పిఎసి, స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటి సమావేశం నకు మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు,

రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటి చైర్మన్ డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశం నకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ, ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ పివి మోహన్ కు రఘువీరారెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు పళ్ళంరాజు, జేడీ శీలం,సి డబ్ల్యూసి సభ్యుడు కొప్పుల రాజు,కాంగ్రెస్ వర్కింగ్ కమిటి ప్రత్యేక ఆహ్వానితులు మాజీ ఎమ్మెల్సీ, గిడుగు రుద్రరాజు, ఎఐసిసి కార్యదర్శి ప్రసాద్, తులసి రెడ్డి, మస్తాన్, కమలమ్మ తదితరులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్



**మడకశిర, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులనుఎమ్మెల్యే స్వయానా స్వీకరించారు.

ప్రజాదర్బార్లో ప్రధానంగా పింఛన్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు, ఇతరాత్ర సమస్యలపై అర్జీలు రావడం విశేషం. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే, తక్షణమే స్పందించి ఆయా శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఫీజులు ముఖ్యమా..? విద్యార్థి జీవితం ముఖ్యమా..?



**నిజామాబాద్, సెప్టెంబర్ 19 (మనం బ్యూరో):** ఫీజులు ముఖ్యమా..? విద్యార్థి జీవితం ముఖ్యమా..? అనే ప్రశ్నలు బోధన్ సమీపంలోని ఆచన్పల్లి వద్ద ఆటోనగర్లో ఉన్న ప్రజ్ఞ రెసిడెన్షియల్ (హాస్టల్) పాఠశాల యాజమాన్యంపై తలెత్తుతున్నాయి. మొదటి టర్మ్ ఫీజు రూ.25 వేలు చెల్లించలేదనే కారణంతో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని హాస్టల్లోకి అనుమతించలేదని అతని తండ్రి ఆరోపించారు. ప్రస్తుతం తన వద్ద ఫీజు చెల్లించేంత మొత్తం లేదని, ఒక నెల గడువు ఇస్తే తప్పకుండా చెల్లిస్తానని కోరినా యాజమాన్యం అంగీకరించలేదని తెలిపారు.

**ఐదు గంటల పాటు వేడుకున్నా.. ఫలితం లేదని ఆవేదన..**

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం., శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాఠశాలకు వెళ్లి తన కుమారుడిని హాస్టల్లోకి అనుమతించాలని యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. మొదటి టర్మ్ ఫీజుగా రూ.25 వేలు చెల్లించాల్సి ఉందని, అవి కడితేనేగాని అనుమతి లేదని అన్నారని తెలిపారు. ప్రస్తుతం ఆ మొత్తం తన వద్ద లేదని వివరించి, ఒక నెల గడువు ఇవ్వాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యాజమాన్యాన్ని పలుమార్లు వేడుకున్నప్పటికీ తన విజ్ఞప్తిని అంగీకరించలేదని, చివరకు తన కుమారుడిని హాస్టల్లోకి అనుమతించలేదని ఆయన ఆరోపించారు.

**నిజామాబాద్ కలెక్టర్‌ను కలవనున్న బాధితుడు...**

తన కుమారుడి చదువు కొనసాగించేలా తగిన పరిష్కారం చూపించాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా కలెక్టర్ను కలిసి సమస్యను వివరించనున్నట్లు బాధితుడు తెలిపారు. పాఠశాల యాజమాన్యం తన కుమారుడిని తిరిగి హాస్టల్లోకి అనుమతించేలా, విద్యకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరనున్నట్లు చెప్పారు.

**విద్యాశాఖ అధికారులు స్పందించాలి...**

ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించాలని బాధితుడు కోరుతున్నారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థిని హాస్టల్లోకి అనుమతించకుండా ఉండటానికి సంబంధించి ఏమైనా నిబంధనలు ఉన్నాయా..? ఉంటే వాటిని పాఠశాల యాజమాన్యం ఎలా అమలు చేస్తోంది..? విద్యార్థి విద్య, భద్రతకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి..? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ఫీజుల వసూళ్లతో పాటు విద్యార్థుల విద్య, భవిష్యత్తు, భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని బాధితుడు పేర్కొన్నారు.

# రెడ్‌క్రాస్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



**కామారెడ్డి, సెప్టెంబర్ 19 (మనం ప్రతినిధి):** జిల్లా భారత రెడ్క్రాస్ సొసైటీ పాలకమండలిలోని 15 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికలను రహస్య బ్యాలెట్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహిస్తామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు ఎన్.వై. గిరి తెలిపారు. ఎన్నికల అధికారి టి. ప్రశాంత్రెడ్డితో కలిసి నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబరు 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఐడీఓసీ కలెక్టరేట్లోని గది నంబరు 2లో నామినేషన్లు స్వీకరిస్తారు. 25న పరిశీలన, 26న మధ్యాహ్నం 1 గంట వరకు ఉపసంహరణకు అవకాశం. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది అభ్యర్థుల జాబితా, గుర్తులు ప్రకటిస్తారు. అక్టోబరు 4న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. అభ్యర్థులు క్రిమినల్ రికార్డు లేనివారై ఉండాలని, ఫారమ్-2తో పాటు రూ.10 వేల నాన్రిఫండబుల్ రుసుము చెల్లించాలని అధికారులు తెలిపారు. ఓటర్లు ఫొటో గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9989487624లో సంప్రదించవచ్చు.

# ఇరాన్‌లో అమెరికాకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన




**కైరో, సెప్టెంబర్ 19 :** అమెరికాకు వ్యతిరేకంగా తమ ధిక్కార స్వరాన్ని వినిపించేందుకు ఇరాన్ ప్రజలు శుక్రవారం లక్షల సంఖ్యలో రహదారులపై గుమిగూడారు. ఈ కార్యక్రమానికి ''జాన్‌ఫదే ఎ ఇరాన్'' (ఇరాన్ కోసం ప్రాణత్యాగం)అని నామకరణం చేశారు. గత ఫిబ్రవరిలో అమెరికా ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై దాడి చేసిన నాటి నుంచీ ఎన్నడూ లేనంత సంఖ్యలో ప్రజలు వీధుల్లో గుమిగూడారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అమెరికాకు వ్యతిరేకంగా ఆయుధాలు చేతపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రదర్శనకారులు ప్రతినబూనారు. అమెరికా తన నౌకాశ్రయాలను దిగ్బంధించడంతోపాటు సరికొత్తగా విధించిన ఆంక్షలు ఆర్థికంగా పెనుభారంగా మారినప్పటికీ ప్రజలందరూ సమైక్యంగా తన వెంటే ఉన్నారని చాటుకునేందుకు ఇరాన్ ప్రభుత్వం ఈ ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రజలు ముందుకొచ్చి ఆయుధాలు చేతపట్టి యుద్ధరంగంలోకి దిగుతామని ప్రతినబూనిన నేపథ్యంలో ఎందరికి ఆయుధ శిక్షణ అందిస్తారన్నది వెంటనే తెలియలేదు. యుద్ధంలో పాల్గొనేందుకు తాము సిద్ధమేనని సుమారు ఆరు లక్షల మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చారనీ, పది లక్షల మంది ఆయుధ శిక్షణలో పాల్గొనే అవకాశం ఉందని టెహరాన్ భద్రతా చీఫ్ జనరల్ హసన్ హసందేహ్ వెల్లడించారు. మరోవైపు హర్మూజ్ జలసంధిలో మరో చమురు నౌకపై తాము దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది.

# అగ్రరాజ్యాల్లో ఎన్నికల సందడి

## అమెరికాలో మధ్యంతర ఎన్నికలు షురూ..

## రష్యాలో పార్లమెంటుకూ..

**వాషింగ్టన్/మాస్కో, సెప్టెంబర్ 19 :** అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు)కు మధ్యంతర ఎన్నికల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. దేశాధ్యక్షుని పదవీ కాలం సగం పూర్తైనప్పుడు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. అందుకే వీటిని మధ్యంతర (మిడ్‌టర్మ్) ఎన్నికలని పిలుస్తారు. అమెరికా కాంగ్రెస్‌లోని 435 ప్రజా ప్రతినిధుల సీట్లకు, ఎగువ సభ అయిన సెనేట్‌లోని మూడో వంతు స్థానాలకు ఈ ఎన్నిక జరుగుతుంది. శుక్రవారం వ్యక్తిగత (ఇన్ పర్సన్) ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నవంబరు 3న తుది ఎన్నిక జరుగుతుంది. సాధారణంగా మధ్యంతర ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఆధిక్యత సాధించడం ఆనవాయితీ. అయితే ఈసారి ఎన్నికల్లో అధికార పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీకి మెజారిటీ



సాధించడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త ఎత్తు వేశారు. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఆధిక్యత దక్కితే అమెరికాలో ఓటు వేయడానికి హక్కున్న ప్రతి ఒక్కరికీ 5 వేల డాలర్లు డివిడెండ్‌గా అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అమెరికాలో విపరీతంగా పెరిగిపోయిన ధరలు, ఇరాన్‌తో యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో ఈ ఎన్నికలు జరగనున్నాయి.

**పుతిన్ పార్టీకే మళ్లీ మెజారిటీ?**

ఒకవైపు ఉక్రెయిన్‌తో యుద్ధంలో తలమునకలై ఉన్న రష్యా మరోవైపు తన దేశ పార్లమెంటు అయిన 'డుమా'కు ఎన్నికలు కూడా నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. మొత్తం 450 సీట్లకు ఓటింగ్ జరుగుతోంది. ఇందులో ప్రతి ఓటరూ రెండు బ్యాలెట్లపై తన ఓటు నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక ఓటు తాను కోరుకునే రాజకీయ పార్టీకి, మరొకటి పోటీకి నిలుచున్న అభ్యర్థికి వేయాలి. ఈ ఎన్నికలో అర్హులైన 11.1 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అత్యధిక సంఖ్యలో ఓటర్లు పోలింగులో పాల్గొనేందుకు వీలుగా ఎన్నికల ప్రక్రియను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అసలు విపక్షమే లేకుండా జరుగుతున్న ఈ ఎన్నికల్లో దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన 'యునైటెడ్ రష్యా' పార్టీ తిరుగులేని ఆధిక్యత సాధించనుంది. పుతిన్ ఆశీర్వాదం ఉన్న ఇతర పక్షాలు కూడా కొన్ని స్థానాలు నిలబెట్టుకోబోతున్నాయి.

# ముత్యంపేట ఆరోగ్య మందిర్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వైద్య సేవలతోపాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రోగులతో మర్యాదగా వ్యవహరించాలి
- అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, సెప్టెంబర్ 18 (మనంప్రతినిధి):** దోమకొండ మండలం ముత్యంపేటలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు సకాలంలో అందేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం, స్టోర్ రూమ్ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా నిల్వలను క్రమం తప్పకుండా పరిశీలించి, రోగులకు సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి రోగితో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఎంహెచ్ఓ వెంకట్, స్థానిక వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజు..

- మళ్లీ షాకిచ్చిన ట్రంప్




**వాషింగ్టన్, సెప్టెంబర్ 19 :** హెచ్-1బీ వీసా దరఖాస్తులపై విధించిన లక్ష డాలర్ల ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఈ వీసాల ద్వారా విదేశీ ఉద్యోగులను నియమించుకునే సంస్థల నుంచి మరో ఏడాదిపాటు ఫీజు వసూలు చేసేలా ఆదేశాలు ఇచ్చారు. తాజాగా దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై సంతకాలు చేశారు.

సాధారణంగా ఈ వీసా దరఖాస్తుల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసింది. ఆ నిబంధన తీసుకువచ్చిన ఏడాది సమయం పూర్తవుతున్న సమయంలో ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో 12 నెలల పాటు ఈ పెంపును పొడిగించింది. 2025లో తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఐటీ సేవలను అవుట్‌సోర్సింగ్ ఇస్తున్న కంపెనీల హెచ్-1బీ రిజిస్ట్రేషన్లలో 92 శాతం తగ్గుదల నమోదైందని అమెరికా ప్రభుత్వం పేర్కొంది. దీంతో అమెరికన్ కార్మికులు, గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. అత్యంత నైపుణ్యం కలిగిన వారిని మాత్రమే కంపెనీలు నియమించుకునేలా చూడటం తమ ప్రధాన ఉద్దేశమని ట్రంప్ సర్కార్ చెప్తూ వస్తోంది. అమెరికా హెచ్-1బీ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న విదేశీయుల్లో భారతీయులు ముందువరుసలో ఉన్నారు.

అమెరికాలో విద్యార్థి వీసాలపై ఉండి హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారికి ఈ ఫీజు వర్తించదు.

అమెరికా విడిచి వెళ్లకుండా.. ఇప్పటికే ఉన్న వీసాల స్టేటస్‌ను మార్చుకునేందుకు వచ్చిన దరఖాస్తులకు ఈ ఫీజు నుంచి మినహాయింపు ఉంది. అయితే, బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తుదారులు మాత్రం ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఈ లక్ష డాలర్ల రుసుమును అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో సవాలు చేయగా ఆ ఫీజు చట్టవిరుద్ధమని తీర్పు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ అంశం ఇతర ఫెడరల్ కోర్టుల్లో విచారణ దశలో ఉంది. ఈ ఫీజుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ లక్ష డాలర్ల ఫీజును మరో ఏడాది పాటు పొడిగిస్తూ ట్రంప్ ఇప్పుడు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.



# రష్యా ఆంక్షల బిల్లుపై సంతకం

## భారత్‌పై 100 శాతం సుంకాలకు ట్రంప్‌నకు పవర్

**వాషింగ్టన్, సెప్టెంబర్ 19 :** రష్యా, ఇరాన్, చైనా, భారత్‌లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాలపై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది. 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది.

దీంతో భారత్, చైనాతో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా సుంకాలు విధించనుంది. ఈ చట్టంపై ఇప్పటికే భారత్ స్పందించింది. రష్యాపై ఆంక్షలను, తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చరించింది. అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. భద్రతా మండలి ఆమోదం లేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఈ చట్టంతో ట్రంప్‌నకు లభించిన అధికారాలు ఇవే..

రష్యా నాయకత్వంపై ఆంక్షల విధింపు,ఇంధన రంగంపై ఆంక్షల విధింపు.. ఇప్పటికే ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ చమురు సరఫరా చేసే నౌకల షాడో ఫ్లీట్‌పైనా ఆంక్షలు విధించడానికి అధ్యక్షుడికి అధికారం దక్కుతుంది

రష్యా చమురు, గ్యాస్‌లపై ఆధారపడటాన్ని తగ్గించేలా ఒత్తిడి తెస్తూ భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించే అధికారం.. ఇరాన్‌పై మరిన్ని ఆంక్షల విధింపునకు ఈ చట్టం అమోదం లభిస్తుంది.

# అమెరికాకు షాకిచ్చిన రష్యా, చైనా

**వాషింగ్టన్, సెప్టెంబర్ 19 :** పశ్చిమాసియా యుద్ధం వేళ అమెరికాకు రష్యా, చైనా షాక్ ఇచ్చాయి. యూఎస్ శత్రు దేశం ఇరాన్‌కు అండగా నిలిచాయి. ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షల అమలును పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన ఐక్యరాజ్యసమితి నిపుణుల కమిటీ గడువును మరో ఏడాది పాటు పొడిగించాలనే అమెరికా ప్రతిపాదనను రష్యా, చైనా వీటో చేశాయి. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలుగా వీటో అధికారాలు ఉన్న ఈ రెండు దేశాలు గురువారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా తీర్మానాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి. యూఎన్‌లో అమెరికా తీర్మానంపై ఓటింగ్ జరగ్గా, ఈ ప్రతిపాదన 11-2 ఓట్ల తేడాతో ఓడిపోయింది. కాగా, రష్యా, చైనాల వీటో అధికారాన్ని వాడుకోగా, సోమాలియా, పాకిస్థాన్‌లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత ఆర్నెల్లుగా ఇరాన్‌తో భీకరంగా యుద్ధం నేపథ్యంలో టెహ్రాన్‌ను ఆర్థికంగా ఏకాకిగా చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.



# వైట్‌హౌస్‌లోకి మీడియా నిషేధం

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం



**వాషింగ్టన్, సెప్టెంబర్ 19 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. వైట్‌హౌస్‌లోకి సీఎన్ఎన్, ఎంఎస్‌నౌ, పొలిటికో వార్తా సంస్థల ప్రవేశంపై నిషేధం విధించారు. తనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. తనపై ప్రతికూల వార్తలు రాసే మరిన్ని వార్తా సంస్థలపైనా భవిష్యత్తులో వేటు తప్పదని పేర్కొన్నారు. మరోవైపు గ్రీన్లాండ్‌కు సంబంధించి డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. గ్రీన్లాండ్ భద్రతపై డెన్మార్క్, గ్రీన్లాండ్‌లతో శాశ్వత ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం గ్రీన్లాండ్ భద్రత, ఇతర అవసరాలపై అమెరికాకు శాశ్వత నియంత్రణ ఉండనుంది. తమ అనుమతి లేకుండా ఏ దేశాల స్థావరాలు ఇక్కడ ఏర్పాటు ఉండబోదని తెలిపారు. త్వరలోనే గ్రీన్లాండ్‌లో భారీ సైనిక స్థావరం ఏర్పాటు చేస్తామని తన ట్రూత్ సోషల్ మీడియా ద్వారా డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు.

# రెండు రోజులుగా అంధకారంలో ఒకటో వార్డు ప్రజలు



అనంతగిరి, సెప్టెంబర్ 19(మనం న్యూస్): గత రెండు రోజులుగా విద్యుత్ లేక అంధకారంలో ఉంటున్నట్లు ఒకటవ వార్డు ప్రజలు తెలిపారు. మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలోని 1వ వార్డులో ప్రైవేటు స్థలంలో విపరీతంగా పెరిగిన చెట్లు విద్యుత్ తీగలకు ఉరితాళ్లుగా మారాయి.తీగలను తాకుతూ,అల్లుకుపోయిన కొమ్మల కారణంగా ప్రతిరోజూ షార్ట్ సర్క్యూట్ అయ్యి నిప్పురవ్వలు పడి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వార్డు ప్రజలు నరకం అనుభవిస్తున్నారు.గాలి వీచితే చాలు తీగలు తెగి ఇళ్లపై పడే ప్రమాదం ఉందని,ఏ క్షణంలో ఏం జరుగుతుందో అని ప్రాణ భయంతో 1వ వార్డు ప్రజలు భయంతో వణికిపోతున్నారు. రాత్రిళ్లు చిన్న పిల్లలు,వృద్ధులు ఉక్కపోతతో అంధకారంలో మగ్గుతున్నారు.విద్యుత్ శాఖ అధికారులు మాత్రం చెట్ల తొలగింపునకు సిద్ధంగా ఉన్నామని,స్థల యజమాని అనుమతి ఇస్తే చాలు వెంటనే జెసిబితో తొలగించి శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.అయినా స్థల యజమాని ఇప్పటి వరకు స్పందించకపోవడం పట్ల వార్డు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా స్థల యజమాని మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి చెట్ల తొలగింపునకు సహకరించాలని,లేని పక్షంలో అధికారులే చర్యలు తీసుకొని గ్రామస్తుల ప్రాణాలను కాపాడాలని 1వ వార్డు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉత్తుత్తి...ఆర్భాటం...!



## అబద్దాలతో ఆయకట్టు దారులను బురిడి కొట్టిస్తున్న మంత్రి ఉత్తమ్

## మాజీ మంత్రి,ఎమ్మెల్యే జగదీష్ ఆగ్రహం

## నిరుద్యోగ మేళ్ల పేరిట మరో మాయ మాజీ ఎమ్మెల్యే బొల్లం

## పట్టభద్రుల ఓట్ల కోసమేన ఈ తంతు

సూర్యాపేట, సెప్టెంబర్ 19 (మనం ప్రతినిధి): ఆ రెండు నియోజకవర్గాలు... పక్కపక్కనే ఉంటాయి.. ఒక నియోజకవర్గం తెలంగాణకు ముఖద్వారంగా ఉంటున్న కోదాడ కాగా... మరొకటి సిమెంట్ పరిశ్రమలకు పేరు మోసిన హుజూర్నగర్ సెగ్మెంట్... ఈ రెండు నియోజకవర్గాల్లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి దంపతులు... చెప్పిందే హవ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హుజూర్నగర్ సెగ్మెంట్ సిమెంట్ పరిశ్రమల యాజమాన్యుల నుండి ఏదో ఒక రూపైన సమకూర్తున్న ఆదాయాన్ని ఉపయోగించుకొని ఏదో ఒక విషయం తెలపైకి తెచ్చి అందరినీ బురిడీ కొట్టించటమే ఆయన లక్ష్యంగా కనబడుతుంది గత ఏడాది లాగానే ఈ ఏడాది కూడా నిరుద్యోగ మేల అంటూ ఆర్భాటంగా ఇంటర్వ్యూలను నిర్వహించడం తెలిసిందే గత ఏడాది ఎదురైన అనుభవం మరవక ముందే ఈ ఏడాది కూడా నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టే ప్రయత్నం మంత్రి చేయడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది గత ఏడాది ప్రకటించిన విధంగా కాకుండా.. అసంపూర్తిగా ఇంటర్వ్యూలను నిర్వహించి మామ అనిపించుకునే విషయాన్ని నిరుద్యోగులు గుర్తు చేస్తున్నారు నిరుద్యోగమేల నిర్వహణ విషయమై... విపక్ష పార్టీ అగ్గిమీద గుగ్గిలం అవుతుంది.. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్ల మల్లయ్య ఇటీవల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై విమర్శల వర్షం కురిపించారు నిరుద్యోగులను మభ్యపెట్టడానికి... సిమెంట్ పరిశ్రమల నుంచి మెర్పానీ పొందడానికి విద్యావంతులను బురిడీ కొట్టిస్తున్నాడంటూ ఘాటు విమర్శలతో దుమ్మెత్తి పోశాడు త్వరలోనే పట్ట బద్రుల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లబ్ధి పొందేందుకే మంత్రి ఉత్తమ్ నిరుద్యోగుల మెప్పు పొందేందుకు వ్యూహాత్మ కంగా వ్యవహరిస్తున్నారని ఇదే విషయమై మాజీ మంత్రి కూడా తన దైన శైలిలో స్పందిస్తూ శనివారం విలేకరుల సమావేశంలో ఉత్తమ్ తీరుపై ఆగ్రహ ఆవేశాలు వ్యక్తం చేశారు..

**వసూళ్ల మేళ: మాజీ ఎమ్మెల్యే బొల్లం...**



ఎమ్మెల్సీ ఎన్నికల్లో డేటా కోసం నిరుద్యోగులకు బురిడీ కొట్టించేందుకు ఈ బూటకపు నాటకానికి నిదర్శనమే ఈ జాబ్ మేళా అని మాజీ కోదాడ శాసనసభ్యులు బొల్ల మల్లయ్య యాదవ్ విమర్శించారు. రెండు మూడు పత్రికలను అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రచార అర్బాటాలతో దుబార ఖర్చు చేసి సిమెంట్ ఫ్యాక్టరీల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను కల్పించకుండా కమిషన్ల కోసం కక్కుర్తి పడ్డ ఉత్తమ్ నేడు నిరుద్యోగులకు సిమెంట్ ఫ్యాక్టరీలు మల్టీనేషన్ కంపెనీలు అంటూ ఊదరగొడుతూ 300 కార్పొరేట్ కంపెనీలు మేళాలో పాల్గొంటాయి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడూ గుర్తు రాని నిరుద్యోగ యువత ఉపాధి ఇప్పుడు ఉద్యోగాలు గుర్తొచ్చాయా ఉత్తమ్ అంటూ ఎద్దేవా చేశారు..నిరుద్యోగులు, రైతులు, దళితులను మోసం చేస్తూ, తమ రాజకీయ పబ్బం గడుపుకుంటూ నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 4,000 నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో మోసం చేసి ఇప్పుడు జాబ్ మేళా పేరుతో కొత్త డ్రామాకు తెర లేపాడని బొల్లం మండిపడ్డారు.

ఈ జాబ్ మేళాలో మొదట 25 వేల ఉద్యోగాలు రెండోసారి 3500 తీరా చూస్తే ఇప్పుడు ప్రైవేట్ కంపెనీలను తెచ్చి నిరుద్యోగులను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి, మినరల్ ఫండ్స్, సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి బలవంతంగా నిధులు వసూలు చేసి తమ సొంత ప్రచారానికి వాడుకోవడం. హుజూర్నగర్ కోదాడ ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. మూడు నాలుగు పత్రికల్లో ఫుల్ పేజీ యాడ్స్ ఇచ్చుకుంటూ మీడియా మొత్తం కవర్ చేయాలని విలేకరుల సమావేశంలో ఉత్తమ్ చెబుతుంటే నవ్వుకునే పరిస్థితి ఏర్పడిందని బొల్లం పేర్కొన్నారు.

ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి తన సొంత శాఖలోనే అవినీతికి తెరలేపారని అవుట్ సోర్సింగ్ విధానంలో ఉన్న లష్కర్ పోస్టులను ఒక్కొక్కటి 3 లక్షల రూపాయలకు అమ్ముకున్నారని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని తొలగించి, కమీషన్ల కోసం కాంట్రాక్టర్ల ద్వారా కొత్త వారిని విధుల్లోకి తీసుకోలేదా అని బొల్ల మల్లయ్య ప్రశ్నల వర్షం కురిపించారు కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల్లో సాగునీరు, కరెంటు లేక పచ్చని పొలాలు ఎండిపోతున్నాయని . రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తు పట్టించుకునే నాథుడే లేడని, కనీసం రైతుల ఆక్రందనలను కూడా ఉత్తమ్ చెవి నా పడలేదా అని విమర్శించారు.

హుజూర్నగర్ సెగ్మెంట్ ప్రాంత నిరుద్యోగులకు సిమెంట్ ఫ్యాక్టరీలలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి, ఫ్యాక్టరీల యాజమాన్యాల వద్ద బస్తాకు రెండు రూపాయల చొప్పున కమీషన్లు వసూలు చేయడానికే మంత్రి, ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన లాకప్ డెత్ ఘటనలో బాధ్యులైన అసలు అధికారులను రక్షించి, ఒక బీసీ వర్గానికి చెందిన ఇన్స్పెక్టర్ ని బలిపశువును చేశారని గుర్తు. చేశారు. ఎన్నికల సమయంలో గ్రామాలను దత్తత తీసుకుంటామని చెప్పి, గెలిచిన తర్వాత కనీసం ఒక బడి, గుడి లేదా కనీసం ఒక బోరుబావి కూడా వేయించలేదని పద్మావతి ప్రజల సమస్యలను గాలికొదిలేసి కేవలం ఒక టూరిస్ట్ ఎమ్మెల్యేలా నియోజకవర్గానికి వచ్చిపోతున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా ప్రజల సమస్యలు గాలికొదిలేసి, సొంత ప్రయోజనాలు, కమీషన్ల కోసం పనిచేస్తున్న ఉత్తమ్ దంపతుల నిజస్వరూపాన్ని ప్రజలకి అర్థమైందని. ఇరిగేషన్ మంత్రిగా ఉండి. రైతన్నలకు. పూర్తిస్థాయిలో సాగునీరు అందించే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు.

**మంత్రి ఉత్తమ్‌కు రైతుల గోస పట్టదా: మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి**



మన జిల్లా మంత్రుల చేతగాని తనం అందరికీ అర్థమైంది..ఎడమ కాలువ రైతులను అన్యాయం చేస్తూ ఈఎన్సీ స్పష్టంగా ఉత్తర్వులు ఇచ్చి రైతుల గోసపుచ్చుకుంటున్నారని తూములన్నీ బంద్ పెట్టమని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ఏంటని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రాంత రైతులను ఎండబెట్టి ఖమ్మం వైరాకు నీటిని పంపే కుట్ర..ఇరిగేషన్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి, కలిసి ఉమ్మడి నల్లగొండ రైతాంగాన్ని మోసం చేయడం ప్రజలందరికీ అర్థమైందని విమర్శించారు.కాంగ్రెస్ ను నమ్మి నెత్తిన పెట్టుకున్నందుకు ప్రజలు అన్ని రంగాల్లో అవస్థలు పడుతున్నారని రైతులకు అన్యాయం చేస్తున్న ఈ ప్రభుత్వంపై జనం తిరుగుబాటు మొదలైందని ఒక్క ఎకరం ఎండినా ఆ బాధ్యత పూర్తిగా ఉత్తమ్, కోమటిరెడ్డి వెంక రెడ్డి ల బాధ్యత అని హెచ్చరించారు.పొలాలు ఎండబెడితే బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం చేసి పంటలను బతికిస్తామని ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి తేల్చి చెప్పారు.

# వినియోగదారులను మోసగిస్తున్న రిలయన్స్ స్మార్ట్

## డిస్ప్లేలో తక్కువ.. బిల్లులో ఎక్కువ వసూల్







నేరేడుచర్ల సెప్టెంబర్ 19 మనం న్యూస్ : ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో సామాన్యులను ఆకర్షిస్తున్న బడా సూపర్ మార్కెట్లలో వినియోగదారుల జేబులకు 'స్మార్ట్'గా చిల్లు పడుతోంది. వస్తువుల ర్యాక్ల వద్ద తక్కువ ధరల ట్యాగ్లు ప్రదర్శించి, తీరా బిల్లింగ్ కౌంటర్ వద్దకు వెళ్లేసరికి అధిక ధరలు వేసి మోసగిస్తున్న వైనం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని రిలయన్స్ మార్ట్‌లో వెలుగుచూసింది.

**వెలుగుచూసిన బిల్లింగ్ గోల్మాల్..**

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... నేరేడుచర్ల రిలయన్స్ మార్ట్కు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వినియోగదారులకు చేదు అనుభవం ఎదురైంది. షెల్ఫ్‌లో చూసిన రేటుకు, చేతికి వచ్చిన బిల్లులోని రేటుకు స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది. వస్తువు పేరు షెల్ఫ్‌లో చూపించిన రేటు బిల్లులో వేసిన రేటు వినియోగదారుడిపై పడ్డ అదనపు భారం పడుతుంది. కోల్గేట్ రూ. 206.00 చూపిస్తుండగా రూ. 217.75బిల్ పడుతుంది. అంటే అదనంగా రూ. 11.75, సర్ఫ్ ఎక్సెల్ వ్యాల్యూ ప్యాక్ ధర రూ. 114.00 ఉండగా రూ. 121.50 అంటే అదనంగా రూ.7.50 భారం మోపుతుంది. ఒక్కో వస్తువుపైనే సుమారు రూ. 7 నుంచి రూ. 12 వరకు అధికంగా బిల్లు చేస్తుండటాన్ని ఓ అప్రమత్తమైన వినియోగదారుడు గుర్తించి సిబ్బందిని ప్రశ్నించారు. అయితే సిస్టమ్ అప్డేట్ కాలేదనో, ఆఫర్ ముగిసిందనో సిబ్బంది దాటవేత ధోరణి ప్రదర్శించినట్లు బాధితుడు వాపోయాడు.

**రోజుకు వేలల్లో అక్రమ వసూళ్లు?...**

చాలామంది కొనుగోలుదారులు సూపర్ మార్కెట్లలో వస్తువులన్నీ ట్రాలీలో వేసుకుని, చివర్లో ఒకేసారి మొత్తం బిల్లు చెల్లించి వెళ్లిపోతుంటారు. ప్రతి ఐటమ్ను ప్రదర్శన రేటుతో సరిచూసుకునే తీరిక అందరికీ ఉండదు. దీన్నే ఆసరాగా చేసుకుని నిత్యం వందలాది మంది వినియోగదారుల నుంచి ఇలా అదనపు మొత్తాలను గుట్టుచప్పుడు కాకుండా దండుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక వినియోగదారుడిపై రెండు వస్తువులకే దాదాపు 19 వరకు తేడా వస్తే, రోజూ జరిగే వ్యాపారంలో ఎన్ని వేల రూపాయల అక్రమ లాభం గడిస్తున్నారో అర్థం చేసుకోవచ్చని మండిపడుతున్నారు.

**అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి**

వినియోగదారుల రక్షణ చట్ట ప్రకారం డిస్ప్లేలో చూపించిన రేటు కంటే ఒక్క పైసా ఎక్కువ వసూలు చేసినా అది తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. ఇలాంటి మోసపూరిత వ్యాపార విధానాలపై లీగల్ మెట్రాలజీ (తూనికలు-కొలతల శాఖ), పౌరసరఫరాల అధికారులు వెంటనే స్పందించి నేరేడుచర్ల రిలయన్స్ మార్ట్ పై తనిఖీలు నిర్వహించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని వినియోగదారుల హక్కులను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# భూభారతి రీసర్వే విజయవంతానికి ఇన్నోవేటివ్‌గా పనిచేయాలి

## ఆయిల్‌ఫామ్ సాగులో కరీంనగర్‌ను ఆదర్శంగా నిలపాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, సెప్టెంబర్ 19( మనం బ్యూరో ): భూభారతి రీసర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు వినూత్న ఆలోచనలతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులతో వ్యవసాయ అధికారులకు నిత్య సంబంధం ఉంటుందని, ఈ అనుబంధాన్ని సద్వినియోగం చేసుకుని రైతులను చైతన్యపరిచి రీసర్వేకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చేయాలని అన్నారు. శనివారం రాత్రి కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు.

**రైతులకు అవగాహన కల్పించాలి...**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీసర్వేలో వ్యవసాయ అధికారులు క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న సమయంలో రైతులకు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. రెవెన్యూ బృందాలు, సర్వేయర్లతో సమన్వయం చేసుకుంటూ రీసర్వే సజావుగా సాగేలా సహకరించాలని ఆదేశించారు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 70 గ్రామాల్లో రీసర్వే చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా, ప్రస్తుతం 16 గ్రామాల్లో రీసర్వే కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లతో వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియ విజయవంతానికి కృషి చేయాలన్నారు.

**శాఖల మధ్య సమన్వయం అవసరం....**

వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, ఉద్యానవన శాఖ అధికారులు మండల స్థాయి అధికారులతో సమన్వయంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రీసర్వే ప్రక్రియలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పాల్గొని రెవెన్యూ బృందాలు, సర్వేయర్లకు సహకరించాలని అన్నారు. అదే విధంగా ఆయిల్పామ్ సాగు విస్తరణకు రైతులకు నిరంతరం మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ). శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కిషన్‌రావు, ఆయిల్ఫెడ్ జిల్లా మేనేజర్ రోహిత్ చింతల, ఏడీఏలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.




# ఎక్సైజ్ సీఐ జయశ్రీని కలిసిన కలిసిన గౌడ సంఘం నేతలు

దుగ్గొండి, సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి: దర ఖాస్తు చేసుకున్న ప్రతి గీత కార్మికుడికి వెంటనే సభ్యత్వ కార్డులు ఇవ్వాలని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. ఈ మేరకు నర్సంపేటలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జయశ్రీని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వక ంగా కలిశారు. దుగ్గొండి, ముద్దునూరు, వెంకటా పురం గ్రామాల గౌడ సంఘాల నేతలు ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం అనంతుల రమేష్ గౌడ్ మాట్లాడారు. తాటి చెట్లు నరికే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాటి చెట్ల నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు త్వరితగతిన పరిహారం అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దెల సాంబయ్య గౌడ్, ముద్దు నూరు గౌడ సంఘం అధ్యక్షులు దుడ్డె కుమార్ గౌడ్, వెంకటాపురం గౌడ సంఘం ఉపాధ్యక్షులు కక్కెర్ల సాంబయ్య గౌడ్, గుండెబోయి న యుగంధర్ గౌడ్, బొమ్మగాని నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

# వారం రోజుల్లో సీఎం దృష్టికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య

## డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత

## ఇంటి స్థలంతో పాటు 10 లక్షలు కేటాయించాలి

## మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

## రెండవ రోజు దీక్షలకు సిపిఎం మద్దతు

నల్లగొండ,సెప్టెంబర్ 19 ( మనం ప్రతినిధి): నల్లగొండ నగర జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య పరిష్కారం కోసం వచ్చే వారం రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస నేత అన్నారు. టియుడబ్ల్యూ జె నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణ జర్నలిస్టుల స్థలాల కోసం చేపట్టిన రెండో రోజు దీక్షకు శనివారం నాడు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల కోసం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించడానికి జిల్లా మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తో కలిసి నల్లగొండ జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. జర్నలిస్టులు అడుగుతున్న ఇళ్లస్థలం న్యాయబద్ధమైనద ని, ధర్మం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం చేయాల్సిన బాధ్యత తాము చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు జర్నలిస్టులు సమాజానికి బ్యాక్ బోన్ పిల్లర్ల వంటి వారన్నారు. నల్లగొండలో జర్నలిస్టులు నిర్వహిస్తున్న దీక్షల వేదిక నుంచే సీఎం రేవంత్ రెడ్డికి రెండు చేతులు జోడించి కోరుతున్నానని, నల్లగొండలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తానే ముందు ఉండి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం పొందడం ఆత్మగౌరవం అన్నారు.

**మంత్రి కోమటిరెడ్డి జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చి ప్రతి ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు ఇవ్వాలి:మాజీ ఎమ్మెల్యే కంచర్ల**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే నల్లగొండ పట్టణ జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, ప్రతి రిపోర్టర్ కు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం తరఫున రూ.10లక్షలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో నల్లగొండ నగర జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన రెండవ రోజు దీక్షలకు సంఘీభావము ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ తాను శాసన సభ్యునిగా ఉన్న కాలంలో 113 మందికి ఇళ్ల స్థలాల పట్టాలకై... డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో నాలు ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని ప్లాట్లు కూడా విభజించడం జరిగిందని అన్నారు.

జర్నలిస్టులు అందరి దగ్గర దరఖాస్తులు కూడా స్వీకరించామని.. ఈలోగా ఎన్నికలు రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ ఆగిపోయిందని తెలియజేశారు. న్యాయమైన మీ కోరికను తీర్చవలసిన బాధ్యత నేటి మంత్రి, జిల్లా కలెక్టర్ పై ఉన్నదని, రెడీగా ఉన్న ప్లాట్లను ఫైల్ తెప్పించుకొని అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చే యాలని కోరారు.రాజకీయంగా ఎదిగి,ఉన్నత పదవుల్లో ఉన్నవారు అధికారంలో రాగానే జర్నలిస్టులను మర్చిపోతున్నారని.. మీకు న్యాయంగా రావలసిన ఇళ్లస్థలాల కోసం పోరాటం ఉధృతం చేయాలని సూచించారు సూచించారు. మీకు ఇండ్ల స్థలాలు దక్కేవరకు ప్రభుత్వం పై పోరాటం చేయాలని అందుకు బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ మాజీ శాసనసభ్యుని గా తన సహకారం ఎప్పుడూ ఉంటుందని, మీకోసం ఎక్కడికి రావడానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు..

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షకు సీపీఎం మద్దతు సిపిఎం మద్దతు నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి , సీపీఎం పార్టీ నాయకులు దండంపెల్లి సత్తయ్య , కేఈపిఎస్ జిల్లా నాయకుడు పాలడుగు నాగార్జున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాలని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనే డిమాండ్ న్యాయమైనదని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం టి యు డబ్ల్యు జె నల్లగొండ జిల్లా కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. టి యు డబ్ల్యు జె నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, యూనియన్ నాయకులు దోటి శ్రీనివాస్, మాధురి యాదగిరి, , జిల్లా యాదయ్య, ఆశ్వక్ అహ్మద్, అబ్బోజు మదనాచారి, పిట్టల రామకృష్ణ, వంగాల శ్రీనివాసరెడ్డి, కత్తుల యాదగిరి, చింత యాదగిరి, ఎండీ సయ్యద్, సోమ చంద్రశేఖర్, తెలగమల్ల దశరథ, ఉయ్యాల లింగయ్య గౌడ్, రమేష్, జాజాల కృష్ణ, రమేష్, చెనగోని గిరిప్రసాద్, మేకల వెంకటరెడ్డి, రెడ్డిపల్లి యాదగిరి, చేపూరి రవి, , సుధాకర్, వెంకన్న, సూరారపు రాంప్రసాద్, నగరా భాస్కర్, కంది సూర్యనారాయణ, అశోక్, గంగాధర వెంకటేశ్వర్లు, స్వామి, తాటికొండ సత్తిరెడ్డి, డి ఎస్ యాదవ్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.



# తల్లి పాలె అమృతం

టేకుమట్ల, సెప్టెంబర్ 19(మనం న్యూస్): తల్లిపాలే పిల్లలకు అమృతం అని అంగన్వాడి సూపర్వైజర్ మాధవి అన్నారు. టేకుమట్ల మండలంలో వెలిశాల సెక్టార్లో రాఘవపూర్ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సంవత్సరముథీమ్ వచ్చేసి'మన అంగన్వాడి మన బాధ్యత' తల్లులకు, పిల్లలకు పోషణ అవసరం మీ పిల్లలు వయసుకు తగ్గ బరువు లేదా ఎత్తుకు తగిన బరువు ఉన్నప్పుడే వాళ్లు శారీరకంగా మానసికంగా ఎదుగుదల ఉంటుంది. పిల్లలు ఆరోగ్యంగా ఉండా లంటే గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, ఎక్కువగా మీపిల్లలకు పెట్టి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని తల్లులకు గర్భిణీలకు బాలింతలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబాల కిరణ్ మాట్లాడు తూ గర్భిణీ ఉన్నప్పుడే మన సీజనల్ లో దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని తల్లులకు సూచనలు ఇవ్వనైనది ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లలు, ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్వాడి టీచర్ కౌసల్య, సంధ్య,ఆశ వర్కర్ శ్రావణి, సారమ్మ సుజాత పాల్గొన్నారు.

## మంత్రిసీతక్కను కలిసిన అశోక్



ములుగు, సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి: ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు హైదరాబాద్లోని ప్రజాభవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అశోక్తో కలిసి కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అశోక్కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ ములుగు జిల్లాలో పార్టీ బలోపేతానికి అశోక్ నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కష్టకాలంలో పార్టీ శ్రేణులకు అండగా నిలవడంతో పాటు ఎన్నికల సమయంలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ విజయానికి కృషి చేయడం అశోక్ ప్రత్యేకత అని సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పైడాకుల అశోక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజలకు, పార్టీకి మరింత సేవ చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు అశోక్కు శుభాకాంక్షలు తెలియజేసి ఆయనతో కలిసి కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.

# మల్లూరు ఆలయ అభివృద్ధికి కార్యాచరణ

## త్వరలో క్షేత్ర పర్యటన.. డిజైన్ ఖరారు కల్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం ఏర్పాటుకు చర్యలు

ములుగు, సెప్టెంబర్ 19, మనం ప్రతినిధి: జిల్లాలోని ప్రసిద్ధ మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సచివాలయంలో ఆలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆర్కిటెక్టులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలపై చర్చించారు. మల్లూరు క్షేత్ర చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సూచించారు.

### భక్తులకు మెరుగైన వసతులు

అభివృద్ధి పనుల్లో భాగంగా కల్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలను సమకూర్చడంతోపాటు ఆలయ పరిసరాల ప్రత్యేకతకు అనుగుణంగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రధాన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, క్షేత్ర పవిత్రతను కాపాడుతూ పనులు చేపట్టాలని సీతక్క స్పష్టం చేశారు. ప్రస్తుత నిర్మాణ స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనుల రూపకల్పన చేయాలని సూచించారు.

### త్వరలో క్షేత్రస్థాయి పరిశీలన

అభివృద్ధి పనులకు సంబంధించిన డిజైన్ను ఖరారు చేసేందుకు త్వరలో మల్లూరు ఆలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం అనువైన డిజైన్ను ఖరారు చేయనున్నారు. నిర్మాణాలకు సంబంధించిన భూమి స్థితిగతులు, నిర్మాణ సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు రాక్ టెస్ట్ను త్వరితగతిన నిర్వహించాలని నిర్ణయించారు. దాని నివేదిక ఆధారంగా తదుపరి నిర్మాణ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయనున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితోపాటు అవసరమైన మౌలిక వసతులు అందేలా మల్లూరు క్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, సమన్వయంతో, భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాలని ఆదేశించారు.



## అశోక్ రాజకీయంగా మరింత ఉన్నతస్థాయికి ఎదగాలి

మంగపేట,సెప్టెంబర్ 19, మనం ప్రతినిధిః మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి,మిఠాయిలు పంచుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ,ప్రజల మన్ననలు పొందుతున్న అశోక్ రాజకీయ ప్రస్థానంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. ఈ జన్మదిన వేడుకల్లో ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆక రాధాకృష్ణ,జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య,శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగేంద్రబాబు,ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పల్లికొండ యాదగిరి,మైప లాలయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసరికాని హరికృష్ణ,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య,మైనారిటీ సెల్ అధ్యక్షులు హిదయతుల్లా,జిల్లా నాయకులు తుడి భగవాన్ రెడ్డి,మండల నాయకులు చిన్నపెల్లి రాంబాబు, శానం సత్యనారాయణ,ఎండీ హుస్సేన్, కుర్సం లక్ష్మీపతి,పొడెం నాగేశ్వరరావు,గూడూరు రంజిత్, మాటూరి పరమేష్,ఆక సతీష్ , మండల సోషల్ మీడియా ఇంచార్జీ భూక్యా కుమార్తో పాటు మండల నాయకులు,అన్ని అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మారుమూల తండాలో వికసించిన పుష్పం

- ఉదయ్ శ్రీ కి కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ పట్టా

మహబూబాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్)ః గూడూరు మండలంలోని మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం ( తీగల వేణి ) నివాసురాలైన కమ్యూనిస్టు ప్రజాపంథానాయకుడు, మాజీ సర్పంచ్ బానోతు మంగీలాల్, లలిత గార్ల పెద్ద కూతురైన బానోతు ఉదయశ్రీ ఈరోజు నిజామాబాదులోని తెలంగాణ యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందడం అభినందనీయం... ఏది ఏమైనా వారి కుటుంబం కమ్యూనిస్టు లా సిద్ధాంతం ప్రకారం నీతి, న్యాయం, ధర్మానికి కట్టుబడి ఉంటూ తమకు చేతనైన వరకు ఇతరులకు నిస్వార్థంతో పనిచేస్తూ ముగ్గురు ఆడ బిడ్డలకు చదివిస్తే సర్వజన, విశ్వజననీ ఆశీర్వాదంతో ముగ్గురు ఆడబిడ్డలు డాక్టరేట్ పొందడం అమోఘం, అద్భుతం నేడు వారి కుమారుడు కూడా ఉన్నత చదువులు చదువుతున్నాడు... నేటికీ వారి కుటుంబానికి రెక్కాడితే డొక్కాడని పరిస్థితులు ఉన్నా ఆత్మాభిమానని చంపుకోకుండా ఎవరి కింద ' అర్రు ' లు చాచని వ్యక్తిత్వం ఉన్నవాళ్లు అంటూ ఆ గ్రామ పరిసర ప్రాంతవాసులు అనడం వెలకట్టలేనిదని అభినందనీయమని అనేకమంది ప్రశంసిస్తున్నారు ఈ విషయం తెలిసి సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత, నర్సంపేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ హుటాహుటి గా నిజమాబాదుకు బయలుదేరి తనకు ఆడబిడ్డలు లేరు అని దుఃఖ స్వరంతో అభినందిస్తూ... శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పిఆర్టియుటిఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక




టేకుమట్ల సెప్టెంబర్ 19(మనం న్యూస్): టేకుమట్ల మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పిఆర్టియుటిఎస్ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు ఎండి హకీమ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి పిఆర్టియు టీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రేగూరి సుభాకర్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షులుగా ఎండి హకీమ్, ప్రధాన కార్యదర్శిగా పప్పుల సునీల్, అసోసియేట్ అధ్యక్షులుగా సోమిడి స్వామి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా వి.ఉమాదేవి, మండల ఉపాధ్యక్షులుగా పసరగొండ నరేష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఛిజి.అర్చన, మండల కార్యదర్శిగా సంగినేని పృథ్వీరాజ్, మహిళా కార్యదర్శిగా ఎం. నవత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు తోట మహేందర్ , గుండా రమేష్ , జిల్లా ఉపాధ్యక్షులు మేకల సదయ్య , కళాల ముత్యం రెడ్డి , సీనియర్ సభ్యులు నారాయణ రెడ్డి , కుసుమ గిరిబాబు , వంతడుపుల రఘు , రావుల రామచంద్రు ,భుజేంద్రచారి , మామిడి ప్రకాష్ , మోజస్ , వరప్రసాద్ ,శరత్ చంద్ర , హరికృష్ణ , పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్సి, పాత పెన్షన్ విధానం అమలు, హెల్త్ కార్డుల మంజూరు, పెండింగ్ డిఏలు, పెండింగ్ బిల్లులు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి త్వరలో సాధిస్తామని తెలిపారు. సంఘ పటిష్టతకు ప్రతి ఒక్క ప్రాథమిక సభ్యుడు కృషి చేయాలని ఈ సమావేశంలో పిలుపునిచ్చారు.



## అనాథాశ్రమంలో పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు

ములుగు, సెప్టెంబర్ 19, మనం ప్రతినిధి: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను ములుగు అసెంబ్లీ అధ్యక్షుడు మారం సుమన్రెడ్డి ఆధ్వర్యంలో అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ములుగు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ఖాన్ హాజరై చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి అశోక్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇస్సార్ఖాన్, మారం సుమన్రెడ్డి మాట్లాడుతూ.. పైడాకుల అశోక్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న అశోక్ రాజకీయ ప్రస్థానంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు.

అనాథాశ్రమంలోని చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించడం ద్వారా అశోక్ సేవా స్ఫూర్తిని చాటారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మైపాల్రెడ్డి, శివ, వెంకటేష్, శరత్, రఘు, సమీర్, హరీష్, చింటూతోపాటు పలువురు పాల్గొని అశోక్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## టేకుమట్ల పోలీస్ స్టేషన్ తనిఖీ




టేకుమట్ల సెప్టెంబర్ 19 మనం న్యూస్ః టేకుమట్ల పోలీస్ స్టేషన్ను భూపాలపల్లి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఏ. సంపత్ రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్కు చేరుకున్న సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఏ. సంపత్ రావుకు టేకుమట్ల ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి విధి నిర్వహణకు సంబంధించిన అంశాలను, ఎదుర్కొంటున్న సమస్యలను, సంక్షేమానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది యొక్క మంచి చెడులను తెలుసుకొని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన సూచనలు చేశారు.

తదుపరి పోలీస్ స్టేషన్ పరిసరాలను, కార్యాలయ గదులను, సిబ్బంది వసతి మరియు ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం టేకుమట్ల పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల వివరాలను ఎస్ఐ ని అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్లో ఉన్న కేసుల పరిస్థితి, కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తును నిబంధనల ప్రకారం, నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఎస్ఐకి సూచించారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి డీఎస్పీ ఏ. సంపత్ రావు సూచించారు.ఈ కార్యక్రమం లో చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్గ్. సతీష్ , టేకుమట్ల ఖిఐ ఎ. అమూల్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతి రీ-సర్వేపై గ్రామస్థులకు అవగాహన



నల్లబెల్లి, సెప్టెంబర్ 19, మనం ప్రతినిధి: నల్లబెల్లి మండలం అర్షనపల్లి గ్రామంలో భూభారతి రీ-సర్వేపై నిర్వహించిన గ్రామసభలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి రీ-సర్వే ప్రక్రియ, భూ వివరాల నమోదు, సర్వే సమయంలో భూ యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీ-సర్వే ద్వారా కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు. రీ-సర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు గ్రామస్థులు అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రతి భూ యజమాని తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, వివరాల్లో ఏవైనా తేడాలు, అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. భూ రికార్డులలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవడం ద్వారా భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, నల్లబెల్లి తహసీల్దార్ కృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి కృషి చేసిన నేత పైడాకుల

వెంకటాపురం, సెప్టెంబర్ 19,మనం ప్రతినిధి: ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను వెంకటాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. మంత్రి సీతక్కకు అశోక్ ఎల్లవేళలా చేదోడు-వాదోడుగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను సమర్థంగా ముందుకు తీసుకెళ్లడంలో అశోక్ కీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దొంతరబోయిన కుమార్, రామప్ప ట్రస్ట్ బోర్డు చైర్మన్ మిల్కూరి ఐలయ్య, జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ కొంపెల్లి రాజిరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి మేకల రాజేష్, లక్ష్మీదేవిపేట సర్పంచ్ బొమ్మకంటి వంశావతి-రమేష్, మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు అన్నబోయిన రాజు, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బూస గణేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్కే జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు గొల్లేన వెంకటేష్, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నోజు శ్రీనివాస్, భీంరావు, రాజమొగిలితోపాటు జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




టేకుమట్ల సెప్టెంబర్ 19 మనం న్యూస్ః ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడిఓసి కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలసి డా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బోధన, మార్గనిర్దేశంతో ఎంతోమంది విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్లు, వైద్యులు, ఇంజినీర్లు సాఫ్ట్వేర్ ఇంజినీర్లు తదితర రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు.

### తన చిన్ననాటి విద్యాభ్యాసాన్ని గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే

ఘన్పూర్ ప్రభుత్వ పాఠశాలలో మాస్టర్గా పనిచేసిన తన గురువు గోపాల్రావు ఉచితంగా ట్యూషన్ చెప్పి తన విద్యాభివృద్ధికి తోడ్పడ్డారని తెలిపారు. తాను సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో 8, 9, 10 తరగతులు చదువుకున్నానని, ఈ స్థాయికి ఎదగడానికి తన గురువులు అందించిన విద్య, మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ నియామకాలను పునరుద్ధరించి, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో 11 వేలకుపైగా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధన, ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు అల్పాహారం, విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు.

విద్యార్థుల అభివృద్ధితో పాటు సమాజ పురోగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్శర్మ అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబంలో తల్లిదండ్రుల తర్వాత పిల్లలు పాఠశాలలో ఉపాధ్యాయులనే ఆదర్శంగా భావిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో మంచి గుణాలు, క్రమశిక్షణ, విలువలు పెంపొందించడంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు దిశానిర్దేశం చేస్తారని అన్నారు. గురువుల బోధన, మార్గదర్శకత్వంతో విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దబడటమే కాకుండా కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. తాను కూడా ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చినవాడినని కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. తన తండ్రి రిటైర్డ్ ప్రిన్సిపల్గా, తల్లి రిటైర్డ్ లెక్చరర్ గా సేవలందించారని తెలిపారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ఆకాంక్షిస్తారని స్పష్టం చేశారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులు సైతం బోధనా వృత్తిని ఎంతో గౌరవించి, ప్రేమించారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు యువతను సన్మార్గంలో నడిపిస్తూ, మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, మున్సిపల్ ఛైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ ఛైర్మన్ అంబాల శ్రీనివాస్ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా.. పార్టీకి బలంగా



గోవిందరావుపేట, సెప్టెంబర్19, మనం ప్రతినిధి: ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను గోవిందరావుపేట మండల కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించాయి. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద, పసరలోని రామాలయం వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పస్ర రామాలయం వద్ద వినాయక మండపంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ.. అశోక్ పదవి కోసం కాకుండా పార్టీ కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా కార్యకర్తల కోసం పనిచేస్తున్న నాయకుడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా, పార్టీ విజయమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.

### ఎన్నికల సమరంలో అలుపెరగని పోరాటం...

అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ అభ్యర్థుల విజయానికి అశోక్ కృషి చేశారని వెంకటకృష్ణ తెలిపారు. సభలు, సమావేశాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటిస్తూ కార్యకర్తలను కలవడం, ప్రజలకు పార్టీ విధానాలను వివరించడం, కార్యకర్తల్లో ధైర్యం నింపడం వంటి కార్యక్రమాలను చేపట్టారని చెప్పారు. ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేశారని అన్నారు.

### తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ...

తండ్రి పైడాకుల కృష్ణమూర్తి ఆశయాలను కొనసాగిస్తూ, మంత్రి దనసరి అనసూయ సీతక్క అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ నిర్మాణంలో అశోక్ కీలక పాత్ర పోషిస్తున్నారని వెంకటకృష్ణ అన్నారు. కార్యకర్త కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం, వారి విజయాన్ని తన విజయంగా భావించడం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిందన్నారు. సేవా కార్యక్రమాలు, పార్టీ పట్ల అంకితభావం, కార్యకర్తల పట్ల ఆత్మీయతతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతకు ప్రత్యేక గౌరవం తీసుకొస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, సహకార సంఘ అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, కనతల నాగేందర్రావు, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు చింత క్రాంతి, జీవంజి జనార్ధన్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చొప్పదండి వసంత, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భైరి అభిలాష్, గొంది కిరణ్, కాడబోయిన రవి, బూర సురేందర్, జక్కు రణదీప్తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇవే నా చివరి ఆసియా గేమ్స్ కావొచ్చు: స్టార్ షట్లర్




భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్. ప్రణయ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడలే తనకు చివరివి కావొచ్చని తెలిపాడు. ''మరో నాలుగేళ్ల తర్వాత ఇదే స్థాయిలో ఆడుతానో లేదో తెలీదు. బహుశా ఇవే నా చివరి ఆసియా క్రీడలు కావొచ్చు. ప్రస్తుతం శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నా. ఇటీవల వియత్నాం ఓపెన్లోనూ కొంతకాలం తర్వాత మంచి ప్రదర్శన చేశాను. గత ఆసియా క్రీడల్లో స్వర్ణాన్ని తృటిలో చేజార్చుకున్నాం. ఈసారి ఫైనల్కు చేరి బంగారు పతకం గెలుస్తామని ఆశిస్తున్నా'' అని ప్రణయ్ చెప్పుకొచ్చాడు.

అయితే 2028లో లాస్ఏంజెలెస్లో జరిగే ఒలింపిక్స్ ఆశలను మాత్రం అతడు వదులుకోలేదు. ''ఎల్ఏ 2028ఏ నా లక్ష్యం. రాబోయే ఏడాదిన్నర వరకు గట్టిగా ప్రయత్నిస్తా. ఒలింపిక్స్కు వెళ్లే అవకాశం ఉందని అనిపిస్తే కొనసాగుతా. లేకపోతే ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటా. కిదాంబి శ్రీకాంత్ కోర్టులో చూపిస్తున్న పట్టుదల నాకు స్ఫూర్తినిస్తోంది. అతన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. నేనూ అలా ఆడగలననే నమ్మకం వస్తుంది'' అని పేర్కొన్నాడు. డబుల్స్ స్టార్ ఆటగాడు చిరాగ్ శెట్టి మాట్లాడుతూ.. ''నిరుడు రజతం సాధించాం. గతాన్ని పక్కనపెట్టి ఈసారి అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తాం. కోర్టులో చెలరేగే పులుల్లా ఆడి.. దేశానికి బంగారు పతకం అందిస్తాం. రాబోయే పది రోజుల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా'' అని పేర్కొన్నాడు.




## 'రాత్రంతా నిద్రపోలేదు.. పొద్దునే ఇలా.. నాకిది గర్వకారణం'

జపాన్ వేదికగా ఆసియా క్రీడలు- 2026 ఘనంగా మొదలయ్యాయి. ఈ ఆరంభ వేడుకల్లో ఒలింపిక్ పతకాల విజేత, షూటర్ మనూ భాకర్తో పాటు.. కబడ్డీ ఆటగాడు పవన్ సెహ్రావత్ ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరించారు. నిజానికి తొలుత మనూ భాకర్తో కలిసి షాట్పుటర్ తజిందర్ పాల్ సింగ్ తూర్ ఫ్లాగ్ బేరర్గా ఎంపికయ్యాడు.

**ఊహించని అవకాశం**

అయితే, కిట్ ఆలస్యంగా రావడం వల్ల మనూకు జతగా ఉన్న మరో భారత పతాకధారిని మార్చాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పవన్ సెహ్రావత్కు ఊహించని విధంగా ఫ్లాగ్ బేరర్గా అవకాశం వచ్చింది. మనూ భాకర్తో కలిసి అతడు భారత పతాకధారిగా వ్యవహరించాడు.

**రాత్రి అసలు నిద్రపోనేలేదు**

ఈ నేపథ్యంలో పవన్ సెహ్రావత్ మాట్లాడుతూ.. ''నాకిది అత్యంత గర్వించదగ్గ క్షణం. నిజానికి మాకు ప్రాక్టీస్ షెడ్యూల్ ఉంది. అందుకు తగినట్లుగానే మేమంతా ప్రాక్టీస్కు సిద్ధమయ్యాము. రాత్రి అసలు నిద్రపోనేలేదు. పొద్దునే జిమ్కు వెళ్లి నేరుగా స్టేడియానికి వచ్చేశాను. రాత్రంతా నేను మేల్కొనే ఉన్నాను. అయినా సరే జాతీయ పతాకాధారిగా వస్తున్నానని తెలిసి ఎక్కడా లేని ఉత్సాహం, శక్తి వచ్చాయి. నిజంగా నాకు ఇది గర్వకారణం.

**ఆమె ఒక స్ఫూర్తిదాయక అథ్లెట్**

నిజానికి నాకు ఫ్లాగ్ బేరర్గా అవకాశం వచ్చిందని ఈరోజు ఉదయమే అందరికీ చెప్పాను. అయితే, మా అన్నయ్య అంకుర్కు మాత్రం గత రాత్రే మెసేజ్ చేశాను. ఇక మనూ భాకర్ గురించి ప్రత్యేకంగా నేను చెప్పాల్సింది ఏమీ లేదు. ఆమె ఒక స్ఫూర్తిదాయక అథ్లెట్. ఇంతకు ముందే ఆమెను ఓసారి కలిశాను. ఒలింపిక్ పతక విజేతతో కలిసి ఫ్లాగ్ బేరర్గా ఉండటం గర్వించదగ్గ విషయం. మా జట్టును ఉద్దేశించి మనూ గతంలో స్ఫూర్తిదాయక ప్రసంగం ఇచ్చారు. ఇప్పుడిలా ఆమెతో కలిసి నేను పతాకధారిగా ఉండటం ఊహించని విషయం'' అని పేర్కొన్నాడు. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం పవన్ సెహ్రావత్కు సంబంధించిన వీడియోను విడుదల చేసింది.



# వైభవ్లో ఆ స్కిల్స్ లేవు.. టెస్టు క్రికెట్కు సెట్ కాడు

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే తన విధ్వంసకర బ్యాటింగ్తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన వైభవ్.. భవిష్యత్తులో టెస్టు ఫార్మాట్ లో రాణించడానికి ఇబ్బంది పడతాడని పనేసర్ అభిప్రాయపడ్డాడు.

అండర్-19 తో పాటు ఐపీఎల్ లోనూ సంచలన ప్రదర్శన చేసి భారత సీనియర్ జట్టులోకి అడుగు పెట్టిన వైభవ్.. తన అద్భుతమైన ఆటతీరుతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. అఫ్గానిస్తాన్ తో టీ20 సిరీస్ కు ఎంపికైనప్పటికి తుది జట్టులో మాత్రం ఈ చిచ్చర పిడుగుకు చోటు దక్కలేదు. కాగా సూర్యవంశీ కేవలం వైట్ బాల్ క్రికెట్ లోనే కాదు సుదీర్ఘ ఫార్మాట్ లోనూ రాణిస్తున్నాడు.

ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్ లోనూ ఈస్ట్ జోన్ తరపున సూర్యవంశీ సత్తాచాటాడు. అంతకుముందు ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన యూత్ టెస్టు సిరీస్ లోనూ అతడు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అయినప్పటికి వైభవ్ టెస్టు క్రికెట్ లో విజయవంతం కాలేడని పనేసర్ వ్యాఖ్యనిచండం గమనార్హం.

'వైభవ్ సూర్యవంశీ టెస్టు క్రికెట్ లో సక్సెస్ అవుతాడని నేను అనుకోవడం లేదు. అతడి ఆ స్థాయికి తగ్గ స్కిల్స్ లేవు. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్ లో టెస్టులు, టీ20లు రెండింటిలోనూ టాప్-10లో కొనసాగుతున్న ఏకైక బ్యాటర్ హ్యారీ బ్రూక్ మాత్రమే' అని పనేసర్ పేర్కొన్నాడు.



# నా దృష్టిలో అందమంటే అదే.. బాడీ షేమింగ్పై స్పందించిన కత్రినా

నటి కత్రినా కైఫ్ శరీరాకృతిపై కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో అనవసరపు చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఆమెపై వచ్చిన ట్రోల్స్ను ఖండిస్తూ పలువురు సినీ ప్రముఖులు నటికి మద్దతుగా నిలిచారు. తాజాగా ఈ అంశంపై కత్రినా పరోక్షంగా స్పందించారు. తన దృష్టిలో అందం అంటే ఆరోగ్యంగా ఉండడమేనని అన్నారు.

ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ప్రారంభంలో కఠినమైన అందాల కొలతలకు ప్రాధాన్యం ఇచ్చేదాన్నని.. అయితే సమయంతో పాటు అందంపై తన దృక్పథం పూర్తిగా మారిపోయిందని కత్రినా తెలిపారు. ''నేను పరిశ్రమకు వచ్చిన తొలినాళ్లలో అందం అంటే.. ఇలానే ఉండాలి అని కొన్ని నియమాలు పెట్టుకున్నాను. కానీ, ఇప్పుడు నా దృష్టిలో అందంగా ఉండటం అంటే.. మనకి మనం ఉన్నతంగా కనిపించడమే. మన శరీరాన్ని ఆరోగ్యంగా కాపాడుకుంటూ.. మనసును ప్రశాంతంగా ఉంచడమే అసలైన సౌందర్యం. పైకి కనిపించేది అందం కాదు.. మనం ఎంత ఆత్మవిశ్వాసంతో ఉన్నామనేది ముఖ్యం'' అని కత్రినా అన్నారు.

ప్రసవానంతరం బరువు పెరిగారంటూ కత్రినా కైఫ్పై వచ్చిన ట్రోల్స్ను సెలబ్రిటీలు ఖండిస్తున్నారు. తాజాగా నటి ఖుష్బూ కూడా దీనిపై పోస్ట్ పెట్టారు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత శరీరంలో అనేక హార్మోన్ల మార్పులు రావడం సహజమని, దానిని అర్థం చేసుకోకుండా హేళన చేయడం సరికాదని హితవు పలికారు. గతంలో తాను కూడా ఇలాంటి బాడీ షేమింగ్ విమర్శలను ఎన్నోసార్లు ఎదుర్కొన్నానని తెలిపారు. మహిళలు తమను తాము ప్రేమించుకోవడం ముఖ్యమన్నారు. అదే విమర్శకులకు మనమిచ్చే గట్టి సమాధానమని చెప్పారు.



# పురుషులకు కూడా నెలసరి రావాలి అప్పుడే ఆ బాధ తెలుస్తుంది: శ్రుతి హాసన్

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. విజయ్ సేతుపతితో కలిసి 'ట్రెయిన్', దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాలలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఓ వైపు నటిగా రాణిస్తూనే.. సింగర్గా కూడా పలు చిత్రాల్లో పాటలు పాడుతున్నారు. దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'లోనూ ఆమె ఒక పాటకు తన మధురమైన స్వరాన్ని అందించారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ శృతి హాసన్ పలు ఇంటర్వ్యూలో పాల్గొంటున్నారు. తాజాగా, సోహా అలీ ఖాన్ నిర్వహించిన ఒక ప్రత్యేక పాడ్కాస్ట్లో పాల్గొన్న శృతి హాసన్.. పీరియడ్స్ సమయంలో వచ్చే తీవ్రమైన నొప్పులు, వాటి గురించి సమాజంలో ఉండే అపోహలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) సమస్య ఉందని, దీని కారణంగా పీరియడ్స్ సమయంలో తాను చాలా బాధను అనుభవిస్తానని తెలిపారు. తన సినీ కెరీర్ ఆరంభంలో ఈ విషయాల గురించి మాట్లాడేందుకు తాను కొంచెం మొహమాటపడేదానినని, దీని గురించి ఎవరూ పెద్దగా చర్చించరని భావించానని శృతి చెప్పారు. కానీ తోటి నటులు తమ మోకాలి సర్జరీ వంటి సమస్యల గురించి చెప్పినప్పుడు డైరెక్టర్లు సెట్స్లో సర్దుబాటు చేసేవారని, తాను మాత్రం పీరియడ్స్ గురించి చెప్పడానికి సంకోచించేదానినని తెలిపారు. మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని, అప్పుడు ఆటోమేటిక్గా వర్క్ కాంట్రాక్ట్లో పీరియడ్ సెలవులు కూడా వచ్చి ఉండేవి కదా అని తాను అనుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా పురుషులకు కూడా నెలసరి రావాలని అప్పుడే మహిళలు పడే బాధ వాళ్లకు తెలుస్తుందని.. తాను దాదాపు 1000సార్లు దేవుడిని ప్రార్థించానని చెప్పారు. అయితే ఒకసారి తాను పీరియడ్ విషయం చెప్పినప్పుడు, ఆ దర్శకుడికి కూతురు ఉండటంతో ఆ కష్టాన్ని అర్థం చేసుకుని తనకు పూర్తి సహకారం అందించారని, ఆ సంఘటన తర్వాతే తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని ఆమె వివరించారు.



# విలన్గాపాత్రలు వస్తే నటించడానికి కూడా సిద్ధమే: భాగ్యశ్రీ బోర్సే

టాలీవుడ్ యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ అమ్మడు ఖాతాలో సరైన హిట్ పడలేదు. ఇక ఇటీవల భాగ్యశ్రీ 'లెనిన్' మూవీతో ఘనవిజయం సాధించి తన సత్తా చాటుకున్నారు. టాలీవుడ్, కోలీవుడ్లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ భామ ఫుల్ ఫామ్లో ఉంది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్ సరసన 'సెయాన్' చిత్రంలో హీరోయిన్గా నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా, ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమాలను ఎప్పుడూ జానర్ ఆధారంగా చూడనని, తనకు మాత్రం కథే ఎప్పుడూ మొదటి ప్రాధాన్యత అని భాగ్యశ్రీ స్పష్టం చేశారు. ఒక కథ నచ్చితే దాన్ని వదులుకునే ప్రసక్తే లేదని, దర్శకుడికి తనపై నమ్మకం ఉంటే.. ఆ పాత్రలో పూర్తిగా లీనమైపోతానని చెప్పారు. తాను కేవలం గ్లామర్ పాత్రలు లేదా హీరోయిన్గా మాత్రమే చేస్తానని చెప్పబోనని, తనలోని నటిని నిరూపించుకునే ఏ పాత్రనైనా చేయడానికి తాను సిద్ధమని తెలిపారు. తనను తాను సవాలు చేసుకునేలా విలన్ పాత్రలో నటించడానికి కూడా తాను వెనుకాడనని ఆమె తేల్చిచెప్పారు. తనలో తనకు బాగా నచ్చే లక్షణం తన మొండితనమని, తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని పేర్కొన్నారు. ఇక భాషల గురించి మాట్లాడుతూ.. తెలుగు, తమిళం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నానని, త్వరలోనే ఈ రెండు భాషల్లో బాగా మాట్లాడగలుగుతానని ఆశిస్తున్నానని చెప్పారు. నటిగా తనలో చాలా కలలు ఉన్నాయని భాగ్యశ్రీ చెప్పుకొచ్చారు.

# 'పిఠాపురంలో.. అలా మొదలైంది'

## హృదయాన్ని హత్తుకునే ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం

ప్రముఖ సీనియర్ దర్శకుడు మహేష్ చంద్ర ('ప్రేయసి రావే' ఫేమ్) తెరకెక్కించిన తాజా చిత్రం 'పిఠాపురంలో.. అలా మొదలైంది'. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పిఠాపురం నేపథ్యంగా ముగ్గురు ప్రేమ జంటలు, ముగ్గురు తండ్రుల కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. ముఖ్యంగా తండ్రీ-కూతుళ్ల మధ్య ఉండే పవిత్రమైన అనుబంధం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నేటి యువతకు అవసరమైన మంచి సందేశంతో పాటు ప్రేమ, సున్నితమైన హాస్యం, కుటుంబ సెంటిమెంట్ కలబోసిన చక్కటి ఫ్యామిలీ ఎంటర్టైనర్గా ఇది నిలిచింది. ఈ చిత్రానికి నూతన నటీనటులతో పాటు సీనియర్ నటుల అభినయం ప్రధాన బలంగా నిలిచింది. ప్రముఖ నటుడు డా. రాజేంద్ర ప్రసాద్ మరోసారి తండ్రి పాత్రలో జీవించి సినిమాకు ప్రాణం పోశారు. 'ఆ నలుగురు', 'ఇరుముడి' తరహా భావోద్వేగాలను ఆయన మరోసారి తెరపై ఆవిష్కరించారు. పిఠాపురం, హైదరాబాద్, గోవా వంటి రియల్ లొకేషన్లలో సహజమైన వాతావరణంలో షూటింగ్ జరపడం సినిమాకు మరింత ప్లస్ అయింది. ఎలాంటి వల్గారిటీ, బూతు మాటలకు తావులేకుండా కుటుంబం



అంతా కలిసి చూడదగ్గ చిత్రంగా దీనిని మలిచారు. హాస్యబ్రహ్మ డా. బ్రహ్మానందం వాయిస్ ఓవర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అయితే, కథలో సెంటిమెంట్ ,సందేశం మోతాదు కొంచెం ఎక్కువ కావడం వల్ల ద్వితీయార్థంలో సినిమా నెమ్మదించినట్లు అనిపించడం మైనస్గా చెప్పవచ్చు. గల్ఫ్ తదితర ప్రాంతాల్లోని ప్రవాస ఆంధ్రులకు, మన సంస్కృతి, తల్లిదండ్రుల విలువలను ఇష్టపడే వారికి ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది. దర్శకుడు మహేష్ చంద్రకు ఈ సినిమా మంచి కంబ్యాక్ ఇచ్చిందనే చెప్పాలి. రాజేంద్ర ప్రసాద్ అభిమానులకు, ఫ్యామిలీ ఆడియన్స్కు వారాంతంలో తప్పకనచ్చే చిత్రం ఇది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.